www.jagritiweekly.com
సంపుటి : 75 సంచిక : 37 పుటలు : 52

# జాగృతి

కలి 5125 - శ్రీ శోభకృత్ ఆషాఢ పూర్ణిమ
03-09 జూలై 2023
వెల : ₹20/-



'రాజ్యాంగం నిర్దేశించింది..
సుప్రీంకోర్టూ చెప్పింది...'



'వ్యవసాయ చట్టాల మాదిరిగా
తొందరపడకూడదు'



'దేశ ఐక్యతే
అసలు ప్రయోజనం'



'నిరంకుశత్వం కాదు,
నిర్మాణాత్మకం'



'విపక్షాల వ్యతిరేకతలో
హేతువెక్కడ?'



'ఆలస్యమైతే
భారతీయతకు నష్టం'



'ఒక దేశం ఒకే చట్టం'



'చట్టం అమలుతోనే
సామాజిక సమానత్వం'

## తక్షణ, చారిత్రక అవసరం

# ఉమ్మడి పౌరస్మృతి

ప్రత్యేక సంచిక

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

75 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక

75 సంవత్సరాల
జాగృతి
అక్షరమాలకు శుభాకాంక్షలు..



BHANINFO
Information Management Associates

# మొదటి ప్రపంచ యుద్ధవీరులకి నివాళి

20వ శతాబ్దంలో ప్రపంచం చూసిన అతి పెద్ద విషాదాలలో ఒకటి మొదటి ప్రపంచ యుద్ధం. ఆ యుద్ధంతో భారత్‌కు ఏమీ సంబంధం లేదు. అప్పుడు మన దేశం బ్రిటిష్ వలస. భారత స్వాతంత్ర్య సమరయోధుల భిన్నాభిప్రాయాల మధ్య భారతీయ సైనికులను ఆ యుద్ధానికి పంపింది బ్రిటిష్ ప్రభుత్వం. యుద్ధంలో **62,000** మంది చనిపోయారు. ఆ సంఖ్య తరువాత **74,187**కు పెరిగింది. మరొక **67,000** మంది గాయపడ్డారు. అతి దారుణమైన చలిలో, భయానకమైన ఎండలలో వారు యుద్ధం చేశారు. ఫ్రాన్స్ సరిహద్దులలో బెల్జియం దాటిన తరువాత కందకాలలో ఉండి సైనికులు యుద్ధం చేశారు. ఇంకా టర్కీ, ఇటలీలలో కూడా మనవాళ్లు యుద్ధం చేశారు. ఈజిప్ట్, పాలస్తీనా యుద్ధ రంగాలలో కూడా ఉన్నారు. ఇక్కడ చనిపోయిన వారికి భారత ప్రధాని జూన్ **25**న నివాళి ఘటించారు. ఈజిప్ట్‌లో పర్యటించిన నరేంద్ర మోదీ కైరో దగ్గరి హీలియోపోలిస్ (ఏడెన్) వద్ద నిర్మించిన భారత జవాన్ల కామన్వెల్త్ స్మారక చిహ్నం దగ్గర పూలు చల్లి నివాళి సమర్పించారు. ఇది **4,300** మందికి చెందిన స్మారకస్తూపం. అన్నట్టు మొదటి ప్రపంచ యుద్ధం జూలైలోనే ప్రారంభమైంది. (జూలై **28, 1914**–నవంబర్ **11,1918**)



Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. And published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య ) సంప్రదించండి.**

జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ 040-27561453/9959997013

## జాగృతి చందా - సూచనలు

**5 సం॥ల చందా రూ.4000, సంవత్సర చందా రూ.850, విడి ప్రతి రూ.20**

- ✦ అడ్రసులో పేరు, ఇంటి నెం., గ్రామం, మండలం, జిల్లా, పిన్‌కోడ్, మొబైల్ నెం. సమగ్రంగా ఉండాలి. లేకుంటే కంప్యూటర్ ఆమోదించదు.
- ✦ తాత్కాలిక రసీదు చేరిన 15 రోజుల తర్వాత చందా నెం., ప్రారంభ తేది వివరాలు మీకు ఎస్.ఎం.ఎస్. చేస్తాం. ఆ వెంటనే సంచిక కూడా అందుతుంది. మీరు చందా నెం. నోట్ చేసుకోవాలి.
- ✦ పత్రిక అందకపోతే వెంటనే సంప్రదించగలరు. చిరునామా మారితే కార్యాలయానికి విధిగా తెలపండి.

**చందా కట్టించే వారికి సూచనలు :**

- ✦ చందాలు వసూలు చేసి పంపేవారు తమ పూర్తిపేరు, సెల్ నెం. రాయాలి.
- ✦ రశీదుపై చందాదారుని పూర్తి చిరునామా, పిన్‌కోడ్, సెల్ నెం., ఈమెయిల్ ఉండాలి. వివరాలు jagritiweeklysub@gmail.comకు మెయిల్ చేయాలి.
- ✦ ఆన్‌లైన్/చెక్ ద్వారా కూడా చెల్లించవచ్చు. డబ్బు పంపాక 040-27561453/ 9959997013 నంబర్లకు తెలియజేయాలి.
- ✦ మరిన్ని వివరాలకు చందాపుస్తకంలో మొదటి రసీదు వెనుక చూడగలరు.

**చందా పంపవలసిన చిరునామా :**

- ✦ 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-500 027.

**జాగృతి బ్యాంకు ఖాతా వివరాలు :**

- ✦ **A/c Name & No. Jagriti Prakashan Trust, 92001006140532 5, Axis Bank, Kothapet Branch. IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**
- ✦ చెక్కు, డిడిపై **Jagriti Prakashan Trust** అని ఆంగ్లంలో రాయాలి.

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య )**

| | |
|---|---|
| కె. దుర్గారెడ్డి | అసోసియేట్ ఎడిటర్ |
| సబ్ ఎడిటర్ | 9959991304 |

డిజైనర్ : సిహెచ్. కుమార్


**మా**ర్పును స్వాగతించే లక్షణమే ఆధునికతకు మొదటి సంకేతం. చరిత్రలో చాలా ఘర్షణలు మార్పును స్వాగతించేవారికీ, అడ్డుకోవాలనుకునే వారికీ మధ్య జరిగినవే. ఏదో ఒకనాడు మంచి మార్పును స్వాగతించవలసిందే. మార్పును అంగీకరించే వాతావరణం ఏర్పడే వరకు వేచి ఉన్నా, ఒక దశలో మార్పు అవసరం తీవ్రమవుతుంది. అప్పుడు ఒక్క అడుగు చొరవ తీసుకోక తప్పదు. నేడు చర్చనీయాంశంగా ఉన్న ఉమ్మడి పౌరస్మృతి పరిస్థితి ఇదే.

ఈస్టిండియా కంపెనీ హయాంలోనే ఏకరూప చట్టం అవసరం గురించి మొదటి నివేదికవచ్చింది. ముస్లింపాలన, అది భారతీయ సమాజంలోకి తీసుకు వచ్చిన లక్షణాలు, తరువాత ఆంగ్లేయులు పాలకులు కావడం, ఆ పాలన ప్రభావంతో దేశానికి తోడైన పరిస్థితులు, ఇవన్నీ కంపెనీ పాలకులకు అర్థం కావడం, ఏకరూప చట్టం అవసరం అనుభవానికి రావడం ప్రథమ దశ.

ఏకరూపచట్టం అవసరంవచ్చేది మెజారిటీ, మైనారిటీ వైరుధ్యాలు ఉన్న చోటే. మిగిలిన ప్రతిసందర్భంలో ఈ కూడికనే జీవన వైవిధ్యం, భిన్నత్వంలో ఏకత్వం వంటి సమున్నత పదబంధాలతో శ్లాఘిస్తారు. కానీ వీరందరినీ ఒకే చట్టం పరిధిలోకి తీసుకురావాలని అంటే మాత్రం మెజారిటీ ప్రజల ఆధిపత్య ధోరణులు భాష్యాలు వినిపిస్తాయి. ఈ దేశంలో మెజారిటీ, మైనారిటీ వివాదాలు కొత్తకాదు. అవి ఒకటీ అరా కాదు. అయినా అన్ని సమయాలలో హిందువులు సమ్యమనం పాటించిన ఫలితంగానే ఈ దేశం అరాచకం వైపు నడవలేదు. ఇది నిజం. కానీ స్వతంత్ర భారతదేశాన్ని అత్యధిక కాలం ఏలిన పార్టీలు, వాటి ప్రభుత్వాలు మెజారిటీ, మైనారిటీ ప్రజల వివాదాలను పరిష్కరించే ప్రయత్నం చేయలేదు. కోర్టులు పరిష్కరించాలని చూసినా మద్దతు ఇవ్వలేదు. ఆ వైరుధ్యాల జోలికిపోతే దేశానికి మేలు కంటే కీడే ఎక్కువన్న భ్రమను కల్పించిపెట్టారు. అదే కొనసాగుతున్నది. అయినా ముస్లిం పాలన, ఆంగ్లేయుల పాలనల ఫలితంగా దేశంలో తయారైన దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి నిర్మాణాత్మక ప్రయత్నం జరుగుతున్నది ఇప్పుడే. ఏడున్నర దశాబ్దాల తరువాత కూడా వాటిని పరిష్కరించలేకపోతే అర్థం ఏమిటి? అది ఆ వైరుధ్యాల మంటతో

**శాలివాహన 1945 శ్రీ శోభకృత్ ఆషాఢ పూర్ణిమ**

### లోపలి పేజీలలో...




ముఖపత్ర కథనం
**ఇంకా ఇంకా వాయిదా వేసే ప్రయత్నం వద్దు**
6లో



ముఖాముఖి
**‘రాజ్యాంగం నిర్దేశించింది.. సుప్రీంకోర్టూ చెప్పింది...’**
9లో




ధారావాహిక నవల
**మహా సంకల్పం**
- చంద్రశేఖర ఆజాద్
26లో

# జాగృతి

## సంపాదకీయం

చలికాచుకునే యత్నమే. ఓట్ల రాజకీయమే. దీనిని ఆపాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం ఆరంభించింది.

మత విశ్వాసాల చుట్టూ తిరుగుతూ ఉండే సమస్యలను పరిష్కరించాలంటే రాజకీయ సంకల్పం ఉండాలి. అవసరమైతే పార్లమెంటులో చట్టాలు చేయాలి. రాజ్యాంగాన్ని సవరించాలి. అదీ కాకుంటే కోర్టులు ఇచ్చిన ఆదేశాలను శిరసావహించాలి. మొత్తానికి పరిష్కారమైతే చూడాలి. ఇప్పుడు జరుగుతున్నది అదే. వందేళ్లకు పైగా న్యాయస్థానాలలోనే ఉండిపోయిన అయోధ్య వివాదాస్పద కట్టడం, స్థల వివాదం మీద నవంబర్ 9,2019న సుప్రీంకోర్టు తుది తీర్పును

# కదలిరండి!

ప్రకటించింది. తీర్పు తమవైపు వచ్చిందన్న భావనను గాని, అందుకు సంబరాలు చేసుకోవడం గాని హిందువులు చేయలేదు. తమకు అయోధ్య పట్ల అత్యంత బలమైన మత విశ్వాసం ఉన్నప్పటికీ ఒక సివిల్ దావాలో గెలుపుగానే వారు భావించారు. జమ్ముకశ్మీర్ రాష్ట్రాన్ని అదుపు చేయడం భారత్‌కు సాధ్యం కాదనుకునే పరిస్థితులు తలెత్తిన సమయంలో ఆగస్ట్ 5, 2019న కేంద్ర ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంది. ఆ రాష్ట్రంలో అరాచకానికి రాజమార్గం చూపుతున్న 370 అధికరణాన్ని రద్దు చేసింది. ఈ అధికరణమే రద్దయితే దేశం బూడిద అయిపోతుందని బెదిరించినవారు కూడా ఉన్నారు. కానీ దాని రద్దుతో కశ్మీర్ శాంతించింది. ప్రజలు ఆనందించారు. పొరుగున ఉన్న పాకిస్తాన్‌లో మత మౌఢ్యం రాజ్యమేలుతోంది. సౌదీఅరేబియా అచ్చమైన ఇస్లామిక్ దేశం. ఆ రెండు దేశాలే కాకుండా, ఇంకొన్ని ముస్లిం దేశాలు కూడా నేడు తలాక్ సంప్ర దాయాన్ని తరిమికొట్టాయి. అందులో మహిళకు జరిగే అన్యాయం అలాంటిది. భారత్‌లో మాత్రం అది కొనసాగాలని కోరిన వారు ఉన్నారు. ఆ వాదన తప్పని నిర్ద్వంద్వంగా భావించిన నరేంద్ర మోదీ ప్రభుత్వం జూలై 30, 2019న ట్రిపుల్ తలాక్‌ను నిషేధించింది. ఏమైంది? టీవీ చర్చలలో ముల్లాలు, హిందూ ఉదారవాదులు చెప్పినట్టు అగ్నికీలలు ఎగసిపడలేదు. సరికదా ముస్లిం మహిళలు మిఠాయిలు పంచుకుని హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. సాధారణ ముస్లిం దీనిని స్వాగతించాడని చెప్పడానికి రుజువు– ఆ అన్ని సందర్భాలలోను దేశం ప్రశాంతంగా ఉంది. ఇవన్నీ షరియా, షరియా కేంద్రంగా సాగిన మోళీలే. ఇదే తరహాలో రాజ్యాంగ పునాది, సుప్రీం కోర్టు ఆదేశం కూడా ఉన్న ఉమ్మడి పౌరస్మృతిని కూడా అమలులోకి తీసుకురావాలని భారత ప్రభుత్వం సంకల్పించింది.

డాక్టర్ అంబేద్కర్, అల్లాడి కృష్ణస్వామి అయ్యర్, జస్టిస్ కృష్ణయ్యర్, వైవీ చంద్రచూడ్, జస్టిస్ చిన్నపరెడ్డి వంటి ఎందరో ఉమ్మడి పౌరస్మృతి తక్షణావసర మని నిర్ద్వంద్వంగా వెల్లడించారు. అయినా క్షమార్హం కానంత జాప్యం జరిగింది. ఇంకా జాప్యం చేయించే ప్రయత్నం నిరంతరాయంగా జరుగు తున్నది. బీజేపీ ఏం చేసినా మతం పేరుతో అడ్డుకోవాలన్న కుట్ర ఇందులోకి రావడం అనూహ్యంకాదు. కానీ యూసీసీలో కేవలం మతాన్ని చూపించడం విజ్ఞత కాదు. పైగా ఉద్దండ న్యాయనిపుణులు చెప్పిన మాట– అది స్త్రీలకు న్యాయం చేస్తుందనే. దేశ సమైక్యతను బలోపేతం చేస్తుందనే. అందరికీ సమాన హక్కులు అన్న రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టేదననే. ఇది చరిత్రాత్మక సందర్భం. 22వ లా కమిషన్ ఆదేశానుసారం దేశ ప్రజలంతా తమ తమ అభిప్రాయాలను తెలియచేయాల్సిన సమయం. 2018 నాటి వైఫల్యం పునరావృతం కారాదు. ఈసారి జాతి తడబడరాదు. రాజ్యాంగ స్ఫూర్తి భంగపడకూడదు. సుప్రీంకోర్టు ఆశయానికి గండి కొట్టకూడదు. పురోగమన దృష్టి ఉన్న ప్రతి భారతీయుడు, భారతీయ మహిళ తమ అభిప్రాయం లా కమిషన్ వారికి తెలియచేయాలి. ఇది ఇవాళ్టి మనందరి కర్తవ్యం. ★

3 జూలై 2023, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్




20లో

ముఖాముఖి

**‘వ్యవసాయ చట్టాల మాదిరిగా తొందరపడ కూడదు’**





| | | |
|---|---|---|
| విపక్షాల వ్యతిరేకతలో హేతువెక్కడ? | – | 16 |
| ముస్లింలకు అపోహలెందుకు? | – | 24 |
| నిరంకుశత్వం కాదు, నిర్మాణాత్మకం.. | – | 30 |
| ఆలస్యమైతే భారతీయతకు నష్టం | – | 34 |
| చట్టం అమలుతోనే సామాజిక సమానత్వం | – | 36 |
| మూలధన ఖర్చులో స్తబ్దత.. అచేతనంలో రాష్ట్రం (వేదిక) | – | 30 |
| భారత్–అమెరికా సంబంధాల్లో కొత్త అధ్యాయం (అంతర్జాతీయం) | – | 40 |
| అంతుచిక్కని ప్రేక్షకుల నాడి! (సినిమా) | – | 50 |



కొత్త పార్లమెంట్ భవనంలో సెంగోల్ (రాజదండం) ను ప్రతిష్టించడమంటే దేశాన్ని వెనక్కి తీసుకుపోవడమేనని ప్రతిపక్షాలు తేల్చేశాయి. రాజదండాన్ని నిలబెట్టడమంటే తిరోగమనమేనని ఉదారవాదులు, సెక్యులరిస్టులు సైతం నిర్ధారించారు. కానీ దేశం పురోభివృద్ధి చెందాలంటే ఉమ్మడి పౌరస్మృతి అవసరమని రాజ్యాంగం ఘోషిస్తున్నది. సుప్రీం కోర్టు చాలాసార్లు హెచ్చరించింది. సెంగోల్‌ను పార్లమెంట్‌కు తెచ్చిన ప్రభుత్వమే దానిని ప్రతిపాదిస్తున్నది. ఈ విషయం దగ్గర మాత్రం ఆ గొంతులలో వెలక్కాయలు దిగాయి. మైనారిటీలను ఓటర్లుగా చూస్తున్న పార్టీలు, బీజేపీ ఏం చేసినా వ్యతిరేకించడమే పనిగా పెట్టుకున్న సంస్థలు, ఆధునిక పరిజ్ఞానంతో దేశాన్ని, తమ వర్గాన్ని ఏడో శతాబ్దంలోకి ఈడ్చుకు వెళ్లాలని కంకణం కట్టుకున్న ముస్లిం మతోన్మాదులు ఏకం కావడం వల్ల దేశానికీ, సామరస్యానికీ, మహిళలకీ, సమాన హక్కుకు ఎవరూ తీర్చలేనంత చేటు జరిగింది.

# ఇంకా ఇంకా వాయిదా

ఉమ్మడి పౌరస్మృతి (యూనిఫామ్ సివిల్ కోడ్ యూసీసీ), లేదా ఏకరూప చట్టం తేవాలని బీజేపీ ప్రభుత్వం నడుం కట్టిన మాట నిజమే. ఆ అంశం ఆ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ఉన్న సంగతీ వాస్తవమే. అయినా అది రాజ్యాంగకర్తల ఆశయం. సుప్రీంకోర్టు ఆదేశం. ఆ కోణం నుంచి పరిశీలించాలి. రాజ్యాంగం చెబితే ఏమిటి? సుప్రీంకోర్టు ఆదేశిస్తే ఏమిటి? అలాంటి చట్టం పేరు చెబితే మైనారిటీ ఓట్లు పోతాయి కదా అని ఆలోచించడం అమానుషం. భారతీయులందరినీ మతం, ప్రాంతం, వర్గం, తరగతులతో సంబంధం లేకుండా ఒకే చట్టం పరిధిలోకి తీసుకురావడమే ఉమ్మడి పౌరస్మృతి లక్ష్యం. ఉమ్మడి నేరస్మృతిలాగే ఉమ్మడి పౌరస్మృతీ అందరికి ఒకే విధంగా వర్తిస్తుంది. వివాహం, విడాకులు, ఆస్తి వ్యవహారాలు, దత్తత స్వీకారం ఇవన్నీ పౌరులందరికీ ఒకే విధంగా అమలు చేయడమే దీని ఆశయం. దీనికి మూలం ఏమిటి? రాజ్యాంగంలోని 44వ అధికరణ. భారత భూభాగంలో ఉండే పౌరులందరికీ సమానంగా వర్తించే ఒక చట్టం తీసుకురావాలని అది స్పష్టం చేస్తున్నది. పర్సనల్ లా పరిధి నుంచి తప్పించి అందరికీ ఒకే చట్టం అమలు చేసే దిశగా జరుగుతున్న ప్రయాణమే ఉమ్మడి పౌరస్మృతి. 44వ అధికరణం చెబుతున్నదే ఒకే దేశం ఒకే చట్టం గురించి. ఈ అధికరణం ప్రాధాన్యం ఏమిటి? లక్ష్యం ఏమిటి? ఆదేశిక సూత్రాల గురించి చెప్పే అధికరణమిది. వివక్షకు గురయ్యే అవకాశమున్న వర్గాలను దాని నుంచి తప్పించడం, భిన్నత్వం కలిగిన భారతీయ సంస్కృతిలో సామరస్యం తీసుకురావడమే దాని ఆశయం. అదే సమయంలో వాస్తవికతను దృష్టిలో ఉంచుకున్న అధికరణ కూడా. ఉమ్మడి పౌరస్మృతిని తీసుకురావడం అవసరమే కానీ అది స్వచ్ఛందంగా జరగాలని అంటుంది. 35వ అధికరణాన్ని ముసాయిదా రాజ్యాంగంలో చేర్చినది కూడా ఈ ఉద్దేశంతోనే. దేశం సంసిద్ధంగా ఉన్నప్పుడు ఉమ్మడి పౌరస్మృతిని రాజ్యాంగంలో చేర్చాలి.

పర్సనల్ లా-మతం, కులం, విశ్వాసం, నమ్మకం ఆధారంగా ఆయా సమూహాలకు మాత్రమే వర్తించే చట్టం. ఈ చట్టంలోని సూత్రాలు కేవలం మత సంప్రదాయాలు, వాటి గ్రంథాలు నిర్దేశించినవి. హిందూ పర్సనల్ లా అయినా, ముస్లిం పర్సనల్ లా అయినా అలా ఏర్పడినవే. ఇలా ఆధునిక కాలానికి చెందని చట్టాలు, మత గ్రంథాల ఆధారంగా నిర్మించుకున్న నియమాల స్థానంలో ఆధునిక కాలానికి సరిపోయే చట్టాలను రూపొందించడమే ఉమ్మడి పౌరస్మృతి. ఈ వివాదం, తేవాలన్న ప్రయత్నం, తర్జనభర్జనలు వందేళ్ల నాటివి. ఇంత కాలానికైనా దేశ సమైక్యతకు అవసరమైన ఇలాంటి ఒక చట్టం తీసుకువస్తామని ఎన్నికల ప్రణాళికలో పెట్టిన పార్టీ మాత్రం భారతీయ జనతా పార్టీయే. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో కూడా ఉమ్మడి పౌరస్మృతి నిర్మాణం, అమలు తమ ఆశయమని బీజేపీ ప్రకటించింది. సంప్రదాయంలోని మంచిని తీసుకుని, సమాజం మొత్తాన్ని ఆధునిక కాలానికి తగినట్టు సామరస్యపూర్వక వ్యవస్థగా తయారు చేయడానికి ఉపకరించేదే ఉమ్మడి పౌరస్మృతి.

ప్రాథమిక హక్కుల రూపకల్పనకు ఏర్పాటు చేసిన ఉప సంఘం ఉమ్మడి పౌరస్మృతిని ఆదేశిక సూత్రాలలో చేర్చింది. ముసాయిదా రాజ్యాంగంలోని 35వ అధికరణం ఇలా చెప్పింది. 'భారత భూభాగంలో నివసించే పౌరులందరికీ వర్తించేటట్టు ఉమ్మడి స్మృతిని తీసుకురావడానికి రాజ్యం ప్రయత్నం చేయాలి' అని పేర్కొన్నది. ఉమ్మడి పౌరస్మృతి దేశానికి అత్యవసరమే అయినా, అందరి అంగీకారంతో స్వచ్ఛందగా తీసుకురావాలి అని ఆదేశించింది. ఇందుకు సంబంధించిన తీర్మానానికి ముస్లిం ప్రతినిధులు తీవ్ర నిరసన తెలియచేశారు. పర్సనల్ లాలో ప్రమేయం అంటే, ప్రాథమిక హక్కులలో జోక్యం కల్పించుకోవడమే అవుతుందని వారి వాదన. మహమ్మద్ ఇస్మాయిల్ సాహెబ్, నజీయుద్దీన్ అహమ్మద్, మహమ్మూద్ అలీ బేగ్ సాహెబ్ బహదూర్, బి, పోకర్‌సాహెబ్ బహదూర్ ముసాయిదా రాజ్యాంగంలోని ఆ 35వ అధికరణకు పలు సవరణలు సూచించారు. ఈ అధికరణంలోని ఏ అంశం వల్ల ప్రజల పర్సనల్ లాకు భంగం వాటిల్లకూడదన్న నిబంధన జోడించాలని చెప్పారు. ఏ వర్గం కూడా పర్సనల్ లాను వదిలిపెట్టడానికి సిద్ధంగా




లేదు. ఒకవేళ అందులో మార్పులు తీసుకురావాలని అనుకుంటే అది వర్గం ముందస్తు అనుమతితోనే జరగాలన్న వాదన కూడా వినిపించింది. దీనికి రాజ్యాంగ పరిషత్ సభ్యుడు అల్లాడి కృష్ణస్వామి అయ్యర్ సున్నితంగా వారి వాదనలను నిరాకరిస్తూనే, పౌర సంబంధాలలో, లావాదేవీలలో, ఆస్తి వ్యవహారాలకు సంబంధించిన అన్ని శాఖలలో పౌర స్మృతి ప్రమేయం ఉంటుందని తేల్చి చెప్పారు. రాజ్యం ఉమ్మడి పౌరస్మృతి తీసుకు రావాలని ఒక సాధారణ ప్రకటన చేస్తే దానికి ఎందుకు అభ్యంతరం ఉండాలని కూడా ఆయన అన్నారు. తరువాత కేఎం మున్షీ హిందూ చట్టం ముసాయిదాను సభ ముందుకు తెచ్చారు. ఈ బిల్లులోని అంశాలు మనువు, భారతదేశంలోను హిందూ స్త్రీకి న్యాయం వాయిదా పడింది. తరువాత ఆ చట్టం అమలులోకి వచ్చిఆ నష్టం కొంతవరకు భర్తీ అయింది. కానీ బ్రిటిష్ ప్రభుత్వం చివరిదశలో వ్యక్తిగత సమస్యల పరిష్కారానికి చట్టాల అవసరం పెరిగినప్పుడు హిందూ చట్టాల క్రోడీకరణకు బీఎన్ రావు కమిటీని నియమించారు. ఇదే హిందూ లా కమిటీ. ఉమ్మడి హిందూ చట్టం అవసరం గురించి పరిశీలించడమే ఈ కమిటీ పని. ఈ కమిటీ భారతీయ పురాతన స్మృతులను పరిశీలించి హిందూ చట్టం అవసరం గురించి సిఫారసు చేసింది. ఇది హిందూ మహిళకు కొంత మేరకు సమాన హక్కులు కల్పిస్తుంది. 1937 చట్టాన్ని సమీక్షించి హిందువుల వివాహం, వారసత్వం



# వేసే ప్రయత్నం వద్దు

యాజ్ఞవల్క్య స్మృతులలోని అంశాలకు సమాధానంగా ఉంటాయని కూడా అన్నారు. మనం పురోగమిస్తున్న వ్యవస్థలో ఉన్నామని, రాజ్య వ్యవహారాలలో మత ప్రమేయం లేకుండా జాగ్రత్త పడుతూ, దేశాన్ని ఐక్యం చేయడానికి, పటిష్టం చేయడానికి మనం పాటు పడాలని మున్షీ అన్నారు. అయితే ఈ అధికరణానికి సవరణలు చేయడానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వ్యతిరేకించారు. ఆయన ఉమ్మడి పౌరస్మృతి తేవడానికి పూర్తి అనుకూలంగా ఉన్నారు.

1950లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ హిందూ వివాహ వ్యవస్థ, సంరక్షణ, విడాకులు, ఆస్తి హక్కు వంటి అంశాల కోసం హిందూకోడ్ బిల్లును తీసుకురావాలని చూశారు. అప్పుడు కొన్ని ఛాందస వర్గాల నుంచి ప్రతికూలత ఎదురైంది. అలా స్వతంత్ర వంటి సమస్యల పరిష్కారానికి కూడా పౌర స్మృతిని రావు కమిటీ సిఫారసు చేసింది. బీఎన్ రావు కమిటీ ఇచ్చిన నివేదికనే భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన తరువాత 1951లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నాయకత్వంలోని ఎంపిక సంఘానికి చర్చ కోసం ఇచ్చారు. అయితే చర్చలు జరుగుతూ ఉండగానే హిందూ కోడ్ బిల్లుకు కాలదోషం పట్టింది. అయినా తిరిగి 1952లో సమర్పించారు. దీనినే 1956లో హిందూ వారసత్వ చట్టంగా ఆమోదించారు. వారసత్వానికి సంబంధించి హిందువులు, బౌద్ధులు, జైనులు, సిక్కులకు ఇది చట్టమైంది. దీనినే మరింత సంస్కరించి హిందూ చట్టంగా రూపొందించి ఆస్తిలో మహిళలకు హక్కును కల్పించారు. దీని ప్రకారమే మహిళలకు తండ్రి ఆస్తిలో హక్కు సంక్రమించింది.



మతం ఏదైనా స్త్రీకి పూర్తి న్యాయం చేసిందని చెప్పడం సాధ్యం కాదు.కారణం పర్సనల్ లాలు. షరియా అనే ముస్లిం పర్సనల్ లా నీడలో ముస్లిం మహిళ అనుభవిస్తున్న కష్టాలు వేరు. తలాక్ ఒక అమానుష ఆచారం. ఒక ముస్లిం నలుగురిని చేసుకోవాలని ఎక్కడా లేదంటున్నారు న్యాయ నిపుణులు. ఇంతమంది పిల్లలను కంటేనే ముస్లింగా గుర్తింపు వస్తుందని ఎక్కడైనా ఉందా అని కూడా వారు ప్రశ్నించారు. షరియా మాటున స్త్రీని విలాసవస్తువుగా, భోగకాంతగా కూడా మార్చేయడం ఒక వాస్తవమన్న వాదనలు ఉన్నాయి. ఇది దురదృష్టం. అరేబియా దేశాల నుంచి షేక్‌లు హైదరాబాద్ పాత బస్తీకి వచ్చి ముక్కు పచ్చలారని బాలికలను డబ్బిచ్చి తీసుకుపోవడాన్ని ఏమనాలి? ఒక ముస్లిం మతస్థుడు ఏదో ప్రాంతానికి వెళ్లి, అక్కడ ఒక ముస్లిం మహిళలను లేదా మత మార్చిన మహిళనో వివాహం చేసుకుంటాడు. కొన్నేళ్లకి తలాక్ తలాక్ అని చెప్పి అక్కడ నుంచి జారుకుంటున్నాడు. అంతవరకు ఆమె విషయంలో నియమాలు చెప్పిన షరియా ఆపై ఆమెను పట్టించుకోదు. ఆ పిల్లలు, ఆమె ఏం కావాలి? షరియా వారి గురించి మాట్లాడనంత మాత్రాన వారికి జీవితం ఉండదా? కాబట్టి సెక్యులర్ చట్టాలు అవసరం. దశాబ్దాల నుంచి వారికి షరియా పేరుతో జరుగుతున్న అన్యాయాన్ని ఆపాలని షాబానో కేసు ద్వారా సుప్రీంకోర్టు చేసిన చరిత్రాత్మక ప్రయత్నాన్ని నాటి ప్రధాని రాజీవ్‌గాంధీ దారుణంగా భగ్నం చేశారు. పెళ్లికి ముందు, తరువాత కూడా మహిళలపై జరుగుతున్న హింసాత్మక చర్యలు, దేశ వ్యాప్తంగా ఉన్న ట్రిపుల్ తలాక్ ఉమ్మడి పౌరస్మృతి అవసరాన్ని తీవ్రం చేశాయి. సెక్యులరిస్టు పార్టీల బూటకాలు, ఉదార వాదుల కపటత్వం, ముస్లిం



మతోన్మాదుల తిరోగమన లాలసలను గమనించే కాబోలు ఉమ్మడి పౌరస్మృతిని తీసుకురావడం గురించి రాజ్యాంగంలో ఉంది, కళ్లు తెరిచి చూడండని షాబానో కేసు నుంచే అత్యున్నత న్యాయస్థానం ప్రభుత్వాలను హెచ్చరించడం మొదలుపెట్టింది. అయినా ఆ ప్రయత్నం జరగలేదు. అయితే స్వతంత్ర భారతదేశంలో మొదటి సారిగా ఉమ్మడి పౌరస్మృతి నిర్మాణం అవసరం గురించి పార్లమెంట్‌కు సుప్రీం కోర్టు సూచించినది మహమ్మద్ అహ్మద్ ఖాన్ వర్సెస్ షాబానో బేగమ్ వ్యాజ్యంతోనే. రాజ్యాంగంలోని 44వ అధికరణం (అంటే ఉమ్మడి పౌరస్మృతి నిర్మాణంలో ప్రభుత్వ బాధ్యత గురించి తెలియచేసేది) నిర్వీర్యమై పోయిందని కూడా వ్యాఖ్యానించింది. విభేదాలను తొలగించి దేశ సమైక్యతకు ఉమ్మడి పౌరస్మృతి ఉపకరిస్తుంది. ఇదే అంశాన్ని జోర్డన్ డీన్డే వర్సెస్ ఎస్ఎస్ చోప్రా కేసులో సుప్రీంకోర్టు చెప్పింది. వివాహం, విడాకుల విషయంలో ఒక ఉమ్మడి చట్టం తేవడానికి పార్లమెంట్ జోక్యం అనివార్యమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. సరళా ముద్గల్ వర్సెస్ భారత ప్రభుత్వం వ్యాజ్యంలోను ఉమ్మడి పౌరస్మృతి అవసరం గురించి అత్యున్నత న్యాయ స్థానం గుర్తు చేసింది.

వ్యక్తిగత చట్టాలు లేదా పర్సనల్ లాలు అంత ప్రబలమైనవా? ఈ ప్రశ్న ఎందుకంటే, ఉమ్మడి పౌరస్మృతికి సంబంధించి ఈస్టిండియా కంపెనీ మొదట 1835లో బ్రిటిష్ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. అక్టోబర్, 1840లో లెక్స్ లోసి నివేదిక వచ్చింది. అన్నివర్గాలకు, మతాలకు వర్తించే విధంగా ఉమ్మడి పౌర స్మృతి అవసరమని చెప్పాడు. కానీ హిందూ, ముస్లిం పర్సనల్ లాలను దీని నుంచి మినహాయించాలని ప్రభుత్వం సూచించింది. అంటే ఆ పర్సనల్ లాలలోని చట్టాలను క్రోడీక రించే పని చేయవద్దన్నదే దాని సారాంశం. తరువాత మాత్రం హిందూ పర్సనల్ లాను క్రమబద్ధం చేశారు. మిగిలినవి మాత్రం వాటివాటి మత సూత్రాల ప్రాతిపదికగానే అమలు చేస్తున్నారు. నేరాలు, ఆధారాలు, కాంట్రాక్టులకు సంబంధించి చట్టాల క్రోడీకరణ (ఉన్న చట్టాలను ఒక క్రమ పద్ధతిలోకి తీసుకు రావడం) గురించి ఆ నివేదిక చర్చించింది. అయితే హిందూ వ్యక్తిగత చట్టాలు, ముస్లిం వ్యక్తిగత చట్టాలను వారు కావాలనే పక్కన పెట్టారు. ఇది శ్వేతజాతి బుద్ధి లక్షణం. ఉమ్మడి పౌరస్మృతి వచ్చి, అది భారతీయ సమాజంలో ఐక్యత తెస్తుందన్న అనుమానంతోనే వలస పాలకులు ఆ చట్టం జోలికి వెళ్లలేదని అనిపిస్తుంది. తెల్లవాళ్లు వెళ్లిపోయిన తరువాత వచ్చిన కాంగ్రెస్ పార్టీ చేసిన పని కూడా ఇదే. భారతీయ సమాజాన్ని ఐక్యతకు దూరంగా ఉంచడమే. నాడు ఈస్టిండియా కంపెనీ చేసిన పనినే '21వ శతాబ్దం ఫేమ్' రాజీవ్‌గాంధీ చేశారు. ముస్లిం పర్సనల్ లాను ముట్టుకోలేదు.

చాలా ప్రపంచం దేశాలు తమ పౌరులకు ఉమ్మడి పౌరస్మృతినే అమలు చేస్తున్నాయి. మతం, వర్గం ప్రాతిపదికగా ఉండే వివక్షను నివారించడమే ఆ పౌరస్మృతి అసలు ఉద్దేశం. ప్రతి పర్సనల్ లాలోను కనిపించేది అణచివేతేనని బలమైన అభిప్రాయం ఉంది. కొన్ని మతాలలో తక్కువ, కొన్ని మతాలలో మరీ ఎక్కువగాను ఇది కనిపిస్తుంది. నిజానికి మహిళల అణచివేతకు పర్సనల్ లాను ఒక ఆయుధంగా ఉపయోగించు కుంటున్నారన్న వాదన కూడా ఉంది. అంటే మత సూత్రాలను అడ్డం పెట్టుకుని కొందరి హక్కులను నియంత్రించడమే. స్త్రీపురుష వివక్షను పెంచి పోషించడంలో పర్సనల్ లాదే ప్రబలమైన పాత్ర అన్న విమర్శ కూడా ఉంది. అయితే భారత రాజ్యాంగం అందరికీ సమాన హక్కులు అన్న సూత్రాన్ని బలపరుస్తుంది. వివిధ మతాలు, వర్గాలు, సమూహాల పర్సనల్ లాలు ఈ మౌలిక సూత్రానికి భంగకరంగా పరిణమించాయి. భారత రాజ్యాంగం సెక్యులరిజాన్ని బలపరుస్తుంది. కానీ పర్సనల్ లా లోని భిన్న భిన్న సూత్రాలు సెక్యులర్ సూత్రాలకు పూర్తి విరుద్ధంగా ఉన్నాయి. వీటన్నిటి ఫలితం ఏమిటంటే, భిన్నత్వంలో ఏకత్వం అన్న మౌలిక భారతీయ విలువకు సవాలు ఎదురవుతున్నది. చట్టాన్నీ, మతాన్నీ వేరు చేయ వలసిన సమయం వచ్చింది. అది ఉమ్మడి పౌరస్మృతి చేయగలుగుతుంది.

ఉమ్మడి పౌరస్మృతి గురించి అనుకూలంగా లేదా ప్రతికూలంగా మాట్లాడేవారు మొదట పాటించ వలసిన నియమం– దీనిని ఓట్లు తెచ్చే ఆయుధంగా, లేదా రాజకీయ అజెండాగా భావించడం సరికాదు. ఇది భారతదేశ సమైక్యత, స్త్రీపురుష సమానత్వం కోసం చేస్తున్న ప్రయత్నంగా పరిగణించాలి. దీని వాస్తవిక స్వరూపం ఇదే కూడా. అదేకాదు, విధ్వంసక రాజకీయాలకు మూలమైన వలసవాద దృష్టిని ఇది వ్యతిరేకిస్తుంది. మహిళా సాధికారతకు పరిపూర్ణత చేకూర్చగలిగిన పరిణామమిది. ప్రధానంగా ముస్లింలలో ఉన్న బహు భార్యాత్వానికి అడ్డుకట్ట వేసి మహిళలకు న్యాయం చేస్తుంది. ముస్లిం మహిళలు పర్సనల్ లాతో ఎదుర్కొంటున్న ఇబ్బందుల నేపథ్యంలోనే ఉమ్మడి పౌరస్మృతి రాజకీయ తెర మీదకు వచ్చిందన్నా అతిశయోక్తి కాదు.

ఉమ్మడి పౌరస్మృతి నిర్మాణం, సూత్రం అంతా అన్ని మతాలలోని, వర్గాలలోని, సమూహాలకు చెందిన మహిళలకు ప్రాథమిక హక్కులు కల్పించడం మీదే ఆధారపడి ఉంది. ఆస్తి, వివాహం, విడాకులు, దత్తత వంటి అంశాలలో వారికి హక్కులు ఇస్తున్నది. ప్రస్తుతం కొన్ని వర్గాలు అమలు చేస్తున్న పర్సనల్ లా ఉన్నత వర్గాలకు సంబంధించిన అంశాలనే ప్రధానంగా పరిష్కరిస్తుంది. ఉమ్మడి పౌరస్మృతి అని పేరు పెట్టిన తరువాత అన్ని మతాల వారి వాదనలను వినాలి. ఉమ్మడి పౌరస్మృతి గురించి మైనారిటీలలో ఉన్న భయాలలో కొన్ని చిత్రంగా ఉంటాయి. నిజానికి అవి భయాలు కావు. పురుషాధిపత్యం, మతోన్మాదాల సమ్మేళనంతో వచ్చిన కపటత్వం. తమ హక్కులను యూసీసీ లాక్కుంటుందన్న భావనను ప్రచారం చేస్తున్నారు.

తమ సంప్రదాయాలను నిర్లక్ష్యం చేస్తుందన్న భావన కూడా ఉంది. మెజారిటీ మతానికి చెందిన విశ్వాసాలను రుద్దే అవకాశం ఉందని కూడా మైనారిటీలు చెబుతూ ఉంటారు. మతాచారాలను స్వేచ్ఛగా అనుసరించే అవకాశం రాజ్యాంగం ఇస్తున్నా ఉమ్మడి పౌరస్మృతి ఆ స్వేచ్ఛ పరిధిని కుదిస్తుందన్న అనుమానాలు కూడా ఉన్నాయి. అంటే రాజ్యం ప్రమేయం మత విషయాలలో ఎక్కువ అవుతుందని అంటున్నారు. గడచిన ఏడున్నర దశాబ్దాలుగా ఇవే వాదనలు వినిపిస్తున్నారు మతోన్మాదులు. ఓట్లు దండుకునే పార్టీలు ఓట్లు దండుకుంటున్నాయి. వ్యవస్థలో మాత్రం మార్పు రావడం లేదు. తాజాగా బీజేపీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం చరిత్రాత్మకం. ఎందుకంటే ఇది భావి భారతజాతి అస్తిత్వానికి సంబంధించిన ప్రశ్న. భారత భవిష్యత్ భౌగోళిక, జనాభా రక్షణకు సంబంధించిన అంశం. ఇది ఇప్పుడు కాకపోతే, బహుశా ఎప్పటికీ కాదు. బహుపరాక్.

★

**ఉమ్మడి పౌరస్మృతిపై మీ అభిప్రాయాన్ని ఈ లింక్ ద్వారా తెలపండి... https://legalaffairs.gov.in/law_commission/ucc/**





# రాజ్యాంగం నిర్దేశించింది.. సుప్రీంకోర్టూ చెప్పింది...

ఉమ్మడి పౌరస్మృతి ఇంత సున్నితమైన అంశం ఎంతమాత్రం కాదని, అదొక సున్నితమైన మత అంశంగా కొందరు మార్చివేశారని పట్నా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి వ్యాఖ్యానించారు. మతంతో, వర్గంతో, కులంతో సంబంధం లేకుండా పౌరులందరికీ సమ న్యాయం అందించడానికి ఉద్దేశించిన ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) అవసరాన్ని ఇంతవరకు ఎవరూ నిరాకరించలేదని ఆయన అన్నారు. ఏ మతంలో అయినా బహు భార్యత్వాన్ని, స్త్రీలకు హక్కులను కల్పించే అవకాశం యూసీసీ ద్వారా వస్తుందని నమ్మవచ్చునని కూడా ఆయన చెప్పారు. దీనిని వ్యతిరేకిస్తున్న వర్గాల స్త్రీలను ప్రశ్నించినా వారు యూసీసీని స్వాగతిస్తారని చెప్పగలమని కూడా ఆశాభావం వ్యక్తం చేశారు. అనేక పర్యాయాలు సుప్రీంకోర్టు తన తీర్పులలో ఉమ్మడి పౌరస్మృతి అవసరాన్ని తెలియచేసిన సంగతిని ఇంకా విస్మరించడం సరికాదని కూడా ఆయన హెచ్చరించారు. తరువాత అమలు చేయడం అంత సులభం కాకపోవచ్చునని కూడా అభిప్రాయపడుతున్నారు. యూసీసీపై 22వ లా కమిషన్ అభిప్రాయాలను ఆహ్వానించిన నేపథ్యంలో జాగృతికి జస్టిస్ నరసింహారెడ్డి ఇచ్చిన ఇంటర్వ్యూ అంశాలు ఇవి:

**గోవాలో ఉమ్మడి పౌరస్మృతి ఉంది. మిగతా రాష్ట్రాలు ఎందుకు పూనుకోలేదు?**
కర్ణాటకలో తాజా పరిణామాలు చూశాం కదా! అది ఔరంగజేబు, మొగల్ చరిత్రలో కొన్ని అంశాలు బాధాకరమైనవని ఇంతకు ముందున్న ప్రభుత్వం వాటిని పాఠ్య పుస్తకాల నుంచి తొలగించింది. కొత్త పార్టీ ప్రభుత్వం వచ్చాక మళ్లీ వాటిని ప్రవేశపెట్టారు. ముందున్న ప్రభుత్వం గోవధ మీద ఆంక్షలు పెట్టింది. కొత్త ప్రభుత్వం గోవధ నిషేధ చట్టాన్ని, మతమార్పిడి చట్టాన్ని వెనుకకు తీసుకొంది కానీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన పార్టీ మాత్రం పాత పార్టీతో మైలపడిన అసెంబ్లీని పరిశుద్ధం చేయడానికి గోమూత్రం వాడింది.




**ఉమ్మడి పౌరస్మృతి... తాజాగా భారత సామాజిక, రాజకీయ వ్యవస్థ మీదకి మరొకసారి పెద్ద చర్చను తీసుకువచ్చింది. 2016, 2018 సంవత్సరాలలో జరిగిన ప్రయత్నాన్ని మించి ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఆ అంశం మీద మరింత తీవ్రంగా ఆలోచిస్తున్నట్టే అనిపిస్తున్నది. పౌరులు, వ్యవస్థలు తమ అభిప్రాయాలు వెల్లడించాలని 22వ లా కమిషన్ చెప్పడం...కొన్ని మతాల వారి ప్రచారాలు ఈ విషయాలు మీకు తెలుసు. ఇంతకీ ఉమ్మడి పౌరస్మృతికి (యూనిఫార్మ్ సివిల్ కోడ్-యూసీసీ) ఆధారమైన రాజ్యాంగంలోని 44వ అధికరణం, అందులోని ఆదేశికసూత్రాలు ఉమ్మడి పౌరస్మృతి గురించి ఏమి చెప్పాయి? దానిని రాజకీయ పార్టీలు ఎలా అర్థం చేసుకున్నాయి?**

44వ అధికరణం ఈ దేశానికి వీలైనంత త్వరలో ఒక ఉమ్మడి పౌరసత్వ చట్టం తీసుకురావాలని నిర్దేశించింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మన రాజ్యాంగ నిర్మాణం జరుగుతున్నప్పుడే సుదీర్ఘ చర్చ జరిగింది. రాజకీయ కారణాలు కావచ్చు, వేరే కారణాలు కావచ్చు, దానిమీద ప్రభుత్వాలు శ్రద్ధ పెట్టలేదు. శాసనాలేమీ చేయలేదు. నా వ్యక్తిగత అభిప్రాయం ఏమంటే ఇది చేస్తే ఒక వర్గం నొచ్చు కుంటుందనీ, వాళ్ల ఓట్లు మనకు రావన్న ఉద్దేశంతో ఉమ్మడి పౌరస్మృతిని చాలాకాలం పార్టీలు పట్టించుకోలేదు.

**ఉమ్మడి పౌరస్మృతి ఆవశ్యకత ఏమిటి? దీని నిర్మాణంలో సామాజికాంశాలు, మత విశ్వాసాలు, ఆచార వ్యవహారాల ప్రభావమే ప్రధానంగా ఉంటుందా?**

నిజమే, ఈ విషయంలో కొంతమేర సామాజిక దృక్పథాన్ని అర్థం చేసుకోవాలి. ప్రజాస్వామ్యం కావచ్చు, లేకుంటే వేరేమైనా కావచ్చు. ఏ సమాజానికైనా పౌరజీవనాన్ని ప్రతిపాదించవచ్చు. పౌరజీవనం అంటే జననం, విద్యాభ్యాసం, పెళ్లి, ఆ వ్యవస్థలో భార్యాభర్తలకు సంబంధించిన హక్కులు, వారికి కలిగే పిల్లలు, ఆస్తి పంపకాలు, దత్తత నుంచి విడాకుల వరకు కూడ అందులో వస్తాయి. ఇవన్నీ ఎంత సుస్పష్టంగా నిర్వచించి ఉంటే సమాజం అంత సామరస్యంగా నడుస్తుంది. ఆర్థిక, సామాజిక విషయాలు వేరేసంగతి. అన్నిట్లో కూడా పాత్ర వహించవలసినది ఆ దేశ పౌరులే. కాబట్టి పౌరుల సంక్షేమం, సంరక్షణ అన్నీ ఇమిడి ఉన్నది ఈ యూసీసీ. అది రకరకాలుగా ఉండచ్చు. ఎంత చట్ట బద్ధంగా, ఆమోదయోగ్యంగా ఉంటే సమాజంలో శాంతిభద్రతలు అంతగా వికసిస్తాయి. ఒక పౌరుడిలో తన పెళ్లికి సంబంధించి ఏదో అశాంతి ఉందనుకోండి. ఆ అశాంతికి అతడూ లేదా అతడి భార్య– ఎవరైనా కారణం కావచ్చు. లేకుంటే రకరకాల మార్పుల ఫలితమూ కావచ్చు. వాళ్లిద్దరి అశాంతి



## తక్షణావసరం: జస్టిస్ చిన్నపరెడ్డి

షరియాను అనుసరిస్తూ కొంతమంది పురుషులు వ్యవహరిస్తున్న తీరుతో ప్రధానంగా ఆ మతంలో స్త్రీకి మరింత నష్టం వాటిల్లుతున్నది. ఇస్లాంలో పెళ్లి ఒక ఒప్పందం. దీనితో షాబానో, అంత కంటే ముందు నుంచి చాలామందికి అన్యాయం జరిగింది. జస్టిస్ చెన్నప్పరెడ్డి ఉమ్మడి పౌరస్మృతి లేకపోవడం వల్ల జరుగుతున్న నష్టం గురించి చెప్పారు. జోర్డాన్ డీన్డే వర్సెస్ ఎస్ఎస్ చోప్రా కేసులో మే 10, 1985న ఇచ్చిన తీర్పును ఈ వాక్యాలతో ఆరంభించారా న్యాయ నిపుణుడు.

It was just the other day that a Constitution Bench of this Court had to emphasise the urgency of infusing life into Art. 44 of the Constitution which provides that "The State shall endeavour to secure for the citizens a uniform civil code through out the territory of India." The present case is yet another which focuses attention on the immediate and compulsive need for a uniform civil code. The totally unsatisfactory state of affairs consequent on the lack of a uniform civil code is exposed by the facts of the present case. Before mentioning the facts of the case, we might as well refer to the observations of Chandrachud, C.J., in the recent case decided by the Constitution Bench (Mohd Ahmed Khan v. Shah Bano Begum &Ors.)

అక్కడితో ఆగదు. కుటుంబం మీద పడుతుంది. తరువాత సమాజం మీద. కాబట్టి ఒక వ్యవస్థ నుంచి ఆశించిన ఫలితం రాదు. అతను సాధారణ పౌరుడు కావచ్చు, ఉద్యోగి కావచ్చు.పౌరుడు సుఖశాంతులతో ఉంటే సమాజంలో శాంతి ఉంటుంది. కానీ భారత్ సువిశాలమైనది. రకరకాల ప్రజలు ఉన్నారు. ఈ సమస్య గురించి అందరికీ ఒకే రీతిన పరిష్కారం ఇచ్చే వాతావరణం ఇవాళ లేదు. ఇలాంటి సమస్యలకు ఏకరూపత ఉన్న చట్టంతో పరిష్కారం చెబితే ఆచరణాత్మకంగా ఉంటుంది.

**ఉమ్మడి పౌరస్మృతి ప్రయత్నం 1835 ప్రాంతంలోనే ఉంది కదా! అంటే ఈస్టిండియా కంపెనీయే చేసింది. తరువాత కూడా హిందూ, ముస్లిం పర్సనల్ లాలను తాకడానికి నిరాకరించింది. దీని నేపథ్యం ఏమిటి?**

మునుపు వ్యక్తిగత విషయాలను వాళ్ల వాళ్ల మతాచారాల ఆధారంగా మలుచుకున్నారు. అవే పర్సనల్ లాలు. విదేశీయులు ఆ ప్రయత్నం మొదలు పెట్టి ఆపేశారంటే, మన మీద వాళ్లకేమిటి ప్రేమ? ఎంత దోచుకోగలమన్న ధ్యాస తప్ప ఆ అంశాన్ని పట్టించుకోలేదు. ఇక్కడి ప్రజల అవసరాలేమిటో పట్టించుకోలేదు. స్వాతంత్ర్యం వచ్చాక దీన్ని రాజ్యాంగంలో పొందుపరిచారు. రాజ్యాంగం ప్రాథమిక హక్కులు ఇస్తుంది. అంటే ప్రభుత్వం నుండి ప్రజలను కాపాడే ప్రక్రియ. సాధారణంగా ఇవన్నీ ప్రభుత్వానికి వ్యతిరేకం. ఆదేశికసూత్రాలు ప్రభుత్వాలకు దిశా నిర్దేశం చేస్తాయి. ప్రభుత్వాలు ఏమి చేయాలి, ఏమి చేయకూడదు, అందులో విధానాల ప్రాధాన్యం ఏమిటి? ఇవి చెబుతాయి. అది గోవధ నిషేధం కావచ్చు. అందరికీ పని కల్పించడం, లేకుంటే సమాన వేతనం కల్పించడం వంటివి. పౌరసత్వ చట్టం అవకాశం ఉంటే అప్పుడే చేసేవారేమో! శిక్షాస్మృతి– పీనల్ కోడ్ ఉంది. దీనికి సంబంధించిన శాసన వ్యవస్థ కోసం పార్లమెంటును దిశా నిర్దేశనం చేసి మీరు ఈ రకంగా చేయండి అని పొందుపరుస్తారు. యూసీసీ నిర్మాణంలో పార్లమెంటుకు, రాష్ట్రాలకు కూడా బాధ్యత ఉంది.

**హిందూకోడ్ నిర్మాణంతోనే నాటి కేంద్రం ఎందుకు ఆగిపోయింది?**

మీరు ఇంకొకటి గమనించాలి. పౌరస్మృతి అనేది ప్రజలకే వదిలేద్దాం, అంటే పర్సనల్ లాలతోనే వాళ్లని బతకనిద్దాం, మనకెందుకులే అన్న ఉద్దేశం కాదు నాటి పెద్దలది. నిజమే, హిందువులకు సంబంధించి హిందూ కోడ్ తీసుకువచ్చారు. హిందూ మ్యారేజ్ యాక్ట్, హిందూ అడాప్షన్, డైవర్స్ ఇవన్నీ తీసుకొచ్చారు. అప్పుడు డాక్టర్ అంబేద్కర్ తన అభిప్రాయాన్ని వినిపించారు. హిందువులకు మాత్రమే ఈ కోడ్‌ను ఎందుకు తీసుకొస్తున్నారు? ఆర్టికల్ 44 ప్రకారం అందరికీ సమానంగా వర్తించే చట్టం రావాలి అన్నారు. హిందూ కోడ్ బిల్లును ఆయన, ఇంకా చాలామంది రాజ్యాంగ పరిషత్ సభ్యులు కూడా వ్యతిరేకించారు. హిందూధర్మంలో దయాభాగ, దాక్షర పద్ధతులు, వేర్వేరు ఆచారాలతో పెళ్లిళ్లు చేసుకునే పద్ధతి, ఆచార వ్యవహారాల పద్ధతి అన్నీ ఉన్నాయి. అయినా చట్టబద్ధత కలిగిన పౌరులుగా అన్నిటినీ వీరు స్వీకరించారు. వ్యతిరేకించలేదు.

**ముస్లింలను షరియాకు ఎందుకు అనుమతించారు? ముస్లింల అంశం కాబట్టి సున్నితమైనదని భావించారా?**


రాజ్యాంగ పరిషత్‌లో ఉమ్మడి పౌరస్మృతిని ముస్లిం ప్రతినిధులు ప్రతిఘటించారు. నాటి ప్రభుత్వాలు కూడా మౌనం దాల్చాయి. ముస్లింలకు ఉమ్మడి పౌరసత్వాన్ని ఆపాదించడం సున్నితమైన అంశమని నాటి కొందరు ప్రభుత్వ పెద్దలు కల్పన చేశారు. షరియా నుంచి వారిని బయటకు తేవడం సున్నితమైన అంశమన్న భ్రమను సృష్టించారు. అలా పక్కన పెట్టారు. అంతేతప్ప అది సున్నితమైనది కానేకాదు. ఇంకా చెప్పాలంటే ఇప్పుడు అదో సున్నితమైన అంశంగా మారిందనాలి. ఉదాహరణకు పెళ్లి. ఇస్లాంలో నాలుగు పెళ్లిళ్లు చేసుకోవడానికి అనుమతి ఉంది. సెంట్రల్ సర్వీస్, సివిల్ సర్వీసెస్‌లో గ్రూప్ 21 అని నిబంధన ఉంటుంది. దీని ప్రకారం ఎవరైనా భార్యగాని, భర్తగాని బతికి ఉన్నప్పుడు వేరే పెళ్లి చేసుకుంటే శిక్షార్హం. ఉద్యోగం నుంచి తీసేస్తారు. అది మిస్ కాండక్ట్ కిందకు వస్తుంది. ఈ నియమమే యూపీ సర్వీస్‌లోనూ 1956లో వచ్చింది. కానీ ఒక ముస్లిం ఉద్యోగి భార్య జీవించి ఉండగానే మరొకామెను పెళ్లి చేసుకున్నాడు. క్రమశిక్షణా సంఘం చర్య తీసుకుంది. మొదటి భార్యకు విడాకులిచ్చానని చెప్పాడతడు. ఆ విషయం రికార్డుల ద్వారా ఎందుకు తెలియచేయలేదని ప్రశ్నించింది క్రమశిక్షణా సంఘం. చివరికి ఉద్యోగం నుంచి తొలగించింది. అలహాబాద్ హైకోర్టు, ఆపై



సుప్రీంకోర్టు కూడా క్రమశిక్షణా సంఘం చర్యను సమర్థించాయి. నలుగురిని చేసుకున్నా మాకు అభ్యంతరం లేదు అనుకునే చోట, ఒకరి కంటే తక్కువమందిని చేసుకుంటే మతస్వేచ్ఛకు భంగం అనుకునే చోట ఆనాడు ఆ చర్యతో ఎందుకు వ్యతిరేకత రాలేదు? ఇది 1956లో మాట. విద్యావేత్తలు ఎవరూ క్రమశిక్షణా సంఘం చర్యను వ్యతిరేకించలేదు. అంటే ఇవాళ చాలామంది నాయకులు, మత గురువులు దానిని సున్నితాంశంగా మార్చేశారనే కదా అర్థం! వీరు అలాంటి భయాన్ని దేశంలో సృష్టించారు.

**అసలు సమస్య యూసీసీని వాయిదా వేసుకుంటూ పోవడానికి వీలుగా, వాటికి అనుకూలంగా రాజకీయ పార్టీలు భాష్యం చెప్పడం వల్లనేనా?**

యూసీసీ అమలునూ, నిర్మాణాన్నీ ఎంతసేపటికి వీళ్లు మత విశ్వాసం కింద పరిగణించడం మొదలు పెట్టారు. కానీ ఈ దేశ అత్యున్నత న్యాయస్థానం





–సుప్రీంకోర్టు–చాలా తీర్పులలో ఉమ్మడి పౌరస్మృతి అవసరాన్ని గుర్తుచేసిన మాట నిజం. ఆ తీర్పుల జాబితా కూడా ఉన్నది. వాటిలో ఏమన్నారంటే మత విశ్వాసం వేరు, మత ఆచారం వేరు. మత ఆచారం అంటే ఒక వర్గం నిత్యం చేసే పూజ కావచ్చు, సంధ్యావందనం కావచ్చు, ఒక వర్గంవారి నమాజ్ కావచ్చు, ప్రార్థన కావచ్చు. ఇవన్నీ మతాచారాలు. విశ్వాసమన్నది మతానికి సంబంధించినది. నేను దానిని నమ్ముతాను. అది మనసుకు సంబంధించినది. ఆచారాలు అనేవి అంతర్గతంగా, బహిర్గతంగా కనిపించేవి. కానీ యూసీసీ ప్రస్తావన వస్తే ప్రతిసారి 25వ అధికరణం చూపెడతారు. కానీ ఆ అధికరణం ఏమన్నది? ఆ హక్కు నిరపేక్షం (ఏబ్సల్యూట్) కాదు అనే చెప్పింది. ఇంకా సబ్జెక్ట్, మొరాలిటి అండ్ అదర్ థింగ్స్ అని కూడా చెబుతుంది. మతస్వేచ్ఛ మనసుకు సంబంధించినది. మతానికి సంబంధించినది కాబట్టి స్వేచ్ఛ ఉన్నది. ఏ మతాన్నైనా విశ్వసించవచ్చు. కానీ ఆచారం దాని కిందకు రాదు. వాటికి లోబడే ఆ స్వేచ్ఛ ఉన్నది. ఆచారాన్ని ఆ మతం నిర్దేశించాలి. నిర్దేశిస్తేనే ఆచారం. మతం ఫలానా అంశాన్ని నిషేధించలేదు కాబట్టి పాటిస్తాననడం ఆచారం కింద రాదు. అందులో నిర్దేశిస్తేనే ఆచారం కిందకు వస్తుంది. అది ఆ మతం వారు తప్పక పాటించాలి. ప్రభుత్వం ఒక చట్టం తీసుకొచ్చి నపుడు దానిని ఇది నా మతానికి సంబంధించిన ఆచారానికి వ్యతిరేకం అని ఎవరైనా అన్నపుడు, ఏమడుగుతారంటే, అది ఆచరించమని నీ మతం నిర్దేశించిందా! అని. ఉదాహరణకు అన్ని రాష్ట్రాలలోను స్థానిక సంస్థల ఎన్నికలలో మూడో సంతానం ఉంటే పోటీకి అనర్హులవుతారు. ఈ అనర్హత మొదట హరియాణలో అమలులోకి వచ్చింది. దీన్ని సవాలు చేస్తూ మా మతంలో నలుగురు భార్యలను చేసుకోవచ్చు అని చెప్పారు. ఇద్దరు సంతానం నిబంధన పెడితే ఆ బహు భార్యత్వ హక్కుకు అడ్డం అని వాదించారు. అపుడు నలుగురు కంటే తక్కువ మందిని వివాహం చేసుకుంటే మీ మతం నుంచి మిమ్మల్ని వేరు చేస్తారా అని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. నలుగురు భార్యలను చేసుకోకపోతే ముస్లింగా పరిగణించరని ఎక్కడా లేదు. అది షరియా అంశం. బహు భార్యాత్వాన్ని అది నిషేధించక పోవచ్చు. కానీ సాంఘిక వ్యవస్థకు లోబడి ఉండాలి.

**హిందూ లా నిర్మాణంలో డాక్టర్ అంబేద్కర్ ప్రతికూలతను ఎదుర్కొన్నారు. ఆయన ఉమ్మడి పౌరస్మృతిని సమర్ధించారు. ఆ విషయంలో ఆయన బలంగా వాదించి ఉండాలి. ఆయన ఏం చెప్పారు?**

ఉమ్మడి పౌరస్మృతి అవసరం కాదని ఇంతవరకు ఎవరూ అనలేదు. కానీ దానిని అమలు చేస్తే అందరికీ చేయాలి. హిందువులకు మాత్రమే చట్టం ఎలా చేస్తావు? చేస్తే అందరికి చేయాలి అని అంబేద్కర్ అభిప్రాయం వెలిబుచ్చారు. ఆ మాటకొస్తే ఒక వర్గాన్ని పక్కన బెట్టారంటే వాళ్లకు మత విశ్వాసం ఉంది మిగతా మతాలకి లేదనా? ఇస్లాం వివాహ వ్యవస్థ కాంట్రాక్ట్. కానీ హిందువులకు అదొక పవిత్ర వ్యవస్థ. శాశ్వతమైన బంధం. ఆ వ్యవస్థలో ఎన్నో మార్పులు తీసుకువచ్చి పెళ్లంటే ఇది, విడాకులంటే ఇది అని తయారుచేశారు. పూజా పద్ధతి వేరు వేరుగా ఉన్నాగాని ఆ చట్టానికి లోబడే ఇప్పుడు హిందువులంతా వివాహ వ్యవస్థను అమలు చేస్తున్నారు.

**నేరస్మృతిని అందరూ అంగీకరించారు, పౌరస్మృతిని ఎందుకు అంగీకరించటం లేదు?**

పౌరస్మృతిని తీసుకువస్తే ఒక వర్గం అంగీకరించదని వీళ్ల భయం. అయితే ఆ చట్టమే రూపొందిస్తే ఫలితం ఎలా ఉంటుందో అడగండి! మరీ ముఖ్యంగా ఉమ్మడి పౌరస్మృతిని ఎవరైతే వ్యతిరేకిస్తున్నారో ఆ సామాజిక వర్గ స్త్రీలను అడగండి ఏమంటారో! ఇంతకాలం నలుగురైదుగురు నాయకులను బట్టి దాన్ని పనికిరాదని తోసేయడం జరిగింది. ఎందుకంటే వాళ్లు ఇష్టం వచ్చినంత మందిని చేసుకోవచ్చు. నలుగురిని చేసుకోవచ్చు. అక్బర్ 12మందిని చేసుకున్నాడు. ఇంకొకరు 15 మంది చేసుకున్నాడు. కనీసం నలుగురిని చేసుకోవద్దా అని వాదిస్తున్నారు. ఒక పక్క పురోగమన సమాజం అనుకుంటూ ఈ మూఢ విశ్వాసాన్ని అంటిపెట్టుకుని ఉండిపోవడం ఏమిటి? దీనివల్ల ఆ ఇద్దరు సుఖంగా ఉన్నారా? లేదు. ట్రిపుల్ తలాక్ ఉంది. ఒకసారి చట్టం తీసుకురాగానే ఎవరూ నోరు మెదపలేదు. ప్రతి దానికి వ్యతిరేకత అనేది సహజం. ఆ వ్యతిరేకత ఎంతవరకు సమంజసమో పరిశీలించాలి.

**చాలామంది ముస్లిం మత గురువులు, ముస్లిం వర్గ మేధావులు చెబుతున్నట్టే ఇవాళ షరియాను ఎక్కడైనా యథాతథంగా అమలు చేయగలరా?**

టీవీ చర్చలలో చాలామంది అంటుంటారు. ముస్లిం మేధావులు, ఆ మత బోధకులు షరియా పాటిస్తాం అంటారు. అలా అయితే మొత్తం షరియానే అమలు చేద్దాం. దొంగతనం చేస్తే చేతులు నరకేద్దామా అంటే మాట్లాడరు. ఒప్పుకోరు. ఇపుడు ఉమ్మడి పౌరస్మృతి తీసుకొచ్చామే అనుకొండి. దాన్ని న్యాయబద్ధం చేయడానికి కోర్టులు ఉన్నాయి. మత స్వేచ్ఛ నిరపేక్షం కాదు. సబ్జెక్, మొరాలిటి, హెల్త్– ఈ మూడు కోణాలు ఉండాలి. మా మతం ప్రకారం కత్తి పట్టుకొని తిరుగుతామంటే అది పబ్లిక్ ఆర్డర్‌కి వ్యతిరేకం. కావాలంటే ఇంట్లో తిప్పుకోమని చెబుతుంది చట్టం. అట్లాగే మొరాలిటి, నైతికత, ఆరోగ్యం. ఆరోగ్యం విషయం ఎప్పుడొచ్చిందంటే సుప్రీంకోర్టు – జావేద్ అండ్ అదర్స్ వర్సెస్ స్టేట్ ఆఫ్ హరియాణ, 2003 కేసులో వచ్చింది. ఇది జనాభాకి సంబంధించిన వ్యాజ్యం. ఒక స్త్రీ ఉన్నది. అదే పనిగా పిల్లల్ని కనడంవల్ల ఆ స్త్రీ ఆరోగ్యం ఏమి కావాలి? ఆ పుట్టిన పిల్లల మధ్య ఎడమ లేకుండా ఉంటే వారి పరిస్థితి ఏమిటి? ఇంతమంది పిల్లల్ని కనాలని మీ మతం ఎక్కడా చెప్పలేదు. రెండోది ఆ స్త్రీ ఆరోగ్యం, పుట్టిన పిల్లల ఆరోగ్యం చూడాలి. దానికి లోబడే నీ మత స్వేచ్ఛ. అపుత్రస్య



ఉమ్మడి పౌరస్మృతి అవసరం కాదని ఇంతవరకు ఎవరూ అనలేదు. కానీ దానిని అమలు చేస్తే అందరికీ చేయాలి. హిందువులకు మాత్రమే చట్టం ఎలా చేస్తావు? చేస్తే అందరికి చేయాలి అని అంబేద్కర్ అభిప్రాయం వెలిబుచ్చారు. ఆ మాటకొస్తే ఒక వర్గాన్ని పక్కన బెట్టారంటే వాళ్లకు మత విశ్వాసం ఉంది మిగతా మతాలకి లేదనా? ఇస్లాం వివాహ వ్యవస్థ కాంట్రాక్ట్.

**ఉమ్మడి పౌరస్మృతిని వ్యతిరేకిస్తున్న వారి వాదనలో వాస్తవికత ఎంత? చట్టం కోణం నుంచే చెప్పండి!**

యూసీసీ ద్వారా దక్కుతుందనుకుంటున్నది చట్టబద్ధత. ఈ చట్టబద్ధత అన్నది రాజ్యాంగం నిర్దేశించింది. సుప్రీంకోర్టు దశాబ్దాలుగా ఉమ్మడి పౌరస్మృతి రావాలి రావాలి అని అంటూ వచ్చింది. తప్పకుండా చేయాల్సిందే. తరువాత చేద్దామన్న వీలుకాకుండా పోతుంది. ఇప్పటికే వివాహ వ్యవస్థ మీద నమ్మకం పోతోంది జనానికి. మెట్రోపాలిటన్ సిటీలో చూడండి విడాకుల తీసుకునేవారి సంఖ్య పెరుగుతున్నది. అలాగే మ్యాట్రిమోనీ డిస్ప్యూట్స్ కూడా. వీటి నుంచి బయటపడాలంటే యూసీసీ ఉపకరిస్తుంది.



గతర్నాస్తి అన్నారు. అక్కడ శతపుత్ర అనలేదు.

**ఇపుడు దీనిని జనాభా అసమతౌల్య కారక సమస్యగా చూడవచ్చు.**

దీంట్లో జనాభా వ్యవస్థ, వివాహవ్యవస్థ ఉన్నాయి. ఆంగ్లేయులు ఉండగానే హిందూ బైగమెస్ చట్టం తీసుకువచ్చారు. దీని ప్రకారం హిందువులు రెండో పెళ్లి చేసుకోకూడదు. 1952లో బాంబే స్టేట్‌గా ఉన్నప్పుడే ఆ హైకోర్టులో ఈ చట్టాన్ని సవాలు చేశారు. చట్టం ఉంది కాబట్టి రెండో పెళ్లి చేసుకునే వీలులేదని కోర్టు నిర్దాక్షిణ్యంగా చెప్పింది. హిందూ మతం ఎట్లానో ఇస్లాం కూడా అంతే. క్రిస్టియన్, పార్సీ కూడా అంతే. వివాహ వ్యవస్థకు సంబంధించి నదే జనాభా వ్యవస్థ. ఇద్దరి కంటే ఎక్కువ సంతానం ఉంటే ఎన్నికలలో పోటీ చేసే హక్కు లేదు. దానికి న్యాయబద్ధత వచ్చిందంటే దాని ఫలితం వేరే ఉంటుంది. జనాభా అనేది దేశ ప్రజాస్వామ్యంమీద ఆధారపడి ఉంటుంది. జపాన్, జర్మనీ దేశాలు న్నాయి. పాపులేషన్ నెగెటివ్ గ్రోత్‌గా ఉంది. అక్కడ అమ్మాయి, అబ్బాయినని కంటే కారును బహుమానంగా ఇస్తారు.

**కానీ ఇటీవలి పరిణామాలన్నీ ఈ జనాభా పెరుగుదల అనేది కుట్రపూరితంగా జరుగుతున్నదని అర్థమవుతుంది. ఫ్రాన్స్‌లో ప్రతి ముగ్గురు స్కూల్ విద్యార్థులలో ఒక మహమ్మద్ ఉన్నాడు. ఇది ఒక రకమైన కుట్ర. ఇది కొనసాగితే హిందూ దేశంలో పరిస్థితి ఏమిటి?**


జనాభా పెరుగుదలలో మార్పు రెండు రకాలు. ఒకటి పిల్లల ద్వారా. రెండోది అక్కడెక్కడో నలుగురిని కొట్లాట పెట్టుకోమనడం. రెండు మూడు బాంబులు వేయడం. ఒక పడవలో ఐదువేల మందిని నింపడం, కాందిశీకుల పేరుతో ఇక్కడ వదిలిపెట్టడం. అట్లా జరుగుతున్నది. జర్మనీలో ఇది ముందు మానవ హక్కుల విషయం. కొందరు అడ్డగోలుగా వచ్చి ఆ దేశంలో ఉండిపోతున్నారు. దీనితో తరువాత తలలు పట్టుకుంటున్నారు.

**స్వీడన్ వంటి దేశాల్లో ముస్లింలు రావడం మీద నిబంధనలు పెట్టారు. మరి ఇవన్నీ చూసిన తరువాత భారతీయ సమాజం ఏ రకంగా స్పందించాలి?**

అది రాజకీయమైన సమస్య. ఏరకంగా చేయాలనేది సాంఘిక, రాజకీయ కోణం నుంచి చూడవలసిందే. పౌరస్మృతి వస్తే ఎంతవరకు న్యాయం దక్కుతుంది అన్నంత వరకే చూడాలి. నా నమ్మకం ఏమిటంటే పౌరస్మృతి వస్తే స్త్రీలకు న్యాయం జరుగుతుంది.

**ఉత్తరాఖండ్‌లో తాజాగా తలెత్తిన సంక్షోభాన్ని చూసినపుడు భారతదేశంలో మెజార్టీ ప్రజలైన హిందూ జీవనంలోకి వారు కుట్రపూరితంగా వస్తున్నట్లు అర్థం అవుతుంది. ఈ వాతావరణం నుంచి ఉమ్మడి పౌరస్మృతి హిందూ సమాజాన్ని రక్షించ గలదా?**

యూసీసీని ఏ రూపంలో తీసుకొస్తున్నారో ఇంకా చెప్పలేం. ఉమ్మడి అనుకున్నప్పుడు అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యం కావాలి. పార్సీ మతం ఉన్నది. దాని మౌలిక లక్షణాలు చూడాలి. వాటిని పరిగణనలోకి తీసుకోవాలి. అలాగే ఇస్లాం,



క్రిస్టియానిటి, హిందూ అందరికీ కామన్‌గా చేయాలి. అలా అని ఉమ్మడి అన్నంత మాత్రాన అందరి అభిప్రాయాలకు పూర్తిగా సమాధానం చెప్పలేం. అలాగే తిరస్కరించలేం కూడా. లా కమిషన్ అభిప్రాయాలను ఆహ్వానించడం మంచి ప్రక్రియే. ఒక ఇంట్లో యజమాని ఆదాయం 10వేల రూపాయలు. అందర్నీ సంతృప్తిపరిచే బాధ్యత ఆ యజమానిది. ఉమ్మడి పౌరస్మృతి అంటే మొత్తం సమాజానికి ఎంతవరకు ఉపయోగపడుతుందో ఆ మేరకు వ్యవస్థను తయారుచేయడం. మత విశ్వాసాలను దెబ్బతీయకుండా దానిని ఎట్లా తీసుకు రావచ్చునో, వ్యక్తి వికాసానికి ఏ రకంగా దోహదం చేయవచ్చో వంటి అన్ని అంశాలను కలిపితేనే చట్టబద్ధత. న్యాయప్రక్రియను దృష్టిలో పెట్టుకోవాలి. అలాగే సామాజిక ప్రక్రియను, మత సంబంధ విషయాలన్నింటిని కలిపి తీసుకుంటేనే మంచి చట్టంగా తయారవుతుంది.

వాస్తవానికి అందులో చేరవలసిన ఇలాంటి చాలా విషయాలను ఇప్పటికే సుప్రీంకోర్టు నిర్ధారించింది. ట్రిపుల్ తలాక్ మొన్నటి దాకా ఉంది. ఇపుడు లేదు. అలాగే బహు భార్యత్వం. దీనికి ఇవాళ ఏ మతం ఆమోదం తెలుపదు. ఇవన్నీ పరిశీలించి ఇదివరకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులు చూసుకొని, మతపెద్దల అభిప్రా యాలు తీసుకుంటే దీనితో సమర్థవంతమైన జాతిని తయారుచేయవచ్చు. దురదృష్టం ఏమంటే మనలో చాలామందికి మాది భారతజాతి అన్న భావన రావడం లేదు. దానితో నష్టం జరుగుతున్నది. ★

**ఉమ్మడి పౌరస్మృతిపై మీ అభిప్రాయాన్ని ఈ లింక్ ద్వారా తెలపండి... https://legalaffairs.gov.in/law_commission/ucc/**



# 'మానసిక సంసిద్ధత తీసుకురావాలి!'

ఉమ్మడి పౌరస్మృతి రాజ్యాంగం ఇస్తున్న మార్గదర్శక సూత్రం. ఒక దేశంలోని ప్రజలు ఒక చట్టం పరిధిలో ఉంటారని చెప్పే చట్టమిది అన్నారు ఆర్ఎస్ఎస్ సరసంఘ చాలక్ మోహన్‌జీ భాగవత్. 2018లో (17,18,19 సెప్టెంబర్) ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో ఏర్పాటుచేసిన చర్చా కార్యక్రమంలో ఆయన ఈ విషయం స్పష్టం చేశారు. ఇదే అంశం మీద సభాసదులలో ఒకరు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. అందులో ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలు ఇలా ఉన్నాయి. ఒకే చట్టం పరిధిలో ఉండేలా సమాజ మనస్తత్వం రూపొందాలి. సమాన పౌరచట్టం గురించి చర్చించడం మొదలు పెట్టగానే కొందరిలో అసహనం మొదలవుతుంది. దీనిని హిందు, ముస్లిం విభేదంగా చిత్రీకరిస్తారు. అందరికీ ఒకే చట్టాన్ని ఆమోదిస్తే అన్ని పరంపరల్లోనూ కొంతలో కొంత మార్పులు వస్తాయి. హిందువుల పరంపరల్లోనూ మార్పులు సంభవిస్తాయి. వారసత్వ విషయాల్లో కొందరు హిందువులు 'దాయభాగ'ను అనుసరిస్తుండగా, మరి కొందరు

దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఉమ్మడి పౌరస్మృతి విషయమై చర్చ జరుగుతూనే ఉంది. అంటే 75 సంవత్సరాల పైగా ఆ చర్చ రావణకాష్టంలా మండుతూనే ఉంది. నిజానికి అంతకు ముందు కూడా ఇది చర్చనీయాంశమే. పౌరులంతా సమానమేనన్న రాజ్యాంగ స్ఫూర్తిని గౌరవించడానికి భారతదేశంలో ఇలాంటి చట్టం అవసరం కాదా అన్న మీమాంస నడుస్తూనే ఉన్నది. విభిన్న పద్ధతులు, సంస్కృతులు, మతాలు గల ఈ దేశంలో ఉమ్మడి పౌరస్మృతిని తేగలమా! ఒకవేళ తీసుకువచ్చినా అందుకు సంబంధించిన చట్టాలను అమలు పరచగలమా? వంటి సందేహాలు కూడా వినిపిస్తున్నాయి.

ఉమ్మడి పౌరస్మృతి అంటే దేశ ప్రజలందరికీ ఒకే చట్టం అమలు చేయడం. ఒకే దేశం, ఒకే ప్రజ, ఒకే చట్టం దీని ముఖ్య ఉద్దేశం. కుల,మత, భేదాలకు అతీతంగా ఈ చట్ట రూపకల్పన జరుగుతుంది.

ఈ రోజు ఈ దేశంలో మెజార్టీగా ఉన్న హిందువులకు; సిక్కు, బౌద్ధ, జైనులకు కలిపి1955-1956లో హిందూకోడ్‌ను రూపొందించారు. అంతకుమునుపు హిందువులలో బహుభార్యత్వం ఉండేది. హిందువులకు విడాకులనేవి తెలియదు. స్త్రీలకు వారసత్వ హక్కులేదు. కానీ కాలక్రమంగా తలెత్తిన సమస్యలు, మార్పులతో ఇలాంటి వివాదాలన్నింటికి కలిపి హిందూ వారసత్వ చట్టం, హిందూ వివాహం, విడాకుల విషయమై హిందూ దత్తత, పోషణ చట్టాలు తెచ్చారు. ఈ దేశంలో 80 శాతం ఉన్న హిందువులకు వాటిని వర్తింప చేశారు. ఆనాడు హిందువులలో కొందరు ఈ చట్టాలను వ్యతిరేకించినారు.

హిందూ స్త్రీలకు వర్తించవలసిన సమాన హక్కుల విషయమై అనేక మార్పులు జరిగాయి. ఈనాటికి స్త్రీలకు సమాన హక్కులు వచ్చి, గౌరవం ఏర్పడిందంటే అందుకు కారణం ఆ చట్టాలే.


ఈ దేశంలో కొన్ని వివాదాల పరిష్కారానికి చట్టాలు చేశారు. అవి ఉమ్మడి చట్టాలే. అవే, భారత శిక్షాస్మృతి (ipc),సాక్ష్యాధారాల చట్టం (Evidence Act) లావాదేవీలు (Contract) మొదలుగునవి. ఇలాంటి చట్టాలు రూపొందిస్తున్న సమయంలో ఏ మతం వారు వాటికి వ్యతిరేకత తెలియచేసినట్టు దాఖలాలు లేవు. అయితే 75 సంవత్సరాలకు పైగా కొన్ని మతాలవారు ఉమ్మడి పౌరస్మృతి పేరు చెబితేనే గగ్గోలు పెడుతున్నారు. ప్రధానంగా ముస్లింలలోని కొన్ని వర్గాలు ఇందుకు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నాయి.

ఇస్లామ్‌లో బహుభార్యత్వం ఉంది. హిజాబ్ పద్ధతిని అమలు చేయాలని అంటారు. ఒకసారి విడాకులు ఇచ్చినవారిని పునర్వివాహం చేసుకోవడానికి అంగీకరించరు. 1946లో రాజ్యాంగ రచన ప్రారంభమైంది. అప్పుడు ఉమ్మడి పౌరస్మృతి గురించి వాడీ వేడీ చర్చ జరిగింది. కె.ఎమ్.మున్షి లాంటివారు ఉమ్మడి పౌరస్మృతి చట్టాలు తేవాలని పట్టుపట్టినారు. అయితే ఆనాటి ముస్లిం ప్రతినిధులు అంతే తీవ్రంగా ఆ వాదనకు అభ్యంతరం తెలిపారు. అందుకే ఉమ్మడి పౌరస్మృతి రూపకల్పన గురించి 44వ అధికరణగా, నాలుగో భాగంలో చేర్చి సమాధానపరిచారు. అయినా ఉమ్మడి పౌరస్మృతి అవసరాన్ని 44వ అధికరణం కాదనలేదు. ఈ అధికరణాన్ని నాలుగో భాగంలో (Directive Principles of State Policy) చేర్చడంవల్ల ప్రభుత్వం మీద గట్టిగా ఒత్తిడి తేవడానికి వీలు లేదు.

కానీ బీజేపీ మొదటి నుండి తన సిద్ధాంతంలో, ఎన్నికల ప్రణాళికలలో ఉమ్మడి పౌరస్మృతి మీద కచ్చితమైన అభిప్రాయం వెలిబుచ్చుతున్నది. అధికారంలోకి వచ్చాక కూడా తమ హామీకి కట్టుబడి ఉన్నామనే చెప్పింది. రామజన్మభూమి సమస్య పరిష్కారం- అంటే ఆలయ నిర్మాణం, ఆర్టికల్ 370 రద్దు, ముస్లిం



ఎం. సుందరరామిరెడ్డి
అడ్వకేట్



‘మితాక్షర’ను అనుసరిస్తున్నారు. గిరిజనలకు సంబంధించి పరంపరాగతంగా వారికున్న చట్టాలు కూడా చెల్లుతున్నాయి. అన్ని వైవిధ్యాలను దృష్టిలో ఉంచుకుని రాజ్యాంగంలో వీటికి అనుమతి లభించింది. దీన్నంతటినీ దృష్టిలో పెట్టుకుని ఏదో ఒక చట్టం కోసం సమాజంలో మానసిక సంసిద్ధత వచ్చేందుకు ప్రయత్నం జరగాలి. వాస్తవంగా దేశ ఏకాత్మతకు ఉమ్మడి పౌరచట్టం బలాన్నిస్తుంది, అది కూడా ఏకత్వం కోసమే. దానిని అమలు చేయడం ద్వారా సమాజంలో మేము వేరే వర్గం అనే భావన బలం పుంజుకోరాదు. ఈ విషయం ఆలోచిస్తూ మెల్లమెల్లగా దాన్ని తీసుకురావాలి. ఈరోజు నేను ఈ మాటలు అంటున్నాను గానీ ఇలాంటి మాటలను మన రాజ్యాంగ ఆదేశిక సూత్రాలు ఏనాడో పేర్కొన్నాయి. దాన్ని ప్రభుత్వం ఆ దిశలో అమలు చేయాలి. అమలు చేయడానికి అందరి గురించి సమగ్రంగా ఆలోచిస్తూ అది ఏ చట్టమైనా సరే, సమాజంలో దానిగురించి అవగాహన కల్గించి అమలు చేయాలి.

**(భవిష్యభారతం/ రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్ దృష్టికోణం నుంచి)**



# దేశ ఐక్యతే అసలు ప్రయోజనం


మహిళలకు జరుగుతున్న అన్యాయాన్ని ఆపేందుకు ట్రిపుల్ తలాక్‌ను నిషేధించడం తదితర విషయాలపై బీజేపీకి కచ్చితమైన విధానం ఉన్నది. సమయం తీసుకున్నప్పటికీ వాటిని అమలు చేస్తున్నారు.

భారత ఉన్నత న్యాయస్థానం కూడా షాబానో కేసులో ఉమ్మడి పౌరస్మృతిని తీసుకురావాలని 1985లోనే పార్లమెంట్‌కు సూచించింది. షాబానో అనే ముస్లిం మహిళకు 60 ఏళ్ల వయసులో, వివాహం జరిగిన 40 సంవత్సరాల తరువాత భర్త తలాక్ – తలాక్– తలాక్ చెప్పి విడిపోయాడు. అంటే విడాకులు ఇచ్చేశాడు. ఆమె భర్త నుంచి సెక్షన్ 125 Cr.P.C సూత్రం మేరకు భరణం కోరింది. ఉన్నత న్యాయస్థానం షాబానో వాదనను సమర్థిస్తూ భరణం ఇవ్వవలసినదిగా తీర్పు ఇచ్చింది. అయితే నాటి కాంగ్రెస్/ రాజీవ్ ప్రభుత్వం ఆ తీర్పును రద్దుపరిచేలా 1985లో చట్టం చేసింది. షాబానో కేసు ఈ రోజుకీ ముస్లిం మహిళలకు జరుగుతున్న అన్యాయానికి సజీవ నిదర్శనంగా ఉంది. పాకిస్తాన్ సహా చాలా దేశాలలో లేని తలాక్ విధానాన్ని భారతదేశంలో కూడా నరేంద్ర మోదీ ప్రభుత్వం రద్దు చేసింది.

సరళా ముద్గల్ వర్సెస్ కేంద్ర ప్రభుత్వం కేసులో కూడా 1995లో సుప్రీంకోర్టు మతమార్పిడి విషయమై తీవ్ర అభ్యంతరం తెలిపింది. ఇందులో హిందువు మొదటి వివాహం చేసుకొన్న తరువాత, ఆ వివాహం రద్దయి, మరొక పెళ్లి కోసం ఇస్లాం తీసుకోవడం తగదని తీర్పు ఇచ్చింది.

John Vallamattom vs Union of India కేసు లోను సుప్రీంకోర్టు ఆర్టికల్ 44విషయమై 2003లో పార్లమెంట్‌కు గుర్తు చేసింది. అంతేకాక 2014న Juvenile Justice Act విషయంలో తీర్పు వెలువరిస్తూ భారత ప్రభుతాన్ని Uniform Civil Code విషయం ఏం చేశారంటు ప్రశ్నించింది. ఇలా అత్యున్నత న్యాయస్థానం ఇప్పటికి నాలుగు పర్యాయాలు ఈ విషయమై పార్లమెంట్‌ను హెచ్చరించింది.

2016లో నాటి లా కమిషన్ ఉమ్మడి పౌరస్మృతి విషయమై చర్చ జరిపింది. మళ్లీ ఇప్పుడు తాజాగా చర్చ జరుగుతున్నది. ఉమ్మడి పౌరస్మృతి అన్నది ఎలాంటి మతపరమైన కార్యక్రమాలకు వ్యతిరేకం కాదు. మతపరమైన విషయాలలో ఉమ్మడి పౌరస్మృతి చట్టం జోక్యం చేసుకోదు. ఒక పౌరునికి ఒకే వివాహాన్ని ఈ చట్టం సూచిస్తుంది. ఆ వివాహం రద్దయితే వేరే వివాహం చేసుకొనే హక్కు కల్పిస్తుంది. కానీ ఆ వివాహం ఎలా జరుగుతుంది, ఎక్కడ జరుగుతుంది తదితర విషయాలన్నీ వారి వారి మత సంప్రదాయల ప్రకారం జరుపుకొనే స్వేచ్ఛనే ఇస్తుంది. ఉమ్మడి పౌరస్మృతి అంటే భారతజాతిని కుల,మత భేదాలకు అతీతంగా ఐక్యం చేసేందుకు ఉద్దేశించినది మాత్రమే. ★



# విపక్షాల వ్యతిరేక

ఇరవై రెండవ లా కమిషన్ ఉమ్మడి పౌరస్మృతిపై గుర్తింపు పొందిన మత సంస్థలు, పౌరుల నుంచి అభిప్రాయాలు కోరిన తాజా పరిణామంతో దేశంలోని వివిధ రాజకీయ పార్టీలు, మత సంస్థల నుంచి విభిన్న వాదనలు, చర్చలు మొదలయ్యాయి. కేవలం 2024 లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బీజేపీ ఈ ఉమ్మడి పౌరస్మృతి 'అస్త్రాన్ని' బయటకు తీసిందంటూ విపక్షాలు ఒక పక్క విరుచుకు పడుతూనే మరోపక్క 2024 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేకంగా ఎక్కుపెట్టే అస్త్రంగా దీనిని వాడుకోవాలని చూస్తున్నాయి.

దేశంలోని వివిధ వర్గాల మధ్య ఉన్న తేడాలు ఉమ్మడి పౌరసత్వం అమలుతో తొలగిపోతాయన్నది బీజేపీ చేస్తున్న వాదన. ముఖ్యంగా హిందువులు, ముస్లింలు, సిక్కులు, క్రైస్తవులు, షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల్లో ప్రస్తుతం ఉన్న విభిన్న ఆచారాలు వైదొలగి, దేశంలోని పౌరులందరికీ ఒకేరకమైన న్యాయం జరుగుతుందన్నది ప్రభుత్వ ఉద్దేశం. దీనిపై ప్రధానంగా రెండు రకాల వాదనలు వినిపిస్తున్నాయి. దేశవ్యాప్తంగా 'ఒకే చట్టం...ఒకే న్యాయం' అమలు పేరుతో 'హిందూ చట్టాన్ని' బలవంతంగా రుద్దు తారన్న అనుమానం వ్యక్తం కావడం వాదనలోని ఒక కోణమైతే, ఈ చట్టంవల్ల బ్రిటిష్ కాలంనాటి 'మతపరమైన గుర్తింపు' విధానం వైదొలగి, దేశం 'సుసంఘటితమై' బలోపేతమవుతుందన్నది మరో కోణం. ఇదే సమయంలో ఉమ్మడి పౌరసత్వ చట్టం అమలు రాజకీయ 'ధ్రువాత్మకతకు' దారితీస్తుందని విపక్షాలు నానా యాగీ చేస్తున్నా ఇప్పటికే అవి మైనారిటీ బుజ్జగింపు పేరుతో రాజకీయాలను ఎప్పుడో 'ధ్రువాత్మకత' వైపుకు తీసుకెళ్లాయన్నది నిష్ఠుర సత్యం. అసలు దేశ పౌరులందరి విషయంలో సమ న్యాయాన్ని అవెప్పుడు పాటించాయి కనుక? సెక్యులరిజం పేరుతో ఎంతసేపు ఓట్ల రాజకీయం కోసం మైనారిటీలను బుజ్జగించి, మెజారిటీ పౌరుల అభిప్రాయాలను తుంగలో తొక్కడం తప్ప అవి ఒరగబెట్టిందేమీ లేదు. అట్లాగని మైనారిటీలకు చేసిన మేలూ లేదు! రాజకీయ లబ్ధే వాటి పరమావధి.



**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్ జర్నలిస్ట్

### సమంజసం కాదంటున్న కాంగ్రెస్

ఉమ్మడి పౌరచట్టం దేశానికి అవసరంలేదని 21వ లా కమిషన్ స్పష్టం చేసిన నేపథ్యంలో ప్రస్తుతం 22వ లా కమిషన్ 'అభిప్రాయ సేకరణ' ఎంతవరకు సమంజసమని గ్రాండ్ ఓల్డ్ పార్టీ కాంగ్రెస్ ప్రశ్నిస్తోంది. 'భారతీయ సమాజంలోని విభిన్న సమూహాల మధ్య ఉన్న వైవిధ్యాన్ని గౌరవించాలి. సంఘర్షణలకు పరిష్కారం కనుగొనడమంటే విభిన్నతలను పూర్తిగా రద్దుచేయడం కాదు' అన్న సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి బి.ఎస్. చౌహాన్ నేతృత్వంలోని 21వ లాకమిషన్ 'కుటుంబ చట్టంలో సంస్కరణల'పై 2018, ఆగస్టులో సమర్పించిన నివేదికను కాంగ్రెస్ ఉటంకిస్తోంది. కేవలం రాజకీయ లబ్ధి కోసమే దీన్ని బీజేపీ ముందుకు తెస్తోందని.. నిజానికి దేశ ప్రయోజనాలు పూర్తి భిన్నమంటూ వాదిస్తోంది. దేశంలో హిందువులు, ముస్లింలు, సిక్కులు, క్రైస్తవులు వంటి వివిధ మతాల ప్రజలు విభిన్న రీతుల ఆచార వ్యవహారాలను కలిగి ఉన్నప్పుడు, వీరందరినీ ఉమ్మడి పౌరస్మృతి కిందకు ఎట్లా తీసుకొస్తారని సమాజ్‌వాదీ పార్టీ ప్రశ్న. ప్రస్తుతం ఉమ్మడి పౌరస్మృతి విషయంలో మౌనం పాటిస్తున్న ఏకైక పార్టీ బహుజన్ సమాజ్‌వాదీ పార్టీ. ముఖ్యంగా ఈ విషయంలో ఏ నిర్ణయం తీసుకున్నా అది తన 'సర్వజన' ఫార్ములాను దెబ్బతీస్తుందని మాయావతి భయం. దళిత–ముస్లిం సంఘటితం ఆమె లక్ష్యం.

### భిన్నాభిప్రాయాలు

దేశంలో ఉమ్మడి పౌరసత్వం (యు.సి.సి) అమలును భారతీయ జనతా పార్టీ మద్దతిస్తుండగా, వివిధ పార్టీల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతుండటం గమనార్హం. ఉమ్మడి సివిల్ కోడ్‌ను అమల్లోకి తెస్తామని మొట్టమొదటగా ప్రజలకు వాగ్దానం చేసింది భారతీయ జనతా పార్టీ మాత్రమే. మరే ఇతర పార్టీ ఈ విధమైన హామీ ఇవ్వలేదు. ముఖ్యంగా కొన్ని మతపరమైన మైనారిటీ గ్రూపులు, గిరిజన హక్కుల సంఘాలు తమ ప్రత్యేక ఆచార వ్యవహారాలు దీనివల్ల దెబ్బతింటాయంటూ యు.సి.సి.ని వ్యతిరేకిస్తున్నాయి. ముఖ్యంగా



# తలో హేతువెక్కడ?



దేశంలోని మధ్య, ఈశాన్య ప్రాంతాలకు చెందిన కొన్ని గిరిజన గ్రూపులు, యు.సి.సి. అమల్లోకి వస్తే తమ అస్తిత్వాన్ని కోల్పోతాయని భయపడుతున్నాయి. మైనారిటీ, ట్రైబల్ గ్రూపుల్లో భయాలు వ్యక్తమవుతున్న తరుణంలో ఉమ్మడి పౌరసత్వాన్ని చట్టం రూపేణా బలవంతంగా రుద్దకూడదని, కాంగ్రెస్ సీనియన్ నేత అభిషేక్ మను సింఘ్వి అంటున్నారు. మరో కాంగ్రెస్ సీనియర్ నేత సల్మాన్ ఖుర్షీద్ కూడా, మత సంప్రదాయాలు అనుసరించే 'స్వేచ్ఛ' ఉండేలా యు.సి.సి.లో వీలు కల్పించాలని కోరారు. 'అసలు ఉమ్మడి పౌరసత్వ చట్టం అంటే నిర్వచనమేంటో ప్రభుత్వం స్పష్టం చేయాలి. రాజ్యాంగంలో ఉమ్మడి పౌరసత్వ చట్టం ప్రస్తావన ఉన్నప్పటికీ అందుకు ఒక స్పష్టమైన నిర్వచనం ఇవ్వకపోవడం వల్ల అమలుపై ప్రభుత్వం ఇచ్చే వివరణను బట్టి తమ స్పందన ఉంటుంద'ని సల్మాన్ ఖుర్షీద్ అన్నారు. ఇక ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్, 'రాజ్యాంగంలోని 44వ అధికరణం ఉమ్మడి పౌరచట్టాన్ని అమల్లోకి తేవాలని పేర్కొన్న మాట వాస్తవం. అయితే అన్ని వర్గాలతో చర్చలు జరిపి సర్వ సమ్మతితో మాత్రమే దీన్ని అమల్లోకి తీసుకురావాలి' అని స్పష్టం చేశారు. ఇక మమతా బెనర్జీ సరే సరి. ఆమె ఉమ్మడి పౌరసత్వం అమలును తీవ్రంగా వ్యతిరేకించడమే కాదు 'త్రిపుల్ తలాక్' రద్దును కూడా ఎత్తేయాలన్నది ఆమె డిమాండ్. 'సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వాలు ముఖ్యం. ఈ విషయంలో మనం విజయం సాధించినప్పుడు, ఉమ్మడి పౌరసత్వ చట్టం అనవసరమన్నది నితీష్‌కుమార్ అభిప్రాయం' అని జెడీ(యు) నేత అశోక్ చౌదరి పేర్కొన్నారు. 'సిక్కు మతానికి ఒక ప్రత్యేకత ఉంది. ప్రత్యేక సంస్కృతి, నాగరికత సిక్కు మతం సొంతం. సుదీర్ఘ పోరాటం తర్వాత ఆనంద్ మ్యారేజ్ యాక్ట్‌ను 2012లో అమల్లోకి తెచ్చారు. ఇది అమలు పరచడానికి మరికొంత సమయం పట్టింది' ఈ నేపథ్యంలో యు.సి.సి. అవసరం లేదని శిరోమణి గురుద్వార ప్రబంధక్ కమిటీ (ఎస్‌జీపీసీ) అధ్యక్షుడు గోవింద్ సింగ్ లాంగోవాల్ 2019లోనే వ్యక్తం చేసిన అభిప్రాయం. విచిత్రమేమంటే గతంలో యు.సి.సి.కి అనుకూలంగా మాట్లాడిన శివసేన, ఆమ్ ఆద్మీ పార్టీలు ఇప్పుడు వ్యతిరేకిస్తుండటం వాటి అవకాశవాద రాజకీయాలకు నిదర్శనం.

**ఉమ్మడి పౌరస్మృతే దిక్కు**

నిజం చెప్పాలంటే బహుళ మతాలు, వైవిధ్య ఆచారాలు కలిగిన సువిశాల దేశంలో చట్టాన్ని చక్కగా అమలు చేయాలంటే ఉత్తమ మార్గం 'ఉమ్మడి పౌరసత్వ చట్టం' అమలు చేయడమే. దేశ సమగ్రత, సుస్థిరతకు ఉమ్మడి పౌరస్మృతి అవసరమన్నది రాజ్యాంగకర్తల అభిప్రాయం కూడా. ఈ నేపథ్యంలో ఇవి వివిధ మతాల్లో అనుసరించే లింగవివక్ష విధానాలపై దృష్టి కేంద్రీకరించాలి. ఇదే సమయంలో వివిధ మతాలు తాము అనుసరించే సంప్రదాయాలను మరింత హేతుబద్ధంగా మలుచుకోమని కోరవచ్చు. కానీ మతఛాందసవాదులు దీనికి ఎంతమేర అంగీకరిస్తారన్నది ప్రశ్న. సెక్యులరిజం అంటే చట్టం ముందు అన్ని మతాలు, కులాలు సమానమే. కానీ మనదేశంలో విభిన్న మతాలకు, వారి వారి మతాచారాలకనుగుణంగా చట్టాలు అమలవుతున్నాయి. పరిశీలిస్తే ముస్లిం మహిళలతో పోలిస్తే, హిందూ మహిళల్లో ఎంతో పురోభివృద్ధి కనిపిస్తుంది. కారణం అమలవుతున్న చట్టాల్లో వైవిధ్యతే. ముస్లింలకు షరియా చట్టం అమల్లో ఉంది మరి. ఉమ్మడి పౌరస్మృతి కంటే, 'స్త్రీపురుషుల మధ్య అసమానతలు తొలగించడానికి వీలుగా చట్టాల రూపకల్పనపై దృష్టిసారించాలి' అని 21వ లా కమిషన్ పేర్కొనడం గమనార్హం. తమకు మతం కాదు ప్రధానం, న్యాయమైన హక్కులని చెబుతున్న మహిళా గ్రూపులు, షరియా చట్టంలో మార్పులు తేవాలని కోరుతాయా?



**విపక్షాలకు రాజకీయ అస్త్రం**


రాజ్యాంగంలోని 44వ అధికరణ ఉమ్మడి పౌరస్మృతి అవసరమని పేర్కొనడం వల్ల, ఇది రాజ్యాంగానికి వ్యతిరేకమంటూ ఎవరూ వాదించడానికి వీల్లేదు. అయితే ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు, జూన్ 16న ఉమ్మడి పౌరస్మృతి



అనవసరమని, ఇది దేశానికి ప్రమాదరకమని పేర్కొంది. ఈ విధంగా వ్యతిరేకించడం ఇదే మొదటిసారి కాదు. ఈ ఏడాది ఫిబ్రవరి 5న లక్నోలో సమావేశమై ఉమ్మడి పౌరస్మృతిని వ్యతిరేకిస్తూ తీర్మానించింది కూడా. దీంతో వివిధ రాజకీయ పార్టీలకు మతపరమైన అంశంగా రాజకీయం చేయడానికి ఇది అస్త్రంగా మారింది. బుజ్జగింపు రాజకీయాలు వాటికి అలవాటే కనుక, ఇప్పుడు యు.సి.సి. అసలు ఉద్దేశాన్ని పక్కదోవ పట్టించడానికి, తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడానికి యత్నిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఉమ్మడి పౌరస్మృతి అమలుచేస్తే రాజ్యాంగంలోని 25వ అధికరణం కల్పించిన మతస్వేచ్ఛ హక్కుకు భంగం వాటిల్లు తుందని వివిధ మతగ్రూపులు చేస్తున్న వాదనను విపక్షాలు సమర్థిస్తున్నాయి. అయితే యు.సి.సి. అమలు రాజ్యాంగ బద్ధమేనన్న అంశాన్ని సుప్రీంకోర్టు గతంలో చాలా సార్లు స్పష్టం చేసిందన్న సంగతి గుర్తుంచుకోవాలి. దీని అమలు బాధ్యత ప్రభుత్వానిదేనని కూడా పేర్కొంది. ఈ నేపథ్యంలో యు.సి.సి. అమలు విషయంలో విభిన్న రాజకీయ పార్టీలు దృఢమైన నిబద్ధతను ప్రదర్శించాలి. దురదృష్టవశాత్తు అది జరగడంలేదు. రాజకీయ పార్టీలు ఓట్ల కోసం 'మతం' అజెండాను ముందుకు తీసుకొని రావడమే ఇందుకు ప్రధాన కారణం. ముఖ్యంగా ఉమ్మడి పౌరస్మృతి పేరుతో హిందూ చట్టాలను అమలు చేస్తారన్న కొన్ని మతాలవారి వాదనకు గుడ్డిగా వత్తాసు పలకడం తప్ప విపక్షాలు హేతుబద్ధతకు ఆస్కారం ఇవ్వడంలేదు.

**శీతాకాల సమావేశాలే కీలకం**

కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం ఈ చట్టాన్ని అమల్లోకి తేవాలని ఎంత కృతనిశ్చయంతో ఉన్నప్పటికీ, ఇందుకు విపక్షాలు, ఇతర వర్గాల నుంచి ఎదురయ్యే అడ్డంకులు బీజేపీ నేతలకు తెలియనివి కావు. అయితే జి-20 సమావేశాలు ముగిసే సెప్టెంబర్ నెలాఖరు వరకు బీజేపీ నాయకులు దీనిపై పెదవి విప్పబోరు. అంతర్జాతీయ సమావేశాలు జరుగుతున్న తరుణంలో ఈ తేనెతుట్టెను మరింత కెలికి అనవసర ఇబ్బందులు తెచ్చుకోవడానికి బీజేపీ నాయకులు సుముఖంగా ఉండరు. ఇక ప్రభుత్వం యు.సి.సి. విషయంలో ఏదైనా ముందడుగు వేయాలనుకుంటే, వచ్చే శీతాకాల సమావేశాలే చివరి అవకాశం. అయితే బిజు జనతాదళ్ నుంచి బీజేపీకి సానుకూల సంకేతాలు వస్తున్నాయంటు న్నారు. అదే జరిగితే ఈ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందే అవకాశాలున్నాయి. ఇక కేంద్ర ప్రభుత్వంతో స్నేహపూర్వక వైఖరి అవలంబిస్తున్న ఆంధ్రప్రదేశ్‌లోని వై.ఎస్.ఆర్.సి.పి. ప్రభుత్వం, అకాలీదళ్‌లు మాత్రం ఈ బిల్లుకు మద్దతివ్వకపోవచ్చు. ఒక్కసారి బిల్లును




ప్రవేశపెట్టిన తర్వాత, సమర్థకుల సంఖ్య పెరుగు తుందన్నది బీజేపీ అంచనా. 22వ లా కమిషన్ నివేదిక కోసం ప్రభుత్వం ఎదురు చూస్తున్నదని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ చెప్పినదాన్ని బట్టి చూస్తే నివేదిక యు.సి.సి.కి అనుకూలంగా వస్తే, తమకు మద్దతు పెరుగుతుంద న్నది బీజేపీ నేతలు విశ్వసిస్తున్నారని అర్థంచేసు కోవాలి.

**పైలెట్ ప్రాజెక్టుగా ఉత్తరాఖండ్‌లో?**

ఉత్తరాఖండ్ ప్రభుత్వం రంజన దేశాయ్ నేతృత్వంలో యు.సి.సి. అమలుపై ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ ఈ మధ్య కేంద్రప్రభుత్వ అధికారులతో చర్చలు జరిపినట్టుగా వార్తలు వచ్చాయి. ఈ కమిటీ సమర్పించే నివేదిక కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చే యు.సి.సి. బిల్లుకు నమూనాగా ఉండవచ్చునన్న ఊహాగానాలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా మహిళల వివాహ వయస్సును 21 సంవత్సరాలుగా నిర్ణయించడం, వారసత్వ ఆస్తిపై కుమార్తెలకు సమాన హక్కు, ఎల్.జి.బి.టి.క్యు. దంపతులకు చట్టపరమైన హక్కుల కల్పన, జనాభా నియంత్రణ వంటి అంశాలు ఉన్నట్లయితే విపక్షాలకు గొంతులో పచ్చివెలక్కాయ పడ్డట్టే. ఇందులో వాటికి విమర్శించడానికి ఏమీ ఉండదు. ఇదే బీజేపీకి కొండత ధైర్యాన్ని ఇస్తుండవచ్చు. ఈ బిల్లును ముందుగా ఉత్తరాఖండ్‌లో పైలెట్ ప్రాజెక్టు కింద అమలు జరిపి, తర్వాత దేశం మొత్తం విస్తరించా లన్నది కేంద్ర ప్రభుత్వ ఉద్దేశంగా కనిపిస్తోంది. ఉత్తరాఖండ్ బిల్లు ఆధారంగానే దేశవ్యాప్తంగా అమలుచేసే బిల్లు రూపకల్పన ఉంటుందంటున్నారు.

**విపక్షాల అనైక్యతే బీజేపీకి బలం**

తలలు కూడని పార్టీల సమావేశం తలకు రోకలి చుట్టుకున్నట్టేనని వర్తమాన విపక్ష రాజకీయం నేర్పుతున్న పాఠం. యు.సి.సి.తో సహా 2024 ఎన్నికల్లో బీజేపీని ఉమ్మడిగా ఎదుర్కోవాలన్న లక్ష్యంతో పట్నాలో జూన్ 23న కాంగ్రెస్‌తో సహా సమావేశమైన విపక్ష పార్టీల మధ్య ఏకాభిప్రాయం వచ్చినట్టు లేదు. కాంగ్రెస్‌తో పాటు ఈ సమావేశంలో పాల్గొన్న వివిధ పార్టీల బలం ప్రస్తుత లోక్‌సభలో 88. మరి ఈ సమావేశానికి హాజరుకాని/ఆహ్వానించని పార్టీల సభ్యుల సంఖ్య 60. మరి దీన్ని ఉమ్మడి విపక్ష సమావేశం అని భావించడానికి అవకాశం లేదు. హాజరు కానివారిలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి (ఆంధ్రప్రదేశ్), నవీన్ పట్నాయక్ (ఒడిశా), కె. చంద్రశేఖర్ రావు (తెలంగాణ) వీరికి చెందిన మూడు పార్టీల సీట్లే లోక్‌సభలో 43. సమావేశానికి హాజరైన వారిలో ఢిల్లీ ప్రభుత్వం విషయంలో కేంద్రం జారీచేసిన ఆర్డినెన్స్‌పై ఆప్, కాంగ్రెస్‌ల మధ్య ఏకాభిప్రాయం లేదు. కాంగ్రెస్ ఈ ఆర్డినెన్స్ విషయంలో మౌనం పాటిస్తోంది. అతిముఖ్యమైన ఈ సమస్యపై కాంగ్రెస్ తమతో కలిసి రావడంలేదని సమావేశం తర్వాత ఆప్ ముఖ్య మంత్రులు కేజ్రీవాల్, భగవంత్‌మాన్‌లు ఘాటుగా విమర్శించడంతో పాటు ఇట్లా అయితే కూటమి కోసం భవిష్యత్తు సమావేశాల్లో పాల్గొనబోమని హెచ్చ రించడం గమనార్హం. దీనికితోడు వివిధ రాష్ట్రాల ప్రాంతీయ పార్టీల ముఖ్యమంత్రులు మరో కూటమి కోసం ప్రయత్నిస్తున్న నేపథ్యంలో విపక్షాల ఐక్యత కలహాల కుంపట్లో మరింతగా కరిగిపోతోంది. మరి ఈ విపక్ష రాజకీయ భేతాళ పంచవింశతి రాజకీయా ధిపత్యానికే పెద్దపీట వేస్తున్న తరుణంలో యు.సి.సి.పై హేతుబద్ధ రాజకీయానికి తావెక్కడ? ★

**ఉమ్మడి పౌరస్మృతిపై మీ అభిప్రాయాన్ని ఈ లింక్ ద్వారా తెలపండి... https://legalaffairs.gov.in/law_commission/ucc/**

# ఒక దేశం ఒకే చట్టం

ఉమ్మడి పౌరస్మృతిని గురించి చర్చించే సందర్భంతో, జమ్ముకశ్మీర్ రాష్ట్రాన్ని భారతదేశంలో బేషరతుగా విలీనం చేయాలనే, 1950 దశకపు ఉద్యమంలోని మహోన్నత నినాదం 'ఏక్ విధాన్ (ఒకే రాజ్యాంగం), ఏక్ ప్రధాన్ (ఒకే ప్రధానమంత్రి) ఏక్ నిషాన్' (ఒకే రాష్ట్ర ధ్వజం) గుర్తుకు వస్తుంది. భారత గణతంత్ర దేశమంతటికీ ఒకే రాజ్యాంగం, ఒకే ప్రధానమంత్రి, ఒకే రాష్ట్ర పతాకం ఉన్నట్లుగా, వివిధ మతాల, ప్రాంతాల సంబంధం లేని ఒకే, ఉమ్మడి పౌరస్మృతి ఉండాలని మన రాజ్యాంగం నాల్గవ భాగం, ఆదేశిక సూత్రాల సమాహారంలో 44వ అధికరణం ఇలా ఉంది; "భారతదేశంలోని అన్ని ప్రాంతాల పౌరులందరకూ వర్తించే ఏకరూప పౌరశిక్షాస్మృతిని రూపొందించేందుకు ప్రభుత్వం కృషిచేయాలి." (Uniform Civil Code for the Citizents, the state shall endeavour to secure for the citizens at uniform civil code throughout the territory of Inida)

ఇది నిర్దేశిత అభిలాష; దీనిని ఆచరణలోకి తేవడానికి చట్టం చేయాలి. అక్కడే వస్తోంది చిక్కు; జాప్యం. అటు కొన్ని మత సమూహాల నుంచి వ్యతిరేకత. ఇటు దేశ సమైక్యత, సమగ్రత, ఏకాత్మత, సమ న్యాయం, లింగ సమానత్వం, కుటుంబ వ్యవస్థ, స్థిరత్వం కోరేవారిలో ఇంకా కాలపాయన చేయ కుండా చట్టం చేయాలనే పట్టుదల కనబడుతున్నాయి.

మన రాజ్యాంగ నిర్మాణ సమయంలో సభ్యులు మినూ మసానీ (పార్సీ), రాజకుమారి అమృతకౌర్ (సిక్కు), హంసా మెహతా, డా॥అంబేడ్కర్‌లు ఉమ్మడి పౌర శిక్షాస్మృతిని రూపొందించి, విధిగా అమలు జేయవలసిన అంశాలు ఉండే భాగంలో చేర్చాలని గట్టిగా వాదించారు. ముస్లింలను బుజ్జగించడంలో మునిగి తేలే కాంగ్రెస్ పెద్దలు మసానీ ప్రభృతుల ప్రయత్నాన్ని వ్యతిరేకించి రాజ్యాంగ ప్రాథమిక హక్కుల్లో భాగం (మూడు)లో గాక ఆదేశిక సూత్రంగా, ఆకాంక్షగా ఉల్లేఖించారు.




**త్రిపురనేని హనుమాన్ చౌదరి**

ప్రముఖ సాంకేతిక నిపుణులు


పౌరస్మృతిలో ముఖ్యమైన విషయాలు; వివాహం, (ఏకపత్నియా, బహు భార్యత్వమా), విడాకులు, వారసత్వం, అందులో ఎవరికీ ఎంత భాగాలు, దత్తత, స్త్రీ పురుషుల వాంగ్మూలానికి సమాన విలువ, విడాకులిచ్చిన మహిళకు, సంతానానికి మనోవర్తి ఇత్యాదులు ప్రధానాంశాలు. ఈ విషయాల్లో షరియనే తు.చ తప్పక అనుసరిస్తాం కాబట్టి, తదనుగుణం కాని ఏ ఉమ్మడి పౌరస్మృతిని, నిజానికి అసలు ఏ స్మృతినీ అంగీకరించేది లేదని ముస్లింలు అంటున్నారు.

హిందువులలో ప్రాంతాలనుబట్టి, సంప్రదాయాల నుబట్టి ఏకత్వంలేని ఆచారాలుండేవి. వాటన్నిటినీ సమీక్షించి యావత్ భారతంలో హిందువులందరికీ వర్తించేలా (వివాహం, విడాకులు, వారసత్వం, దత్తత, సంపదలో సమాన విభాగం...) సంస్కరించిన హిందూ శిక్షాస్మృతిని చట్టంగా చేశారు. ముస్లింల స్మృతిని ఎందుకు సంస్కరించలేదు?

సెక్యులరిస్ట్ మహానుభావుడు నెహ్రూ ముస్లింల సమ్మతితోనే వారి పర్సనల్ లాను సంస్కరించాలి అన్నారు. ఈ సందర్భంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గట్టి వాదనను వినిపించారు. వందేళ్లకు పైగా ఈ దేశంలో బ్రిటిష్‌వారి పాలనలో చాలా విషయాల్లో ఉమ్మడి స్మృతినే అమలు చేశారు గాని షరియా గాదు. నేరాలు చేసినవారికి కొరడా దెబ్బలు, కాళ్లుచేతులు నరకడం, మెడకాయ కోయడం, రాళ్లతో కొట్టి చంపడం అనే షరియా చట్టాలు అమలవడం లేదు కదా! ఒక్క వర్గానికే ఎందుకు పర్సనల్ లా అమలు చేయాలని, షరియా ఎందుకని అన్నారు.

**ప్రపంచంలో 192 రాజ్యాల్లో 130 ముస్లింలే మెజారిటీలుగా ఉన్న రాజ్యాలు కావు. కొన్నిటిల్లో ముస్లింలు మైనారిటీలుగా ఉన్నారు. వారందరూ ఆయా దేశాల సివిల్ కోడ్‌కు లోబడే ఉన్నారు.**

ప్రపంచంలో 192 రాజ్యాల్లో 130 ముస్లింలే మెజారిటీలుగా ఉన్న రాజ్యాలు కావు. కొన్నిటిల్లో ముస్లింలు మైనారిటీలుగా ఉన్నారు. వారందరూ ఆయా దేశాల సివిల్ కోడ్‌కు లోబడే ఉన్నారు. కాని, షరియాకు కాదు. మన గోవాలో పోర్చుగీసుల పాలన నుండి, ముస్లింలతో సహా అన్ని మతస్థులు వారికి ఉమ్మడి పౌరశిక్షాస్మృతే అమలులో ఉంది. కనుక



ఉమ్మడి పౌరస్మృతి పట్ల ముస్లింల వ్యతిరేకత రాజకీయ ప్రేరేపితమైందేకాని, సహేతుకం కాదు. దేశ విభజన కోసం రక్తపాతంతో కలహించిన వారు, తామే సృష్టించిన ఇస్లామిక్ పాకిస్తాన్ / బంగ్లాదేశ్‌లకు వెళ్లకుండా ఇక్కడే ఉండి, ఉమ్మడి పౌరస్మృతిని వ్యతిరేకించడం మతాంధ రాజకీయ ఉద్దండత.

ఉమ్మడి పౌరస్మృతిని రాజ్యాంగ ఉద్దేశించి నట్లుగా, మానవీయతను ఆధారం చేసుకుని, చట్టం చేయండని దేశ అత్యున్నత న్యాయస్థానం పలుమార్లు ప్రభుత్వానికి సూచించింది. అన్ని మతాల వారిని, దృక్పథాల వారిని సంప్రదించి, కేవలం హిందూ ధర్మం ప్రకారమేగాని సర్వజన కల్యాణకారియైన ఉమ్మడి పౌరస్మృతి రచన తక్షణమే చేపట్టాలి. రాజ్యాంగ రచన సమయంలో కాంగ్రెస్‌లోని జాతీయ ముస్లిం సభ్యులు షరియా నిబంధనలు అమలుకు జాతీయ స్థాయిలో ఒక ఖాజీని నియమించాలని, ముస్లింల బాగోగులు చూడడానికీ, వక్ఫ్ ఆస్తులను రక్షించడానికీ ఒక ముస్లిం మంత్రిని నియమించ డానికి అనువుగా అధికరణలు ఉండాలని కోరారు. ఆ గొంతెమ్మ కోరికలను అదృష్టవశాత్తు రాజ్యాంగ నిర్మాతలు అంగీకరించలేదు.

22వ లా కమిషన్ ఉమ్మడి పౌరస్మృతిని గురించి చేసే సూచనలను అధ్యయనం చేసి నిర్ణయం తీసుకుంటామని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు విన్నవించింది. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఇది ప్రభుత్వ సంస్థ కాదు) ఇస్లామిస్ట్ దృక్పథంతో ముస్లిమేతరులు, ముస్లిం వ్యవహారాల్లో జోక్యం చేసుకోకూడదని వాదిస్తూ, ఉమ్మడి పౌరస్మృతికి వ్యతిరేకంగా అలజడి రేపుతున్నది. అయినా వీటికి తలవంచక ప్రభుత్వం తగిన చట్టాన్ని దృఢ సంకల్పంతో తీసుకురావాలి. ★



మతాచారాలలో జోక్యం వేరు, మతాచారాల పేరుతో జరిగే హింసను ఆపడం వేర్వేరు అంశాలని మాజీ శాసనసభ్యుడు, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ ఎన్. జయప్రకాశ్ నారాయణ్ వ్యాఖ్యానించారు. ఉమ్మడి పౌరస్మృతిని మత సమస్యగా కాకుండా మహిళల హక్కులు, సమానత్వం వంటి కోణాల నుంచి పరిశీలించడం వల్ల దేశానికి ప్రయోజనం ఉంటుందని ఆయన అన్నారు. మొత్తంగా జననాల రేటు తగ్గుతున్నది కాబట్టి జనాభా అసమతౌల్యానికీ, యూసీసీకి ముడి పెట్టడం కూడా సరికాదని ఆయన అన్నారు. అన్నింటికీ మించి నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన వ్యవసాయ సంస్కరణ చట్టాలు ఎంతో మంచివే అయినా వాటిని అమలు చేయదలచిన తీరు, తేవడానికి తొందరపడడం వల్ల దేశానికి నష్టం జరిగిందనీ, ఉమ్మడి పౌరస్మృతి విషయంలో ఈ తొందరపాటుకు అవకాశం లేకుండా చేయాలని ఆయన సూచించారు. మంచి పని చేస్తున్నాం కాబట్టి మంచి భాషను, సామరస్యంగా పరిష్కరించాలన్న ధ్యేయం తప్పనిసరి అని కూడా ఆయన చెప్పారు. 22వ లా కమిషన్ పిలుపు నేపథ్యంలో డాక్టర్ జేపీతో జాగృతి జరిపిన ముఖాముఖి ఇక్కడ ఇస్తున్నాం.

# వ్యవసాయ చట్టాల మాదిరిగా తొందరపడకూడదు




**ఉమ్మడి పౌరస్మృతి పెద్ద చర్చనీయాంశం, చర్చించ వలసిందే కూడా. ఉమ్మడి పౌరస్మృతిని మీరు ఎలా చూస్తున్నారు? దాని అవసరం పెరిగిందా?**

ప్రతి సమాజానికి రాజ్యాంగం కొన్ని ఉదాత్త విలువలను ప్రతిపాదిస్తుంది. ఎలాంటి సమాజం ఉండాలో పెద్దలంతా అందులో ప్రతిపాదిస్తారు. అదే సమయంలో సామాజిక రీతి ఉంటుంది. మంచి రాజ్యాంగం లేదా మంచి రాజ్యం వ్యక్తి జీవితంలో అనవసరంగా జోక్యం చేసుకోకూడదు. అలాగే ఛాందసాన్ని నమ్మకం పేరుతో కొనసాగనీయకూడదు. అంటే రాజ్యాంగ విలువలను చేరుకోవడానికి సమాజాన్ని ప్రేరేపించాలి. ఈ రాజ్యాంగ విలువలకు, సామాజిక రీతికి మధ్య సంఘర్షణే రాజకీయం. ఏ కులమైనా, ఏ మతమైనా, ఏ ప్రాంతమైనా, ఏ భాషకు చెందినా భారతీయ సమాజం చాలా బలమైనది. మన కుటుంబాలంత బలంగా ఉండే కుటుంబాలు బహుశా ప్రపంచంలో ఎక్కడా లేవు. కాబట్టే ఇంత బీదరికంలోను, ప్రభుత్వాలు ఇన్ని రంగాల్లో ఇంత విఫలమవుతున్నాకూడా పెద్దగా సమాజంలో అశాంతి, హింస, నేరప్రవృత్తి చూడం. అసలు లేవని కాదు. ఇన్ని సమస్యలున్న సమాజాలు అల్లకల్లోలంగా ఉంటాయి. అలాగే మతాలకతీతమైన ధర్మనిరతి, మంచి చెడు విచక్షణ సహజంగా ఈ దేశ ప్రజల్లో అత్యధికులకు ఉన్నాయి. అది సంప్రదాయంలో భాగంగా వచ్చింది. తప్పులు చేయరని కాదు. కానీ ఇది తప్పు అన్న స్పృహ, తప్పు చేస్తే సమాజం వెలివేస్తుందేమో, చులకన అవుతామన్న భావన చాలామందిని మంచి మార్గంలో నడిపిస్తున్నది. ఒక రాజ్యానికి, రాజ్యాంగా నికి సవాలు ఏమిటంటే – సంప్రదాయంలో ఉన్న బలాన్ని, సమాజానికి పనికొచ్చే దాన్ని కాపాడుతూ, చెడుని, పాత వాసనలని ఆధునిక యుగానికి సరిపోనటువంటిది, మానవ హక్కుల ఉల్లంఘించేది నిర్జించకపోతే రాజ్యాంగానికి అర్థంలేదు. రాజ్యాంగ విలువలకు అర్థంలేదు. హిందూ సంప్రదాయంలోనూ గతంలో దుర్లక్షణాలు ఉన్నాయి. అసలు అది భౌగోళిక ప్రాంతమే తప్ప మతం అనడానికి లేదు. రకరకాల భావజాలాల వారి జీవన విధానమది. దానిలో చార్వాకులున్నారు, నిరీశ్వరవాదం చెప్పేవారు, కణాదులు ఉన్నారు. వారందరినీ కలిపాము. సతీ సహగమనం ఒకప్పుడు గొప్ప అనుకునేవారు. దాన్ని తెల్లవాళ్ల కాలంలోనే ఆపాం. మనవారే రాజారామమోహన రాయ్‌గానీ, ఇతరులుగానీ పట్టుపట్టి తెల్లవాళ్ల రాజ్యాధికారాన్ని ఉపయోగించుకొని అలా సమాజాన్ని ఆధునీకరించే ప్రయత్నం చేశారు. బాల్య వివాహాలను నిరోధిస్తే ఈశ్వరచంద్ర విద్యాసాగర్, వీరేశలింగం వంటి వాళ్ల మీద దాడులు చేశారు. నా పెంపుడు తల్లి బాల వితంతువు. ఆమె తండ్రి మరో పెళ్లి చేసుకొమ్మని కోరాడు. ఏదో సిద్ధాంతం, ఆదర్శం కోసం కాదు.వేరే పిల్లలు లేరు. ఏదో కాస్తో కూస్తో ఆస్తి ఉన్నది. మరి సంతానం లేకపోతే ఎలా? కాని ఆవిడ ఒప్పుకోలేదు. అంటే మన సంప్రదాయం 10, 11 ఏళ్ల వయసు ఉన్న ఆడపిల్ల మనసులో మళ్లీ పెళ్లి చేసుకుంటే తప్పు అన్న భావన ప్రవేశపెట్టింది. బాల్యవివాహాన్ని ప్రోత్సహించడం, వితంతువును బానిసగా చూడడంగానీ, వితంతు పునర్ వివాహాన్ని ఆపడం మూడూ తప్పులే. కానీ మా సంప్రదాయం ఇంతే, చిన్నప్పుడే పెళ్లి చేస్తాం మీరెవరు కాదనడానికి అన్నాడనుకోండి కచ్చితంగా తిరస్కరించాలి. నా దృష్టిలో సరిగ్గా గనుక తయారుచేసినట్లయితే ఉమ్మడి పౌరస్మృతి ఆ పరిమితమైన బాధ్యతను నిర్వర్తించాలి. దానికి ఎవరు ఎదురు తిరగవలసిన అవసరం లేదు. మనం కూడా ఇది మతాల సమస్యగా భావించకుండా మానవత్వ అంశంగా భావించాలి.

సరే, ఉమ్మడి పౌరస్మృతిని ఆదేశికసూత్రాలలో ఎందుకు పెట్టారు? ఒక ఆధునిక సమాజం నిర్మాణం కావాలని. సంప్రదాయంలో మానవ సమాజానికి హాని చేసే ఛాందసాలని తొలగించాలి. నా దృష్టిలో

మహిళలకు అనాదిగా దాదాపు అన్ని మతాల్లో కూడా అన్యాయం జరిగింది. కొన్ని మతాల్లో ఇప్పటికీ జరుగుతున్నది. బహు భార్యాత్వం ఆధునిక యుగంలో సహించేది కాదు. అది ఏ మతం పేరుతో, ఏ కులం పేరుతో ఉన్నా కచ్చితంగా పోవాలి. ఆడపిల్ల పుట్టగానే చంపేశారనుకోండి. దానిని సంప్రదాయ మన్నారనుకోండి. ఆధునిక సమాజం అంగీకరించ కూడదు. ఆఫ్రికాలో కొన్ని ప్రాంతాల్లో ఆడపిల్ల పుట్టగానే మర్మాంగాలు కోసేస్తారు. అది సంప్రదాయ మని చెప్పినా క్షమించడానికి వీలైంది కాదు. వివాహం, ఆస్తి విషయంలో మగవారికి ఒక హక్కు ఆడవారికి ఒక హక్కు. హిందూ సమాజంలో మగ వారికి ఆస్తి హక్కు ఉంటుంది, ఆడవారికి ఉండదు. ఆధునికయుగంలో కచ్చితంగా ఇది తప్పు. కాబట్టి మహిళల హక్కులు, వైవాహిక సంబంధంలో




సమానత్వం, వ్యక్తి హింసకు దారి తీసే పరిస్థితులను ఆపడం, పౌరహక్కుల ఉల్లంఘన, ఈ పేరుతో ఉన్న ఛాందసభావాల్ని పక్కనపెట్టడం. ఇవన్నీ ఆధునిక రాజ్యం చేయాలి. హిందూమతంలో, క్రైస్తవ మతంలో, ఇస్లాంలో పొరపాట్లు ఉంటే తొలగించాలి. బౌద్ధంలో, జైనంలో, సిక్కిజంలో ఉన్నా తొలగించాలి. అందుకే యూసీసీని మతాల సమస్యగా చూడడం ఆధునిక రాజ్యంలో సరైన పద్ధతి కాదు. కానీ మన దేశంలో ఏం జరుగుతున్నదంటే కులం, ప్రాంతం, భాష, మతం పేరుతో, వాటికి ఏదో జరిగిపోతోందన్న వాదనతో ప్రతిదాన్ని రాద్ధాంతం చేస్తున్నాం. ఉమ్మడి పౌరస్మృతి అంశానికి వస్తే అది ఇస్లాంకి, హైందవా నికి లేదా క్రైస్తవానికి వ్యతిరేకమని కాకుండా అందులో ఏం ప్రతిపాదిస్తున్నారు మీరు? ఎందుకు ప్రతిపాదిస్తున్నారు. ఆధునిక సమాజంలో ఈ మార్పు అవసరమా కాదా? అని ఆలోచిస్తే పరిష్కారాలు వస్తాయి. ఇలాంటి ఆలోచన లేక దేశానికి చాలా నష్టం జరిగింది. రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రిగా ఉండగా సుప్రీంకోర్టు చిన్న తీర్పు ఇచ్చింది. అదే షాబానో కేసు. బీద ముస్లిం మహిళ. ఆమెకు భర్త విడాకులిస్తే సీఆర్‌పీసీ ప్రకారం మనోవర్తి ఇవ్వాలని, ఇంతకీ రూ.200, 150, 275 అంతే. దానికి రాద్ధాంతం చేసి రాజీవ్, పీవీ మెడలు వంచి ముస్లిం ఉమెన్స్ బిల్స్ తీసుకొచ్చారు. ఆనాడే కాంగ్రెసు నాయకులు చాలామంది దాన్ని వ్యతిరేకించారు. ఈనాటి కేరళ గవర్నర్ ఆరీఫ్ మహమ్మద్‌ఖాన్ ఆనాడు హోంమంత్రి. ఈ అంశం మీద రాజీనామా చేశాడు. అలాగే మన రాష్ట్రానికి చెందిన అబీద్ హుస్సేన్‌గారు. హైదరాబాద్ అసోసియేషన్ నుంచి ఐఏఎస్‌కు వచ్చాడు. వారు వ్యతిరేకించారు. దేశం చాలా నష్ట పోయింది దానివల్ల. కాబట్టి ఈ అంశాన్ని మత పరంగా కాకుండా హేతుబద్ధంగా మహిళల హక్కులు, పిల్లల హక్కులు, ఆధునిక సమాజంలో భాగస్వామ్యం కోణం నుంచి ఆలోచిస్తే దేశానికి ప్రయోజనం.

**దీనికి వ్యతిరేకత మైనారిటీల వైపు నుంచి ఎక్కువ ఉంది కానీ మెజార్టీ వర్గీయుల నుంచి లేదు కదా!**

కారణం ఏమిటి? 50వ దశకంలో ఛాందస హిందువులు కొంతమంది హిందూకోడ్ బిల్‌ను తిరస్కరించారు. ఆ బిల్‌ను నెహ్రూగారు వెంటనే చట్టం చేయట్లేదని అంబేద్కర్ రాజీనామా చేశారు. అంబేద్కర్‌గారు రాజీనామా చేసిన తరువాత చట్టం వచ్చింది. కాబట్టి హైందవ సమాజం వరకు ఉమ్మడి పౌరస్మృతి, ఆధునికీకరణ చట్టపరంగా చాలావరకు జరిగాయి. ఇంకేమైనా కొరత ఉంటే జరిపించాలి. ఉదాహరణకు వారసత్వంలో గనుక తేడా ఉంటే కచ్చితంగా మార్పు చేయాలి. హైందవ సమాజంలో వివాహ విషయంలో తేడా లేదు. ఆడపిల్లకు హక్కులు, మగపిల్లకు హక్కులు సమానంగా ఉన్నాయి. ఆస్తి హక్కుల విషయంలో కొన్ని తేడాలున్నాయి. మన రాష్ట్రంలో ఎన్టీరామారావుగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మహిళలకు సమాన హక్కు ప్రవేశపెట్టారు. అదైనా కాగితం మీద ఉందిగానీ, వాస్తవంగా ఎంత అమలయిందో తెలియదు. ఎన్ని కుటుంబాలు ఆచరిస్తున్నాయో లేదో చెప్పలేను. సర్వే ఆధారాలు లేవు. కేరళ వంటి రాష్ట్రాల్లో మాతృస్వామ్యం ఉంది. చట్టపరంగా అందరికీ సమాన ఆస్తి హక్కు బహుశా హైందవ సమాజంలో అవసరం. అలాంటివి మినహాయిస్తే హైందవ సమాజంలో కొత్తగా ఉమ్మడి పౌరస్మృతి వల్ల వచ్చే మార్పులు నాకు తెలిసినంత వరకు పెద్దగా లేవు. అందుకని పెద్దగా ఇబ్బంది కనిపించకపోవచ్చు. కానీ ఒకప్పుడు హైందవ సమాజంలో కూడా ప్రతిఘటన వచ్చింది.

**డా. అంబేద్కర్ లాంటివారు, బెనిగల్ నరసింహా రావుగారు, ఆ తరువాత జస్టిస్ వీఆర్ కృష్ణయ్యర్‌గారు, జస్టిస్ వై.వి.చంద్రచూడ్‌గారు, వీళ్లందరు కూడా**



**వరసబెట్టి చెబుతూనే ఉన్నారు. యూసీసీ వల్ల సామరస్యం వస్తుంది, దేశ సమైక్యత వస్తుందని చెబుతున్నారు. అయినప్పటికీ కూడా కొన్ని పార్టీలు ఈ రోజుకీ అర్థం చేసుకోకుండా ఈ చట్టాన్ని హిందూమతం ఆధిపత్యం వహించే విధంగా వస్తుందని ముస్లింల చేత చెప్పించడం ఎంతవరకు సమంజసం? అది ప్రమాదం కదా?**

ఈ మతం ఆ మతం అని కాదు. సమాజాన్ని ఆధునీకరించాలంటే ఛాందసాన్ని నమ్ముకున్నవాళ్లు కొంత వ్యతిరేకిస్తారు. మనం చూడవలసింది సమాజంలో ఉన్నటువంటి అత్యధికులకు ప్రయోజనం చేకూరుతుందా లేదా, వారికి స్వేచ్ఛ పెరుగుతుందా లేదా? సమాజం ఆధునికీకరణవైపు వెళుతుందా లేదా? ఇవే. ఆ రకంగా చూస్తే అసలు ఈ వాదనకు నాకు ఆధారం కనిపించటం లేదు. మొదట్లోనే ప్రస్తావించినట్లుగా రాజకీయంలో వ్యక్తి ఔన్నత్యం, విధానాలు వ్యక్తి జీవితానికి మధ్య సంబం ధాన్ని అన్వేషించే ప్రయత్నం పక్కన పెట్టాం. ప్రతి దాన్ని కూడా రాద్ధాంతం చేస్తున్నాం. నిజానిజాలతో సంబంధం లేదు.

**హిందూ బిల్ మూలాన హిందూ మహిళ కొంత మెరుగైన పరిస్థితిలోనే ఉంది. కానీ ఇస్లాం సంబంధిం చినంతవరకు ఆరోగ్య సమస్య ఉన్నది. ఎక్కువమంది పిల్లల్ని కనడం మూలంగా వచ్చిన సమస్య. దానిని అధిగమించడానికైనా ఉదారవాదులు యూసీసీ గురించి మాట్లాడవలసిన అవసరం ఉంది కదా! వాళ్లు మౌనంగా ఎందుకున్నారు?**

ముందు ఒక విషయం గమనించాలి. ముస్లిం స్త్రీలు ఎక్కువమంది పిల్లల్ని కనటం అన్న విషయంలో చాలామందికి అపోహ ఉంది. నేను స్పష్టంగా చెబుతున్నాను. దేశంలో అన్ని వర్గాలు– అగ్రకులాలు,



దళితవర్గాలు, పట్టణవాసులు, గ్రామీణులు, బీదలు, డబ్బున్నవారు, చదువుకున్న వారు, చదువులేనివారు అన్ని వర్గాల్లో కూడా జననాల రేటు తగ్గుతున్నది. కానీ జననాల రేటులో తేడా ఉంది. ఇవాళ బిహార్‌లో ఎక్కువ జననాలున్నాయి. మనకు తక్కువ ఉన్నాయి. అలాగే యూపీలో ఎక్కువగాఉన్నాయి. అన్ని రాష్ట్రాల్లో కూడా జననాల రేటు క్రమక్రమంగా తగ్గుతున్నది. ముస్లింలలోను తగ్గుతున్నది. ఉత్తరాదిలో, దక్షిణాదిలో తగ్గుతున్నది. కాకపోతే వివిధ చారిత్రక కారణాలవల్ల కొన్ని వర్గాలు ఐదు, పదేళ్లు వెనుక ఉన్నాయి. ఫెర్టిలిటీ రేటు ఉంది. ఒక మహిళ ఎంతమంది పిల్లల్ని సగటున కంటుందో ఇది చెబుతుంది. 2.1 కంటే తక్కువ వస్తే జనాభా అదుపుకు వస్తుంది. తగ్గుతుంది. అంత కంటే ఎక్కువ ఉంటే జనాభా పెరుగుతుంది. ఇవాళ దేశం మొత్తంలో ఈ ఫెర్టిలిటీ రేటు 2కు వచ్చింది. ఇది కేరళ మొట్టమొదటిగా సాధించింది. రెండు మూడు రాష్ట్రాలు తప్ప అన్ని రాష్ట్రాలు సాధించాయి. బహుశా వచ్చే సంవత్సరం లెక్కవేస్తే 1.9 అవుతుంది. కాబట్టి ముందు జనాభా విషయంలో మన అపోహను తొలగించుకోవాలి. ముస్లింలు అదే పనిగా పిల్లల్ని కంటున్నారన్న అపోహ ఉంది. ప్రతీ వర్గంలో కొన్ని కుటుంబాలలో ఎక్కువ పిల్లలుంటారు. మొత్తంమీద ఆధునికయుగంలో ఏ కుటుంబమైనా పిల్లల భవిష్యత్తును కాపాడాలంటే, ఆదాయానికి తగ్గట్టుగా పిల్లలు తక్కువ ఉంటే బావుటుందని ఆలోచనకు వచ్చింది. డబ్బున్నవారు కూడా అదే పనిగా పిల్లల్ని కనటంలేదు. కాబట్టి ఉమ్మడి పౌరస్మృతికీ, ఈ అంశానికి ముడిపెట్టద్దు. అది నిశ్చయంగా చెబుతున్నాను. గణాంకాలాధారంగా చెబుతున్నాను. ఇది మతాల సమస్య కాదు. ఇక రెండవ విషయానికి వస్తే ప్రతి మతంలో కూడా యథాస్థితి కొనసాగితే, వెనుక బాటుతనం కొనసాగితే, మూఢనమ్మకాలు కొనసాగితే బాగుపడే వాళ్లు కొందరుంటారు. కొన్నివేల సంవత్సరాల పాటు ప్రతి మతంలో కూడా ఎవరు బాగా ఆధిపత్యం చలాయించారు, పూజారివర్గం. హేతుబద్ధమైన ఆలోచన ప్రవేశ పెట్టాలంటే ఎప్పుడూ ఈ వర్గాలు భయపడు తాయి. అదే సమయంలో ఈ యూనిఫామ్ సివిల్‌కోడ్ కోరేటటువంటి వర్గం కూడా దీన్నొక మతాల సమస్య కాకుండా ఆధునీక రించటం కోసం జరుగుతున్న ప్రయత్నంగా భావించాలి. ఎవరికీ ఇబ్బంది కలిగించాలను కోవడం కాదు. మీరు అల్లాను నమ్మినప్పుడు, ఆ మతంలో ఉన్నప్పుడు భారతదేశంలో ఆ స్వేచ్ఛ ఉన్నది. స్వేచ్ఛ కొనసాగుతుంది. ఆ మాట స్పష్టంగా చెప్పాలి.

**యూనిఫామ్ సివిల్ కోడ్ వస్తే ముస్లింల వ్యక్తిగత జీవితంలో ప్రభుత్వ జోక్యం పెరుగుతుందని వాదిస్తున్నారు. ఆ మాటేమిటి?**

ఆ వాదన పూర్తిగా అసంబద్ధమైనది. మానవ సమాజం ఒక ప్రభుత్వాన్ని ఎందుకు ఏర్పాటు చేసుకున్నది. ఉమ్మడి ప్రయోజనాలని కాపాడడం కోసమే. ఒకరి స్వేచ్ఛ మరొకరికి అవరోధం కాకుండా సమాజాన్ని కాపాడాలి. బలమున్నవాడు బలహీనున్ని చితక్కొట్టకుండా ఉండాలి. ఇంతమేరకు రాజ్యానికి పాత్ర ఉండాలి. అంతేగానీ మీ జీవితంలోకి, పడకటింటిలోకి తొంగి చూసి మీరేమి చేయాలో చెప్పడం రాజ్యానికి అవసరం లేదు. అంచేత ఏ మతమైనా సరే, రాజ్యం వచ్చి మీరు జీవితంలో వ్యక్తిగతంగా ఎవరినీ ప్రేమిస్తున్నారు, ఎవరినీ పెళ్లి చేసుకుంటున్నారు, మరి మీ సంతానం ఎక్కడ బతుకుతారు, ఏం చదువుకుంటారు దీన్లో జోక్యం చేసుకుంటే వ్యక్తిగత జీవితంలోకి జోక్యం చేసుకున్నట్లు లెక్క. అలా కాకుండా ఆడపిల్లలకు ఒక విధంగా, మగపిల్లలకి ఒక విధంగా హక్కులుండటానికి వీల్లేదు. వైవాహిక సంబంధాలు ఇద్దరికీ సమానంగా ఉండాలి. ఆధునిక సమాజ హక్కులు కాపాడాలని చెప్తుంటే నా మతం, సంప్రదాయం దెబ్బతిన్నాయని వాదించడం విడ్డూరం. ఇది ఎవరు చేసినా తిరస్కరించాలి.

**ఇస్లామిక్ దేశాలు షరియాను ఉపయోగిస్తున్నాయి. ఇక్కడ షరియాకి నష్టం కలుగుతున్నదన్న వాదించేవారు ఉన్నారు. షరియాను పూర్తిగా అమలు చేయగలరా?**

భారతదేశంలో షరియా లేదు, ఉండరాదు. సివిల్ సంబంధాలవరకు. మిగతా వ్యక్తిగత సంబంధాలవరకు, కాంట్రాక్టుల విషయంలో పాటించవచ్చు చట్టం ఒప్పుకుంటే. కానీ క్రిమినల్ లా విషయంలో షరియా లేదు, మరొకటి లేదు. షరియా పేరుతో చేతులు నరకేస్తారు, తలలు తీసేస్తారు. రాళ్లతో కొట్టి చంపేస్తారు. దీనిని అంగీకరించలేం. ఆధునిక సమాజం నిర్మాణంలో చట్టబద్ధ పాలనకు కొన్ని పద్ధతులున్నాయి. వెనక్కి వెళ్లి వెయ్యేళ్ల క్రితం సమాజాన్ని సృష్టించాలని అనుకొన్నట్లయితే పొరపాటున కూడా ఒప్పుకోకూడదు. ఇక సివిల్ సంబంధాల్లో చూస్తే ఇస్లాంలో వివాహం, నిఖా. నా కర్థమయినంతవరకు కాంట్రాక్టు. ఏ ప్రభుత్వము దాన్నాపకూడదు. వివాహం కాంట్రాక్టులాగే జరుగుతుంటే అభ్యంతరం పెట్టకూడదు. కానీ మగవారు మహిళను ఎప్పుడైనా కారణం లేకుండా వదిలిపెట్టే అవకాశం ఉంటే, ఇద్దరికీ సమాన హక్కులు లేకపోతే దాన్ని కచ్చితంగా ఆపాలి. ఈ రెండు వేర్వేరు విషయాలు. నిఖాలో జోక్యమంటే సంప్రదాయంలో జోక్యం చేసుకున్నట్లే. కానీ తేలికగా విడాకులు ఇచ్చేసి ఆడపిల్లలకి అన్యాయం చేస్తుంటే రాజ్యం చేయవలసిన పని చేయక తప్పదు.

**దీని గురించి ఆ వర్గం నుంచి స్పష్టత రావటం లేదు ఎందుకు?**

కొన్ని మత సంప్రదాయాలలో ఒక్క మాట మాట్లాడితే మీరు పూర్తిగా మతానికి వ్యతిరేకమనే గందరగోళం ప్రవేశపెట్టారు. ఇది పూర్వం లేదు. ఒకప్పుడు అరబ్ దేశాలు, ఇస్లామిక్ దేశాలు ప్రపంచంలో ఆధునీకరణకు ప్రతీకలు. వెయ్యేళ్ల క్రితం జ్ఞానం అంతా భారతదేశం నుండి అరబ్ దేశాలకు ఆపై యూరప్‌కు వెళ్లేది. యూరప్ నుండి మనకు వచ్చేది. వీళ్ల మధ్యలో సంధిగా ఉండేవారు. కేవలం గత వంద ఏళ్లుగా కొందరు కుహనా మతవాదులు ఈ రాద్ధాంతం చేశారు. ఉదాహరణకు సౌదీ అరేబియాలో వాహబిజం వచ్చింది. ఆ వాహబ్‌ను ఆయన కుటుంబంలో కన్నతండ్రి, సోదరుడు పిచ్చోడుగా భావించారు. అలాంటి వాహబ్‌ను పెద్దోడిని చేసి వాహబిజం తీసుకొచ్చారు. ఇప్పటికీ సౌదీ అరేబియాలో నూటికి 75 మంది వాహబిజం పాటించరు. కానీ ఎప్పుడైతే అక్కడ చమురు సంపద వెల్లువెత్తిందో, ఆయిల్ అనేది ఆధునిక యుగంలో అవసరమైందో, రాజ్యాధికారం వాళ్ల చేతుల్లో ఉందో, నియంతృత్వం రాజ్యాధికారమయిందో అప్పుడు ఆ వాహబిజాన్ని విచ్చలవిడిగా పెంచారు. మరొకడు సయిద్ కుతుబ్ అనుకుంటా. ఈజిప్షియన్. 1903 ప్రాంతాల్లో అమెరికాలో చదువుకుంటున్నప్పుడు అనిపించిందట. ఆడమగ అంతా డాన్స్ (నూతన సంవత్సరం సందర్భంగా) చేస్తున్నారు. ఇది బాగాలేదు అనుకున్నాడు. సిద్ధాంతాలు అల్లాడు. ఇవాళ్టి ఇస్లామిక్ ఉగ్రవాదం అతడు ప్రచారం చేసిన సిద్ధాంతం నుంచే వచ్చింది. కానీ భారతీయ సమాజంలో ఏ మతమైనా, ఏ ఆలోచన అయినా, సంప్రదాయమైనా కూడా సహజంగా వచ్చింది. బౌద్ధం హైందవం మీద తిరుగుబాటు, అయినా బుద్ధుడిని మన అవతారాల్లో ఒకడిగా చేశాం. అట్లాగే జైన మతస్తులు. వారిని మన సంప్రదాయంలో భాగం

**షరియా అనేది భారతదేశంలో 1937లో వచ్చింది. రాజ్యాంగ రచన 1946లో మొదలైంది. అంటే షరియా వచ్చి తొమ్మిదేళ్లు. అయినా ముస్లిం పర్సనల్ లాని వీళ్లు అంతగా ఎందుకు అంగీకరించ వలసి వచ్చింది.**

రెండే కారణాలు. ఒకటి ఆధిపత్యమన్న వర్గాలు పట్టుపోతుదన్న భయం, రెండోది అనవసరంగా గత వందేళ్ల కాలంలో ప్రపంచంలో వచ్చిన ఆర్థిక మార్పుల వల్ల కొన్ని దేశాలు ఛాందసాన్ని ఎక్కువ ప్రవేశపెట్టినాయి మతంపేరుతో. దీన్ని మనం చిత్తశుద్ధితో, వివక్ష లేకుండా ఆధునీకరణ కోసం చేసినట్ల యితే అన్ని వర్గాలు ఆమోదిస్తాయి. అత్యధికులు ఎప్పుడూ నిరాదరణకు గురౌతున్నారు. ఒక ప్రజాస్వామ్య దేశంలో మనం చూడాల్సింది ఏమంటే, ప్రాధమ్యాలు. ఉమ్మడి పౌరస్మృతికి తొలి స్థానం ఇచ్చి మిగతా సమస్యలను ప్రక్కనపెట్టవలసిన అవసరం లేదు. అదో కీలక అంశమే. ఏకాభిప్రాయం కోసం ప్రయత్నం చేద్దాం. ఇస్లాంలో గనుక లేదా మరో మతంలో గనుక క్షమించకూడని సంప్రదాయముంటే వాటిని వెంటనే అరికట్టే ప్రయత్నంచేద్దాం. ప్రజాస్వామ్య సమాజంలో ప్రజల మధ్య ఏకాభిప్రాయం సాధించటం అవసరం. ఒకవేళ నా మాటను అతను ఒప్పుకోకపోయినా కూడా అతను చెప్తున్న వాదనలో పస లేకపోయినా కూడా వీలున్నంత మేరకు కూర్చుని సామరస్యంగా ఒప్పించాలని నమ్మేవాణ్ణి నేను.



కాదు అని చెప్పే భావం లేదు. ఇస్లాం మొట్టమొదట వచ్చింది కేరళకు. ఎవరూ దానిని వ్యతిరేకించలేదు. వారు సహజీవనం చేశారు. క్రైస్తవం సెంట్ థామస్ ద్వారా వచ్చింది. ఎవరూ తిరస్కరించలేదు. జుదాయిజం రెండువేల ఏళ్లక్రితం వచ్చింది. ఎలాంటి సిద్ధాంతాన్నైనా, నమ్మకాన్నైనా అంగీకరించి కలుపుకు నేతత్వం ఉన్నది. అది కొనసాగుతుంది. అది గుర్తించాలి. అంతేకానీ మనం ఏం చేసినా కూడా అది మతానికో, కులానికో వ్యతిరేకం అనడం సరికాదు.

**ఇది గత 75 ఏళ్లలో జరగలేదంటారా?**

నేననుకోవటం సమాజం మనం అనుకున్నదాని కంటే సిద్ధంగా ఉంది. మనం వాడే భాష, దాన్ని రాజకీయ కోణం నుంచి గాక మానవీయ కోణం నుంచి చూసే తీరును బట్టి స్పందన ఉంటుంది. మనం నిర్దిష్టంగా మహిళల హక్కులు , మానవ హక్కులు లేకపోతే కొన్ని సంప్రదాయాల వల్ల జరుగుతున్న హింసను ఆపటం..అంతమేరకే తీసు కొస్తున్నామని ప్రజల ముందు చర్చ పెట్టినట్లయితే 100 నుంచి 95మంది ఆమోదిస్తారు.

**ఈ చట్టం తీసుకురావడం వలన సమాజంలో సగభాగం మహిళకి న్యాయం చేకూర్చుతుందని నమ్మచ్చు కదా!**

మానవ సమాజం ఎప్పుడూ కూడా మహిళల్ని నిర్దయగా చూసింది. అన్ని సంప్రదాయాల్లో కూడా ఇది కనిపిస్తుంది. హైందవం, క్రైస్తవం, ఇస్లాం ఏదైనా. మతం ఒక పక్కన ఆధ్యాత్మిక భావన పెంచింది, మనుషులకు ఆలంబనగా ఉన్నది. మనుషుల ప్రవర్తనని ఒక మంచి మార్గాన్ని పెట్టే ప్రయత్నం చేసింది. కానీ కచ్చితంగా లింగ వివక్ష, మత సంప్రదాయాలు రెండు కలిసిపోయినాయి. చాల వరకు, ప్రపంచమంతా కూడా.

**పస్తుత ప్రభుత్వానికి ఈ చట్టం గురించి మీరేమన్నా సలహా ఇస్తారా?**

మనం ప్రేమతో చేదుమందైనా తినిపించవచ్చు. కఠినంగా ఉంటే తీపిమందైనా తిరస్కరిస్తారు. కాబట్టి మంచి చేస్తున్నప్పుడు ప్రభుత్వాలు, పార్టీలు తాము వాడే భాషను, పదజాలాన్ని కొంచెం మృదువుగా ఉంచుకున్నట్టయితే ఎక్కువ అంగీకారం ఉంటుంది. వ్యవసాయ చట్టాలు చూడండి. నూటికి నూరుపాళ్లు నేను సమర్థించాను. మంచి చట్టాలు, వ్యవసాయా నికి పనికొచ్చేవి. అదే గనుక కొంచెం మృదువుగా చేసినట్లయితే బావుండేది. అవి రాకపోవడం వల్ల దేశం చాలా నష్టపోయింది. ఈ చట్టాలు ఎందుకు అవసరమో అర్థమయ్యే రీతిలో గనుక చర్చను ప్రవేశపెట్టి, పార్లమెంట్ కమిటీలో కూడా పెట్టి కొంచెం ఓపిగ్గా చేసినట్టయితే బహుశా చాలా తేలిగ్గా చట్టాలు అమలులోకి వచ్చేవి. ఎప్పుడైతే ఇది జరగలేదో, పక్షపాత రాజకీయ, ప్రజల జీవితానికి సంబంధం లేని రాజకీయం ప్రవేశించింది. అన్ని దేశాలలో రైతులకు స్వేచ్ఛ ఉన్నది. అమ్ముకునే స్వేచ్ఛ. సంకెళ్లు లేవు. చివరికి ఏ రైతుల ప్రయోజనం కోసం మనం ఏం చేయాలని అనుకున్నామో, ఏ రైతుల సంకెళ్లు తీసేయాలని అనుకున్నామో, అందుకు భిన్నంగా ఆ రైతులు మాకు సంకెళ్లు కావాలని కోరుకున్నారు. ప్రపంచ చరిత్రలో బానిసత్వంలో ఉన్నవారు బానిసత్వం కొనసాగాలని కోరుకున్న సంఘటన బహుశా ఇది ఒక్కటే. దానిలో అజ్ఞానం ఉంది. మన తొందరపాటుతనం కూడా ఉంది. వ్యవసాయ చట్టాలు చాలా మంచివి. ఈ దేశంలో నా అంత సమర్థించేవారు ఎవరూ లేరు. నేను నిర్మొహమాటంగా సమర్థిస్తాను. నిజాయితీగా చెప్పినపుడు, ఎంతో కొంత విశ్వసనీయంగా ఉన్న ఈ రంగంలో మనం చెప్పేది వాస్తవమైనప్పుడు ప్రజలంతా విశ్వసిస్తారు. దేశమంతటికి చెప్పే శక్తి మనకు లేదు, ఇన్ని భాషలున్న దేశంలో. దానిని పక్కన పెట్టండి. ప్రభుత్వం నేర్చుకోవలసిన పాఠం ఏమిటంటే మంచైనా కూడా మనం ఒక చర్చ పెట్టి కూర్చోబెట్టి చెప్పినట్లయితే పని సులువవుతుంది. లేదూ, ఇది చేసి తీరాలని గట్టిగా అంటే మంచిది కూడా చెడు ఫలితాన్నిస్తుంది.

**కానీ సుప్రీంకోర్టు, అందరూ వరుసగా దీని అవసరం గురించి గట్టి చెప్పిన మాట వాస్తవమే కదా?**

కాదనటం లేదు. 75 ఏళ్లు ఆలస్యమయింది, ఒక 8 నెలలు ఆలస్యమైతే కొంపమునిగిందేమి లేదు కదా! ఏ అంశాలు కావాలో చర్చకు పెడదాం. ఎందుకవసరమో గణాంకాలతో, వివరాలతో ముందు పెడదాం. ఆ చర్చలో మనం చెపుతున్న మాట వాస్తవమైనట్లయితే దానిలో నిజాయితీ ఉన్నట్లయితే, నూటికి 90 మంది అంగీకరిస్తారు. మనం ఇవాళ మాట్లాడుకున్నాం. నేను నిష్కల్మషంగా మాట్లాడాను. నూటికి 90మంది హిందువులైనా, ముస్లింలైనా, క్రైస్తవులైనా ఈ వాదనను అంగీకరిస్తారని నేను నమ్ముతున్నాను. మనం మృదువుగా మాట్లాడే ప్రయత్నం చేస్తున్నాం. ప్రయోజనాలు చూపెట్టే ప్రయత్నం చేస్తున్నాం. ఆ సరళి ఎప్పుడూ కూడా ప్రజాస్వామ్య సమాజంలో మార్పునకు నాంది పలుకుతుంది. అలా గాకుండా సంఖ్యాబలంతో చేస్తే జరగదు. అందులో మనలాంటి దేశంలో ఎవరి మాట ఎవరూ వినరు. కాబట్టి నేను కోరేది ఆ మృదుత్వం, ఆ వాస్తవాలు హేతుబద్ధ వాదన. నా లాంటివారికి చాలా తొందరగా దేశం మారిపోవాలని ఉంది. దేశం వేగంగా మారిపోవాలని చాలా ఆశ పడుతున్నవారిలో నేనొకణ్ణి. కానీ కొన్ని సందర్భాల్లో నెమ్మదితనం చాలా అవసరం. ★

**ఉమ్మడి పౌరస్మృతిపై మీ అభిప్రాయాన్ని ఈ లింక్ ద్వారా తెలపండి... https://legalaffairs.gov.in/law_commission/ucc/**





# ముస్లింలకు

**ఉమ్మడి పౌరస్మృతి విషయంలో మనదేశంలో చాలా కాలంగా చర్చ జరుగుతోంది. సుప్రీం కోర్టు కూడా గతంలో కేంద్రంలో ఉన్న ప్రభుత్వాలను ఈ అంశాన్ని పరిష్కరించాలని ఆదేశాలిచ్చింది. గతంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం ఈ విషయంలో అనుసరించిన సంతుష్టీకరణ విధానాల కారణంగా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. 2014 లోక్‌సభ ఎన్నికల సమయంలో బీజేపీ ఉమ్మడి పౌరస్మృతి అమలు చేస్తామని తన మేనిఫెస్టోలో ప్రకటించింది. ఆ తర్వాత మోదీ ప్రభుత్వం 2016లో ఉమ్మడి పౌరస్మృతిని పరిశీలించాలని లా కమిషన్‌కు సిఫార్సు చేసింది. దీనిపై వివిధ వర్గాలతో చర్చించి అధ్యయనం చేసిన లా కమిషన్‌ ప్రస్తుతానికి ఉమ్మడి పౌరస్మృతి అవసరం లేదంటూ నివేదిక ఇచ్చింది. అయితే కేంద్ర ప్రభుత్వం దీన్ని ఇంతటితో వదిలేయకుండా తన ప్రయత్నాలు తాను చేస్తూ వచ్చింది.**

దేశంలో వివాహం, విడాకులు, జనన, మరణాలు, ఆస్తుల విషయంలో అన్ని మతాల వారికీ ఒకే చట్టం అమలు చేయాలని మోదీ సర్కార్‌ భావిస్తోంది. అయితే దీన్ని కాంగ్రెస్‌, ఎస్పీ, బీఎస్పీ, డీఎంకే, ఎన్సీపీ, ఎన్సీ, లెఫ్ట్‌, తృణమూల్‌ సహా అనేక అన్ని విపక్షాలు వ్యతిరేకించాయి. వీరి వ్యతిరేకత ఎందుకో అందరికీ తెలిసిన విషయమే. ఎందుకంటే ముస్లింలకు ఇబ్బంది కలిగిస్తే వారి ఓట్లు పడవు కనుక. అయితే ఇందులో వాస్తవం ఎంత? ఈ చట్టం తీసుకొస్తే ముస్లింకు నిజంగా హాని కలుగుతుందా? సానకూల అంశాలేమీ లేవా? అన్నది కూడా విశ్లేషించుకోవాల్సిన అవసరం ఉంది.

**రాజ్యాంగ సభలో చర్చ**

భారతదేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత రాజ్యాంగ రచనా సమయంలో ఉమ్మడి పౌరస్మృతిపై చర్చ జరిగింది. ‘భారతదేశ ప్రజలందరికీ ఏకరూప పౌరస్మృతిని ఏర్పరచ డానికి మన రాజ్యాంగ వ్యవస్థ కృషి చేయాలి’ అని రాజ్యాంగ ముసాయిదాలో పొందు పరిచారు కూడా. నవంబర్‌ 23, 1948న ఈ అంశంపై రాజ్యాంగ సభలో చర్చ కూడా జరిగింది. రాజ్యాంగ నిర్మాణ సభలోని ముస్లిం సభ్యులు మహమ్మద్‌ ఇస్మాయిల్‌ సాహిబ్‌, నజీరుద్దీన్‌ అహ్మద్‌, మహబూబ్‌ అలీ బేగ్‌, సాహిబ్‌ బహదూర్‌, పోకర్‌ సాహిబ్‌, హుసేన్‌ ఇమాంలు దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు. ఉమ్మడి పౌరస్మృతి ఉండాలన్న ప్రతిపాదనకు వీరు గండికొట్టారు. ఉమ్మడి పౌరస్మృతి పట్ల వారి తీవ్ర వ్యతిరేకత చూసి అంబేడ్కర్‌ సహా రాజ్యాంగ సభలోని ఇతర సభ్యులూ ఆశ్చర్యానికి గురయ్యారు. ప్రధాని జవహర్‌లాల్‌ నెహ్రూ ముస్లిం ప్రతినిధుల దూకుడును అడ్డుకునే ప్రయత్నం చేయకపోవడం గమనార్హం.

పెళ్లి, విడాకులు, వారసత్వం వంటి అంశాల్లో ముస్లింలకు వర్తించే సూత్రాలు పూర్తిగా మతం మీదే ఆధారపడినవని ముస్లిం ప్రతినిధులు వాదించారు. లౌకిక వాదానికి మహబూబ్‌ అలీ బేగ్‌ ఓ వికృత భాష్యం చెప్పారు. లౌకిక రాజ్యంలో భిన్న మతస్థులు తమ తమ వ్యక్తిగత న్యాయ సూత్రాలను పాటిస్తూ తమ పంథాలో తాము జీవించే హక్కు కలిగి ఉండాలన్నది ఆయన వాదన సారాంశం. ఈ వాదనలను మున్షీ గట్టిగా సవాలు చేశారు. ‘ఏ ఆధునిక ముస్లిం దేశంలోనూ ఉమ్మడి పౌరస్మృతి అమలుకు మైనారిటీల వ్యక్తిగత న్యాయ సూత్రాలు అడ్డురాలేదు, రానివ్వలేదు. అవి తిరుగులేనివని ప్రకటించలేదు. కావాలంటే టర్కీ, ఈజిప్ట్‌లను చూడండి. అక్కడ ఏ మైనారిటీ వర్గానికీ సొంత వ్యక్తిగత న్యాయసూత్రాలను అనుమతించలేదు’ అని మున్షీ గుర్తుచేశారు. మనదేశంలోనూ ముస్లింలలో మైనారిటీలైన ఖోజా, కుతి మెమన్‌లకు సొంత, వ్యక్తిగత న్యాయ సూత్రాలను మెజారిటీ ముస్లింలు అనుమతించలేదని ఆయన పేర్కొన్నారు.

రాజ్యాంగ సభలోని ముస్లిం సభ్యుల వాదనలు భారత్‌ను సమైక్య దేశంగా పటిష్టం చేస్తాయా అని అల్లాడి కృష్ణస్వామి అయ్యర్‌ ప్రశ్నించారు. ఈ దేశంలో వివిధ వర్గాలు నిత్యం పోటీ పడుతూ, కలహించుకుంటూ జీవితం గడపాలా? అని నిలదీశారు. బ్రిటిష్‌వారు దేశమంతటికీ ఒకే నేరస్మృతిని ప్రవేశపెట్టినప్పుడు వ్యతిరేకించని ముస్లింలు ఇప్పుడు ఉమ్మడి పౌరస్మృతిని ఎందుకు ప్రతిఘటించాలని అయ్యర్‌ సవాలు చేశారు. మారుతున్న కాలానికి తగినట్లు మారడానికి ఈ దేశంలో సిద్ధంగా ఉన్న ఏకైక వర్గం మెజారిటీ హిందూ వర్గమేనని ఆయన అన్నారు.

**అపోహలు-నివృత్తి**

ఉమ్మడి పౌరస్మృతి మీద ముస్లింలకు ఉన్న అపోహలు ప్రధానంగా ఇలా ఉన్నాయి. అయితే వాటికి సమాధానాలు కూడా ఉన్నాయి.

1. యూనిఫాం సివిల్‌ కోడ్‌ అంటే హిందూ చట్టాన్ని విధించడం.

ఇది పూర్తిగా తప్పు. యూనిఫాం సివిల్‌ కోడ్‌ అంటే వ్యక్తిగత చట్టాలలో ఏకరూపత మాత్రమే. ఇది మతంతో సంబంధం లేని తటస్థ చట్టం అవుతుంది.

2. యూనిఫాం సివిల్‌ కోడ్‌ ముస్లిం మత స్వేచ్ఛను హరిస్తుంది.

లేదు. ప్రాథమిక హక్కుగా ఇచ్చిన మత స్వేచ్ఛ రాజ్యాంగం ప్రకారం అలాగే ఉంటుంది.

3. మాకు (ముస్లింలకు) నిజంగా యూనిఫాం సివిల్‌ కోడ్‌ అవసరం లేదు.

ఈ లాజిక్‌ ప్రకారం వాదిస్తే మనకు ఇక ఎలాంటి చట్టాలు అవసరం లేదు. ఈ చట్టం దీర్ఘకాలంలో సమాజానికి మేలు చేస్తుందని అర్థం చేసుకోవాలి. ఉమ్మడి పౌరస్మృతి తమ మతంపై, సంస్కృతిపై దాడి అని ముస్లింలు భావిస్తున్నారు. తమ వ్యక్తిగత అంశాల్లో ప్రభుత్వ జోక్యం ఎందుకని ప్రశ్నిస్తున్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్‌ 25 ద్వారా సంక్రమించే మత స్వేచ్ఛకు ఉమ్మడి పౌరస్మృతి అడ్డంకి అని



# అపోహాలెందుకు?



వాదిస్తున్నారు. ఇది ముస్లింల భావోద్వేగాలకు సంబంధించిన సున్నితమైన అంశం కావడంతో మేధావులు కూడా మౌనం వహిస్తున్నారు. ఉమ్మడి పౌర చట్టంపై ప్రతిఘటన రావొచ్చని వారి ఆందోళన.

అయితే ఉమ్మడి పౌరస్మృతిపై చర్చకు ముందు ముస్లిం సమాజాన్ని కుదిపేసిన మూడు ప్రధాన ఘటనలు ఉన్నాయి. అవి షాబానో కేసు, సరళా ముద్గల్ కేసు, త్రిపుల్ తలాక్ రద్దు. మొదటిది రాజీవ్ గాంధీ హయాంలో జరిగితే, మూడోది ప్రస్తుత ప్రధాని మోదీ తీసుకొచ్చినది.

**షా బానో కేసు (1985)**

మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన 62 ఏళ్ల ఒక సాధారణ ముస్లిం మహిళ పేరు ఉన్నట్లుండి దేశమంతా మార్మోగిపోయింది. మొహమ్మద్ అహ్మద్ ఖాన్ అనే వ్యక్తి 40 ఏళ్ల వైవాహిక జీవితం తరువాత తన భార్య షా బానోకు మూడు సార్లు తలాక్ చెప్పి విడాకులు ఇచ్చాడు. ఆమెకు మనోవర్తి కూడా ఇవ్వడానికి నిరాకరించాడు. స్థానిక కోర్టు రూలింగ్ వల్ల తొలుత కొద్ది నెలలు ఆమె భరణం అందుకుంది. అయితే అహ్మద్ ఖాన్ దీనిపై సుప్రీంకోర్టు కెక్కాడు. ఇస్లామిక్ చట్టాల ప్రకారం తాను షా బానోకు జీవితాంతం మనోవర్తి ఇవ్వాల్సిన పనిలేదని వాదించాడు. సుప్రీంకోర్టు ఆలిండియా క్రిమినల్ కోడ్‌లోని సెక్షన్ 125ను ఉపయోగించింది. భార్యా బిడ్డలు, తలిదండ్రుల పోషణ భారం సదరు భర్తదేనని ఆమెకు అనుకూలంగా తీర్పు నిచ్చింది. ఆ సందర్భంలోనే సీజేగా ఉన్న జస్టిస్ వైవీ చంద్రచూడ్ ఉమ్మడి పౌరస్మృతి ఆవశ్యకతను చెప్పారు. 'కామన్ సివిల్ కోడ్ ద్వారా జాతీయ సమైక్యత, సమగ్రతలను సాధించవచ్చు. పార్లమెంటు దీనిపై వెంటనే దృష్టిపెట్టాలి' అన్నారు. రాజీవ్‌గాంధీ ప్రభుత్వం దీన్ని పట్టించుకోలేదు. అప్పట్లో ముస్లింలలోని ఒక వర్గం ఒత్తిడికి తల వంచి రాజీవ్ గాంధీ ప్రభుత్వం 1986లో ముస్లిం మహిళల (విడాకుల హక్కుల రక్షణ) చట్టాన్ని తెచ్చింది. ఇది మహిళల వ్యక్తిగత హక్కులకు, మైనారిటీ వర్గ హక్కులకు మధ్య సంఘర్షణను సృష్టించింది.

**సరళా ముద్గల్ కేసు (1995)**

హిందూ వివాహ చట్టం ప్రకారం ఒక మహిళను పెళ్లాడిన ఓ వ్యక్తి, అది కొనసాగుతుండగానే, ఇస్లాం మతంలోకి మారి ఓ ముస్లిం మహిళను పెళ్లాడిన ఘటన ఇది. దీన్ని విచారించిన సుప్రీంకోర్టు రెండో పెళ్లి చట్టవిరుద్ధమని తేల్చింది. ఆ సమయంలోనే సాధ్యమైనంత త్వరగా ఉమ్మడి పౌరస్మృతి తేవాలని కేంద్రానికి సూచించింది.

**త్రిపుల్ తలాక్ రద్దు**

మోదీ ప్రభుత్వం తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాల్లో త్రిపుల్ తలాక్ రద్దు ఒకటి. ఇది భారత్‌తో పాటు ముస్లిం దేశాల్లో కూడా చర్చనీయాంశమైంది. దీని ప్రకారం ముస్లిం పురుషులు మూడు సార్లు తలాక్ చెప్పి తమ భార్యలకు విడాకులు ఇవ్వడాన్ని (త్రిపుల్ తలాక్ లేదా తలాక్-ఏ-బిద్దత్)ను నేరంగా పరిగణిస్తారు. తలాక్ చెప్పడాన్ని ఎస్ఎంఎస్, వాట్సాప్, రాతపూర్వకంగా, నోటి మాటతో లేదా ఇతర ఏ మార్గం/పద్ధతిలో చెప్పినా ఆ చర్య నేరమని ఈ బిల్లు చెబుతోంది. మూడేళ్ల వరకు జైలు శిక్ష విధించేలా నిబంధనలున్నాయి. ఎవరైనా ముస్లిం పురుషుడు తలాక్-ఏ-బిద్దత్ పద్ధతిలో భార్యకు విడాకులిచ్చాడని ఫిర్యాదు వస్తే, వారెంట్ లేకుండానే అతన్ని అరెస్టు చేసే అధికారం పోలీసులకు ఉంటుంది. అయితే బాధిత మహిళ లేదా ఆమె రక్తసంబంధీకులు లేదా అత్తింటివారు ఫిర్యాదు చేస్తే మాత్రమే పోలీసులు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. బాధిత మహిళ వాఙ్మూలాన్ని కూడా పరిశీలించిన తర్వాతనే అవసరం అనుకుంటే నిందితుడికి బెయిలు మంజూరు చేయవచ్చు. విడాకుల అనంతరం తాను, తన పిల్లలు బతకడానికి అవసరమైన భరణం ఇవ్వాలని భర్తను అడిగేందుకు మహిళలకు హక్కు ఉంటుంది.

త్రిపుల్ తలాక్ రద్దు మాదిరిగానే ఉమ్మడి పౌరస్మృతి కూడా ముస్లిం మహిళల పరిస్థితిని మెరుగుపరుస్తుంది. లింగసమానత్వ న్యాయం దిశగా ఇది మరో ముందడుగవుతుంది. త్రిపుల్ తలాక్‌కు వ్యతిరేకంగా గతంలో దేశవ్యాప్త ఉద్యమం చేపట్టిన 'భారతీయ ముస్లిం ఆందోళన సంస్థ' ప్రతినిధులు ఉమ్మడి పౌరస్మృతికి మద్దతు ఇస్తామని ప్రకటించడం కీలక పరిణామం.

**ఎందుకీ వ్యతిరేకత**

కులాలు, మతాలు ఉండవద్దంటున్న వారే ఉమ్మడి పౌరస్మృతి అనగానే ఉలిక్కి పడుతున్నారు. ఈ విషయంలో ముస్లింలకన్నా కమ్యూనిస్టులే ముందుంటారు. వారి తరవాత మైనార్టీ ముస్లిం ఓట్లు పోతాయనే భయంతో కాంగ్రెస్ తదితర పార్టీలు జతకడతాయి. ఉమ్మడి పౌరస్మృతి అన్న పదం రాగానే ఈ పార్టీలకు వణుకు పుడుతుంది. ★

ఉమ్మడి పౌరస్మృతిపై మీ అభిప్రాయాన్ని ఈ లింక్ ద్వారా తెలపండి... https://legalaffairs.gov.in/law_commission/ucc/

“అప్పుడు వాళ్లు ఇచ్చిన నవల లేదా ఇంకో రచన మనం ప్రచురించాలి. అంతే కదా”!

“జరుగుతుంది అదే... వాళ్లు కూడా ఏది బడితే అది రాయరు. నవల క్లిక్ కాకపోతే వారికి కూడా నష్టమే కదా!”

“ఫ్రెండ్స్... నా దృష్టిలో ఎడిటర్ ఈజ్ బాస్. ఎడిటర్ అవసరం లేని రచనలు నాకు అవసరం లేదు. ముందు నేను ఆ రచనని చదవాలి. పాఠకుడిగా, సంపాదకుడిగా నాకు నచ్చాలి. అంతేగాని నాలుగు వారాల నవల పంపించి అది మొదలు పెట్టుకోండి అనే పద్ధతికి నేను వ్యతిరేకం”.

అప్పటికే వారి ముఖంలో అసహనం కనిపించింది.

“ఏ క్షణం ఏమయినా జరగవచ్చు. ఆ రచయితకి ప్రమాదం జరగవచ్చు. అతనో, ఆమో జబ్బుపడవచ్చు. అప్పుడు ఆ సీరియల్‌ని ఆపమంటారా? అది శీర్షిక అయితే ఫర్వాలేదు. అందుకే కొన్ని రచనల విషయంలో నాకు బౌండెడ్ స్క్రిప్టు కావాలి” అన్నాను.

“మనందరం ఇందులో సమాన భాగస్వాములం గోవింద్..కథల ఎన్నికల విషయంలోనూ నీతో తగాదాపడాల్సి వస్తోంది. ఇది సక్సెస్ అవుతుందని ముందు ఎవరూ చెప్పలేరు. సినిమా అయినా అంతే... మనం పట్టుకున్న కుందేలుకి మూడే కాళ్లు అంటూ కూర్చుంటే పత్రికను నడపటం కష్టం” సాధ్యమైనంత మృదువుగానే అన్నాడు.

“అందుకే నేను పత్రిక నుండి తప్పుకోవాలనుకుంటున్నాను” అన్నాను.

“అప్పుడు తరచుగా రాస్తుంటారు కదా ఒక్కసారిగా నిశ్శబ్దం అని... అలా అయిపోయింది వాతావరణం” అని ఆగాడు గోవింద్.

“నేను సినిమా గురించి చెబుతూ పత్రికలోకి టాపిక్ మార్చానని నీకు అనిపిస్తోందా రిత్విక్”.

“లేదు సర్. అన్నీ ఇంటర్ లింక్‌డ్. నా కయితే చాలా ఇంట్రెస్టింగ్‌గా వుంది”.

“మనం ఓ అరకప్పు గ్రీన్ టీ తాగుదాం”... అని “బహుశా నువ్వు రాజన్ టీకి అలవాటు పడినట్లు వున్నావు” అన్నాడు గోవింద్ నవ్వుతూ. అప్పుడు రాజన్‌ని పిలిచాడు.

“పెద్దాయన ఏం చేస్తున్నారు రాజన్”.

“గదిలో వున్నారు. రెస్ట్ తీసుకుంటున్నారు”.

“మంచిది. మాకు రెండు టీ”.

అతను తలూపి వెళ్లాడు.

“రామకృష్ణ గారి గురించి నీకు తెలియదు రిత్విక్. గ్రేట్ జీనియస్. నీకు వారి గురించి చాలా చెప్పాలి. సందర్భాన్ని బట్టి చెబుతుంటాను. ఆయనది మా జిల్లానే. చిన్నప్పటి నుంచి మా ఊర్లో అందరూ మాట్లాడుకునేవారు. ఆయన వల్ల చాలా మందికి ఉద్యోగాలు వచ్చాయి. అప్పటి దాకా వ్యవసాయం గురించి మాత్రమే ఆలోచిస్తున్న చోట ఇంజనీరింగ్...అలాగే చిన్నచిన్న కుటుంబాల వారు ఐ.టి.ఐ.లో చేరటానికి కారణం రామకృష్ణ గారు. ఇంత మంది ఫిట్టర్లు... టర్నర్‌లు, ఎలక్ట్రీషియన్లు తయారు కావటం వెనక ఆయనున్నారు”.

“గ్రేట్ సర్” అన్నాడు రిత్విక్.

“మా నాన్నకి ఆయన తెలుసు. నన్ను ఐ.టి.ఐ.లో చేరమన్నారు. ఆ రామకృష్ణ గారికి చెప్పి బతిమాలుకుని ఏదో ఉద్యోగం ఎక్కడో చోట ఇప్పించుకుంటా... నువ్వు కుదురుకుంటావు అన్నాడు. సమస్యే లేదు. నేను ఆ చదువు చదవనన్నాను” అన్నాడు. గోవిందు నవ్వుతూ....

“మీరు పత్రికా రంగంలో ఎదగాలని వున్నప్పుడు అలా జరగదు సర్” అన్నాడు రిత్విక్....

“అప్పటికి నాకు పత్రికా రంగం మీద దృష్టి



ఎండిపై రామమూర్తి స్మారక నవలల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన రచన

7



# మహా సంకల్పం



లేదు. నేను కూడా రామకృష్ణ గారిలా ఏదో ఒకటి సాధించాలి అనుకున్నాను. అంతవరకు నాకు క్లారిటీ వుంది. మా నాన్న బలవంతంగా ఐ.టి.ఐ.లో చేర్పించినా నేను మధ్యలో ఆపి వుండేవాడ్ని. లేకపోతే ఇంటి నుండి పారిపోయేవాడ్ని" అన్నాడు.



"అలాంటి ఆలోచన కూడా మీకు వచ్చిందా!"

"నీకు ఎప్పుడూ రాలేదా?"

రిత్విక్ మాట్లాడలేదు.

"ఇంటిని విడిచిపెట్టి ప్రపంచం చూసి ఫిలాసఫర్‌గా మారటం కూడా చిన్న విషయం కాదు. అందులోనూ నాలో బుద్ధుడు కూడా వున్నాడు".

ఇద్దరూ నవ్వుకున్నారు.

రాజన్ టీ తీసుకు వచ్చాడు.

"పెద్దాయనకు కూడా ఇవ్వకపోయావా?"

"ఆయనే అడుగుతారు. అయినా కనుక్కుంటాను" అని వెళ్లాడు. టీ చప్పరిస్తూ... "మా నాన్నలో గొప్పతనం ఏమిటంటే... నన్ను ఏ మాత్రం బల వంతం చేయకపోవటం. నేను ఏం చేస్తానన్నా కాదనేవాడు కాదు. అందులోనూ నేను వాళ్లకి ఒక్కడ్నే. ఆడిష్టం వచ్చిన పని వాడు చేసుకుంటాడు. మగాడు కదా. అంతగా అయితే వ్యవసాయం చేసుకుంటాడు. రెండెకరాలన్నా వాడికి మిగల్చకపోతానా అనేవాడు".

టీ తాగటం పూర్తి అయింది.

"ఇప్పుడు పత్రిక విషయానికి వద్దాం. ఆ నిశ్శబ్దం నుండి ఓ భాగస్వామి అన్నాడు. మనం విడిపోవటం కోసం కలవలేదు అని. దానికి నేను అన్నాను. ఇవన్నీ సహజం. పిల్లలు మన నుంచి విడిపోతారు. చివరికి అభిప్రాయాలు కలవకపోతే భార్య, పిల్లలు కూడా మన నుంచి వెళ్లిపోతారు. మీరు ముగ్గురు. మీ అందరూ కలసి పత్రికని నడుపుకోవచ్చు".

మళ్లీ నిశ్శబ్దం.

"ఇంకో ఆప్షన్ కూడా వుంది. ఇప్పటి వరకు లెక్కలు చూసుకుందాం. పత్రికను నన్ను నడుపుకో అంటే మీ అందరికీ డబ్బులు యిచ్చి నేను తీసుకుం టాను అన్నాను. నాకు ఇందులో నలభై శాతం దాకా వుంది. అప్పుడు అన్నారు. మేం పత్రిక తీసుకుంటే నువ్వు ఇంకో పత్రిక తీసుకు వస్తావా అంటూ. అదింకా నిర్ణయించుకోలేదు. నేను మాత్రం విజయవాడ షిఫ్ట్ కావాలనుకుంటున్నాను అన్నాను. రేపు చెబుతాం అన్నారు. తర్వాత ఏం మాట్లాడుకున్నారో నాకు తెలి యదు. పత్రికను నువ్వే నడుపుకో అన్నారు. అలా పత్రిక ఇక్కడికి చేరింది" అన్నాడు గోవింద్.

అప్పుడు రామకృష్ణ అక్కడికి వచ్చి....

"ఇద్దరూ ఏదో విషయం గురించి సీరియస్‌గా మాట్లాడుకుంటున్నట్లున్నారు" అన్నాడు. రిత్విక్ లేచి నిలబడ్డాడు.

"ప్లీజ్ సిట్ డౌన్. నేను వచ్చినప్పుడల్లా నువ్వు నిలబడనవసరం లేదు".

రిత్విక్ ముడుచుకుని కూర్చున్నాడు.

"సీరియస్ ఏమీ లేదు. గతాన్ని గుర్తు చేసుకుంటున్నాను".

"అవును. ఇప్పుడు మనకు గతం మాత్రమే మిగిలింది" అన్నాడు సాలోచనగా... తర్వాత...

"బుద్ధా... నీ దగ్గర ఇన్ని సంవత్సరాల నీ పత్రికల కాపీలన్నీ వున్నాయా?" అని అడిగాడు.

"ఉన్నాయి సర్. ఫిజికల్ కాపీలు ప్రతి ఒక్కటీ వుంది. ఇప్పుడు అవన్నీ డిజిటలైజ్ చేయించాను".

"నాకు రిత్విక్ రచనలు చదవాలనుంది. నీకు నచ్చిన రెండు పుస్తకాలు పంపించ గలవా?"



పి. చంద్రశేఖర ఆజాద్

9246573575

అన్నారాయన.

"తప్పకుండా సర్".

రిత్విక్‌కి కాస్త షివరింగ్ మొదలు అయింది. ఓ వ్యక్తిని అంచనా వేయటానికి అతని రచనలు సహకరిస్తాయా? రచన వేరు. జీవితం వేరు కదా అనుకున్నాడు. అందరూ తాము రాసేవాటికి తగినట్లుగా బతక గలిగే పరిస్థితులు ఈ సమాజంలో లేవుకదా అని కూడా అనుకున్నాడు.

"మీ చిన్ననాటి స్నేహితుడు ఒకరు మిమ్మల్ని కలవాలనుకుంటున్నారు సర్" అన్నాడు గోవింద్.

"నేను ఇక్కడ వున్నట్లు తెలిసిపోయిందా?"

"అదేం లేదు. ఎప్పటి నుంచో మీరు ఎక్కడ వుంటున్నారు. ఒక్కసారయినా రామకృష్ణ గారిని చూడాలని వుంది అని అడుగుతున్నాడు".

"ఏం చూస్తాడు బుద్దా... చూసి అతను బాధ పడటం తప్ప ఏం చేయగలడు. పదిమంది దగ్గర నేను రామకృష్ణని చూసాను. నాకు కన్నీళ్లు వచ్చాయి. ఇదేగా ఆయన చెప్పేది. ఆ గోల్డెన్ డేస్ వెళ్లిపోయాయి. అయినా నా చిన్ననాటి మిత్రుల్లో చాలా మంది వెళ్లిపోయారు. ఇతని పేరు ఏంటి?"

"కృష్ణదాసు".

ఆయన కొంచెం సేపు కళ్లు మూసుకున్నాడు. అప్పుడు గుర్తొచ్చింది. మెల్లగా కళ్లు తెరిచాడు.

"గుర్తొచ్చాడు. అప్పట్లో రెండు సంవత్సరాలు కలిసి చదువుకున్నాం. అతను నన్ను ఎప్పుడూ క్రిటిసైజ్ చేసేవాడు. మీకు కులపిచ్చి వుందని. నాకు కులం వుంది. కులపిచ్చి లేదు అనేవాడ్ని. తర్వాత ఎప్పుడో కలిసాడు. వాళ్ల అబ్బాయికి ఇంజనీరింగ్‌లో సీట్ కావాలని. అప్పుడు నేను చెన్నై ఆఫీస్‌లో వున్నాను. ముందు స్లిప్ పంపించాడు. నేను నా ఛాంబర్ నుండి అతని దగ్గరకు వెళ్లాను. అలా శిలలా



"ఇక్కడ మా దగ్గర ఓ అటెండర్ వున్నాడు. అతను గ్రాడ్యుయేట్ అని నాకు పది సంవత్సరాల తర్వాత తెలిసింది. తమిళియన్.. ఉద్యోగం దొరకలేదు. ఏదోకటి చేయాలి. అఫ్‌కోర్స్ అది తెలిసాక ప్రమోషన్ యిచ్చాను. ఇక్కడ అన్ని ప్రాంతాల వారు వుంటారు దాసూ... చూడటానికే వచ్చావా? పని మీద వచ్చావా?"
"మా అబ్బాయికి ఇంజనీరింగ్ సీట్ ఇప్పించమని అడగటానికి వచ్చాను. మీరు సహకరించాలి".

చూస్తుండిపోయాడు. రా దాసూ! అని ఛాంబర్‌కి తీసుకు వెళ్లాను" అని గుర్తు చేసుకున్నాడు ఆ దృశ్యాన్ని.

"ఎలా వున్నావు దాసూ".

"మిమ్మల్ని కలవగలనని అనుకోలేదు".

"అదేంటి? మనం కలిసి చదువుకున్నాం".

"నేను ఇంకొందరు మిత్రుల్తోనూ కలిసి చదివాను. ఇప్పుడు వాళ్లంతా పెద్ద పొజిషన్స్‌లో వున్నారు. కానీ గుర్తు చేసినా దాసు ఎవరో గుర్తురాదు" అన్నాడు బాధగా.

"అందులో నా కులం వారు కూడా వున్నారు" అన్నాడు ముక్తాయింపుగా.

"మనుషులు రకరకాలుగా వుంటారు దాసూ... నువ్వింకా కులం నుండి బయట పడలేదా?"

"ఇంకా ఆ భావాలు బలపడ్డాయి. అప్పుడు చాలా నయం. ఇంత వివక్ష లేదు" అన్నాడు దాసు.

"ఇక్కడ మా దగ్గర ఓ అటెండర్ వున్నాడు. అతను గ్రాడ్యుయేట్ అని నాకు పది సంవత్సరాల తర్వాత తెలిసింది. తమిళియన్.. ఉద్యోగం దొరకలేదు. ఏదోకటి చేయాలి. అఫ్‌కోర్స్ అది తెలిసాక ప్రమోషన్ యిచ్చాను. ఇక్కడ అన్ని ప్రాంతాల వారు వుంటారు దాసూ... చూడటానికే వచ్చావా? పని మీద వచ్చావా?"

"మా అబ్బాయికి ఇంజనీరింగ్ సీట్ ఇప్పించమని అడగటానికి వచ్చాను. మీరు సహకరించాలి".

"మీరు అనకు... రామకృష్ణా అని ఇదివరకటిలా పిలువు. నాకో కాన్ఫరెన్స్ వుంది. నువ్వు ఎక్కడ దిగావో మా మేనేజర్‌కి చెప్పు. సాయంకాలం కారు పంపిస్తాను. ఇంటికి రా. మీ అబ్బాయి గురించి నువ్వు వర్రీ అవకు. టీ తాగివెళ్లు... సారీ... అర్జెంట్‌గా వెళ్లాల్సి వచ్చింది" అన్నాడు రామకృష్ణ.

"అలా జరిగింది. అప్పుడు కొంత ఎమౌంట్ కూడా యిచ్చాను. మళ్లీ ఇస్తాను. ఇది అప్పు మాత్రమే అన్నాడు. అలాంటివి పెట్టుకోవద్దు. ముందు మీ అబ్బాయిని బాగా చదువుకోమను అని చెప్పాను. తర్వాత దాసుని నేను కలవలేదు" అన్నాడాయన.

"ఓ సారి కలిసాడాయన. మీరు తన క్లాస్‌మేట్ అని చెప్పాక ఆయన్ని అప్పటి రోజుల గురించి అడిగి తెలుసుకున్నాను" అన్నాడు గోవింద్.

"ఫైనాన్షియల్‌గా బాగున్నాడా? యిబ్బందుల్లో వున్నాడా?"

"అలా అనిపించలేదు సర్".

"ఓ.కే.... ఓ సారి వచ్చి కలవమను" అన్నాడు.

తర్వాత అక్కడ నుంచి వెళ్తూ...

"మీరు మాట్లాడుకోండి". అన్నాడు రామకృష్ణ.

* * *

"నువ్వు ఎమ్.ఎ. లిటరేచర్ చేస్తావా?" దాదాపు అరిచినంత పని చేసింది.

"అంత పెద్దగా అరుస్తావెందుకు అఖిలా" అన్నాడు ఆదర్శ్.

ఆద్య అమ్మా నాన్నల కేసి చూస్తోంది.

"నాకు లిటరేచర్ అంటే అసహ్యం" అంది అఖిల.

"నాకు ఇష్టం" అంది ఆద్య.



“నీకు బుద్ధి వుండి మాట్లాడుతున్నావా? అసలు నిన్ను మెడిసిన్ చేయ మన్నాను. కాదన్నావు. ఇంజనీరింగ్ అంటే వద్దు అన్నావు. కనీసం ఐ.ఎ.యస్.కి ప్రిపేర్ అవుతావనుకున్నాను. ఇప్పుడు లిటరేచర్ అంటున్నావు”.

“అవన్నీ నువ్వు ఎందుకు చదవలేదు?” అంది ఆద్య.

అప్పుడు నిర్ఘాంతపోయింది.

“నువ్వు కూడా అదే సబ్జెక్ట్ తీసుకున్నావు. మధ్యలో మానేసావ్. మా అమ్మ వదిలిన దాన్ని నేను అందుకుంటున్నాను”.

“దీనికి పిచ్చి ముదిరింది ఆదర్శ్” అంది అఖిల.

“ఎవరి పిచ్చి వారికి ఆనందం అని వదిలేయవచ్చు. నువ్వు ఆ పని చేయవు”.

“మీరు మాట్లాడకుంటూ చూస్తున్నారేంటి... అంతా దాని ఇష్టమేనా?”

“ఆద్యా... నువ్వు ఎం.బి.ఎ. చేస్తే బాగుంటుంది. మీ అమ్మ నీ మంచి కోసం, నీ భవిష్యత్తు కోసమేగా చెప్పేది. ఈ మధ్య మీరు ప్రతి చిన్న విషయానికి వాదించుకుంటున్నారు. నాకు అది ఇష్టంగా వుండటం లేదు” అన్నాడు ఆదర్శ్.

“నాన్నా... నేను అమ్మతో వాదించాలని అనుకోవటం లేదు. నా గురించి అమ్మ ఎక్కువగా శ్రద్ధ తీసుకుంటోంది. నేను ఎప్పుడు ఏం చేయాలో తనే డిసైడ్ చేస్తోంది. నేను ఇప్పుడు మేజర్‌ని. నేను చదువుకుంటున్నాను. నాకు కొన్ని అభిప్రాయాలున్నాయి. నా భవిష్యత్తు గురించి నా ప్లాన్స్ నాకున్నాయి. అది గుర్తించమంటున్నాను”.

**“నాకు ఈ రోజో, రేపో పెళ్లి చేస్తారు. ఆ తర్వాత నేను నా అత్తగారింటికి వెళ్లి పోతాను. సో... ఇక్కడ నేను కొన్ని రోజులు మాత్రం వుంటాను. ఇక్కడ వున్నన్ని రోజులు నన్ను సంతోషంగా, ప్రశాంతంగా వుండ నియ్యండి. నేను మ్యారేజ్ చేసుకున్నాకా నాదంటూ ప్రపంచం వుంటుంది. అప్పుడు మీరు నన్ను చూడటానికి వస్తారు. అంటే మీరు కూడా గెస్ట్‌ల లిస్ట్‌లోకి వస్తారు”**

“అంటే ఏం చేస్తావు. ఈ రోజున రీడింగ్ హేబిట్ తగ్గిపోయింది. నువ్వు మహా రచయిత్రివి అవ్వాలనుకుంటున్నావేమో!” ఉక్రోషంగా అంది అఖిల.

“నేను మామూలు రచయిత్రిని కూడా కావాలనుకోవటం లేదు. అలాంటి ప్రమాదం రాదని మమ్మీకి చెప్పండి నాన్నా”.

“ఇదీ దాని ధోరణి. నేను ఏం చెప్పినా అది నెగెటివ్‌గా తీసుకుంటోంది”.

“నాన్నా... ఇంకెంత కాలం నేను మీదగ్గర వుంటాను?” అంది ఆద్య సీరియస్‌గా.

“అంటే....” అర్థం కాక అడిగాడు.

“నాకు ఈ రోజో, రేపో పెళ్లి చేస్తారు. ఆ తర్వాత నేను నా అత్తగారింటికి వెళ్లిపోతాను. సో... ఇక్కడ నేను కొన్ని రోజులు మాత్రం వుంటాను. ఇక్కడ వున్నన్ని రోజులు నన్ను సంతోషంగా, ప్రశాంతంగా వుండనియ్యండి. నేను మ్యారేజ్ చేసుకున్నాకా నాదంటూ ప్రపంచం వుంటుంది. అప్పుడు మీరు నన్ను చూడటానికి వస్తారు. అంటే మీరు కూడా గెస్ట్‌ల లిస్ట్‌లోకి వస్తారు”.

ఇద్దరూ హతాశులై ఆద్యని చూస్తున్నారు.

“అమ్మ ధోరణి ఇలానే వుంటే రేపు పెళ్లయ్యాక కూడా నామీదా, మాకు పుట్టబోయే పిల్లల మీద కూడా పెత్తనం చేయాలనుకుంటున్నట్లు వుంది. అందు లోనూ ఒక్కదానితో ఆపేసారు. అందుకు కారణం నాకు తెలియదు. నేనూ అడుగుతున్నాను. నాకు ఓ చెల్లెలినో, తమ్ముడినో మీరు ఎందుకు ఇవ్వలేదు?”

ఇద్దరు ఒకరి ముఖాలు ఇంకొరు చూసుకున్నారు.

**(సశేషం)**

**జాగృతి ఆధ్వర్యంలో ఏపీయూఎస్ వ్యవస్థాపక కార్యదర్శి**

## స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక

## ‘నవలల పోటీ- 2023’కి రచయితలను ఆహ్వానిస్తున్నాం..



**1936-2022**

**ప్రథమ బహుమతి రూ. 25,000**

**ద్వితీయ బహుమతి రూ. 20,000**

**సూచనలు :**

➜ ఇతివృత్తం భారతీయ జీవన విధానానికి, విలువలకు అద్దం పట్టేదిగా ఉండాలి. సామాజిక, చారిత్రక, పౌరాణిక అంశాలను స్వీకరించవచ్చు. వ్యావహారిక భాషలోనే ఉండాలి. ➜ నవల 125-150 (ఎ4, 15 పాయింట్) పేజీలకు మించరాదు. ➜ సాధ్యమైనంతవరకు డీటీపీ చేయించిన రచనలనే, పోస్ట్ ద్వారా మాత్రమే పంపాలి. వ్రాతప్రతులైతే చక్కని దస్తూరితో, ఒక్క కొట్టివేత కూడా ఉండరాదు. ➜ నవల మీద రచయిత పేరు ఉండరాదు. విడిగా హామీపత్రంలో పూర్తి చిరునామా మొబైల్ నంబర్‌తో సహా రాయాలి. రచన తమ సొంతమని, అనువాదం, అనుసరణ కాదని, ఎక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదని హామీ ఇవ్వాలి. ➜ ఎంపిక విషయంలో తుది నిర్ణయం న్యాయనిర్ణేతలదే. ఉత్తర, ప్రత్యుత్తరాలకు తావు లేదు.

➜ నవలలు పంపవలసిన చిరునామా : **3-4-228/4/1, జాగృతిభవన్, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్- 500027.**

**నవలలు మాకు చేరవలసిన ఆఖరి తేదీ : 05 జూలై, 2023**



# నిరంకుశత్వం కాదు,

#### అ. పీఠిక

భిన్నత్వంలో ఏకత్వం అనే సిద్ధాంతంతో భారత రాజ్యాంగం నిర్మించుకున్నాం. భారతదేశం వివిధ మతాలకు, ఆచార వ్యవహారాలకు, సమూహాలకు, భాషలకు, సిద్ధాంతాలకు నెలవై కొన్ని వేల సంవత్సరాలుగా విరాజిల్లుతోంది. సాంకేతిక పురోగతి, సామాజిక అభివృద్ధి, అభ్యుదయం వల్ల వివిధ ప్రాంతాల, భాషల, మతాల, సమూహాల, విశ్వాసాలకు చెందిన ప్రజలు వారివారి పరిధులలోనే ఒకే సమాజంలో సమైక్యభావనతో నివసిస్తూ దేశ పురోగతిని సాధిస్తున్నారు. అనాదికాలం నుండి వివిధ మతాలు/ వర్గాలు/ సంఘాలు వారి వారి సాంస్కృతిక పరంపరను అనుసరించి నియమనిబంధనలను నిర్దేశించుకున్నారు. అటువంటి నియమ నిబంధనలను భారత రాజ్యాంగం చట్టంగా పరిగణించి, ధృవీకరించింది. కాలానుగుణంగా దేశ పురోగతికి తోడ్పడే సామాజిక మార్పులను హర్షిస్తూ ముందుకు సాగవలసిన బాధ్యత ప్రతి భారత పౌరుడికి ఉంది. ఏక రూప పౌర నియమావళి లేదా యూనిఫామ్ సివిల్ కోడ్ లేదా ఉమ్మడి పౌరస్మృతి అనేది దేశాన్ని అభ్యుదయ మార్గంలో నడిపిస్తూ ప్రపంచ దేశాలకు దీటుగా భారతదేశాన్ని నిలిపే ప్రణాళిక.

వివాహం, విడాకులు, దత్తత, వారసత్వం వంటి విషయాలకు సంబంధించి వివిధ చట్టాలు వాడుకలో ఉన్నాయి. ఉదాహరణకి హిందువుల వివాహ చట్టం, ముస్లిం, క్రైస్తవుల వివాహ చట్టం భిన్నంగా ఉండడం గమనిస్తున్నాం. భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించాలి అనే అంశం వైపు అడుగులేస్తే పౌర సమానత్వం అనే కీలక లక్ష్యాన్ని సాధించాలి. పౌర సమానత్వాన్ని పరిపూర్ణంగా నెలకొల్పాలి అంటే ప్రాంతీయ భాష, లింగ, మత వివక్షను నిర్మూలించి అందరిని ఏకతాటిపై నిలపాలి.

భారత రాజ్యాంగం భారతదేశ పౌరులందరికి సమంగా ప్రాథమిక హక్కులను అందించింది. వివిధ పర్సనల్ లా లేదా వ్యక్తిగత చట్టాలు అమలులో ఉన్నంత కాలం ఆ సమాజం/ సంఘంలోని పౌరుడు వాటి పరిధికి లోబడి జీవించాలి. రకరకాల చట్టాలతో నియంత్రించే వివిధ విషయాలను న్యాయస్థానం కూడా వివిధ కోణాల్లో పరిశీలించవలసి వస్తుంది. సామాజిక సమానత్వాన్ని స్థాపించడంలో ఒకే విషయాన్ని భిన్నమైన పర్సనల్ చట్టాల పరిధిలో పరిశీలించడం వలన సమన్యాయం అందించడం కష్టం. సర్వ మత, వర్గ, ప్రాంత, భాషా సమ్మేళనాన్ని స్వాగతిస్తూ రూపొందించిన మహోత్కృష్టమైన ప్రయత్నమే ఏక రూప పౌర నియమావళి.

భారత లా కమిషన్ సంవత్సరాలుగా ప్రభుత్వానికి అనేక నివేదికలను సమర్పించింది. ఉమ్మడి పౌరస్మృతి సాధ్యాసాధ్యాలు, వాంఛనీయత లను పరిశీలించింది. ఈ నివేదికలు యూనిఫాం సివిల్ కోడ్ అమలుపై సిఫార్సులను అందించాయి. కానీ కచ్చితమైన శాసన చర్యలు ఇంకా తీసుకోనలేదు. అందులో భాగంగానే 22వ లా కమిషన్ జూన్ 14, 2023న మరొకసారి నివేదిక కోసం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. అందుకే యూసీసీ మరొకసారి చర్చా వేదికలకు ముఖ్యాంశమైంది. ఈ వ్యాసం ద్వారా యూనిఫామ్ సివిల్ కోడ్ అంటే ఏమిటి? చారిత్రక నేపథ్యం, విశిష్టత, ప్రయోజనాలు ఏంటో చూద్దాం.




**దశిక వెంకట రఘువంశీ**

LLM (Cardiff)., PGDTIL.

Advocate on Record Supreme Court of India


#### ఆ. చారిత్రక నేపథ్యం

భారతదేశంలో యూనిఫాం సివిల్ కోడ్ లేదా ఏకరూప పౌర నియమావళిని అమలు చేయాలనే ఆలోచనకు సుదీర్ఘ చరిత్ర ఉంది. ఇంతవరకు సాగిన యూనిఫాం సివిల్ కోడ్ ప్రస్థానం లోని మైలు రాళ్లను సంక్షిప్తంగా చూద్దాం.

**స్వాతంత్ర్యానికి పూర్వం:**

భారతదేశం బ్రిటిష్ పాలనలో, హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు ఇతర మతస్థులు సహా వివిధ వర్గాలకు మత గ్రంథాల ఆధారంగా వ్యక్తిగత చట్టాలు అమలయ్యేవి. వివాహం, విడాకులు, వారసత్వం, దత్తత వంటి విషయాలను అవే నియంత్రించాయి. బ్రిటిష్ పరిపాలన మతపరమైన సాంస్కృతిక వైవిధ్యాన్ని గౌరవించడానికి ఈ ప్రత్యేక న్యాయవ్యవస్థలను నిర్వహించిందని కొందరు వాదిస్తే, మరికొందరు ఇది అసమానతలు, వివక్షను కూడా శాశ్వతం చేసిందని వాదించారు.

**స్వాతంత్ర్యానంతరం**

**భారత రాజ్యాంగం (1950):** లౌకికవాదాన్ని (Secularism) ప్రోత్సహించడం, పౌరులకు ప్రాథమిక హక్కులను (Fundamental Rights) అందించడమే రాజ్యాంగం లక్ష్యంగా పెట్టుకుంది. ఆర్టికల్ 44, రాష్ట్ర విధాన ఆదేశిక సూత్రాలలో (Directive Principles of State Policy)



ఏకరూప పౌర నియమావళి (యూనిఫాం సివిల్ కోడ్) లక్ష్యాన్ని ప్రస్తావించింది. భారతదేశం తన పౌరులకు యూనిఫాం సివిల్ కోడ్‌ను అందించేందుకు ప్రయత్నిస్తుందని పేర్కొంది.

**గోవా సివిల్ కోడ్ (1961):** 1961 వరకు పోర్చుగీస్ కాలనీగా ఉన్న గోవా రాష్ట్రం, పోర్చుగీస్ సివిల్ చట్టంతో ప్రభావితమైన యూనిఫాం సివిల్ కోడ్‌ను ఇప్పటికీ ఆచరిస్తున్నది. మతంతో సంబంధం లేకుండా నివాసితులందరికీ వర్తిస్తుంది.

**షాబానో కేసు (1985):** ఆ అంశంలో షాబానో కేసు ఒక మైలురాయి. ఇది యూనిఫాం సివిల్ కోడ్ అవసరాన్ని దేశం దృష్టికి తీసుకువచ్చింది. ముస్లిం పర్సనల్ చట్టం మహిళలు వారి భర్తల నుండి విడాకులు పొందిన తరువాత, భరణం (Maintenance) పొందడానికి అనర్హులు. కానీ యూనిఫామ్ సివిల్ కోడ్ మేరకు లౌకిక (Secular) చట్టం అమలు లోకి వచ్చిన తరువాత వారు కూడా భరణానికి అర్హులవుతారని చెప్పడం గమనార్హం. ఈ నిర్ణయం తీవ్ర చర్చకు దారితీసింది. రాజకీయ మతపరమైన విభజనకు దారితీసింది.

**వివిధ లా కమిషన్ నివేదికలు:** తాజాగా 22వ లా కమిషన్ యూనిఫామ్ సివిల్ కోడ్ పైన అధ్యయనానికి పలు అంశాల పరిశీలన కోసం 07.10.2016 న ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. తరవాత 19.03.2018, 27.03.2018, 01.04.2018 తేదీలలో పలుమార్లు అభిప్రాయ సేకరణ చేపట్టింది. ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చినప్పటికీ మూడు సంవత్సరాలకు కాలదోషం పట్టడంతో కమిషన్ మరొకసారి అభిప్రాయ సేకరణ కోసం 14.06.2023న నోటీసు జారీ చేసింది.

**ఇ. అసలు సివిల్ కోడ్ అంటే ఏమిటి?**

భారత రాజ్యాంగం ఆర్టికల్ 44 లో "సివిల్ కోడ్" అన్న పదానికి నిర్వచనం లేదు. భారత రాజ్యాంగ రూపకర్తలలో ఒకరు అల్లాడి కృష్ణస్వామి అయ్యర్ అభిప్రాయంలో 'సివిల్' అన్న పదానికి చాలా అర్థాలు చెప్పుకోవచ్చు. కానీ సందర్భానుసారం 'సివిల్ లా' అనగా 'చట్టం' (ప్రామాణిక (Substantive) లేదా విధానపరమైన (Procedural) చట్టం) పౌరుల వ్యక్తిగత హక్కులకు సంబంధించిన చట్టాల నుంచి, అంతర్జాతీయ చట్టం లేదా రెవెన్యూ చట్టం క్రిమినల్ చట్టం (ఇందులో ఒక పక్షం స్టేట్ పార్టీ అయ్యి ఉండాలి) నుండి వేరు చేయాలి. సివిల్



చట్టం ఒప్పందాలు, ఆస్తి, వివాహం, వారసత్వం వంటి వ్యక్తిగత సంబంధాల అంశాలకు సంబంధించినది.

# నిర్మాణాత్మకం



**ఈ. యూనిఫాం సివిల్ కోడ్ లక్ష్యం:**

ఇంత చర్చ జరుగుతున్న ఈ కోడ్ లక్ష్యం ఏకీకృత వ్యక్తి పరమైన చట్టాల స్థానంలో ఒకే దేశం ఒకే చట్టం భావనతో జాతీయ సమైక్యతను తీసుకు రావడం. రాజ్యాంగకర్తల ముఖ్య ఉద్దేశం కూడా పురాతన నాగరికతకు చెందిన భారతదేశంలో మతానికీ వ్యక్తిగత చట్టాలకూ ముడిపెట్టాల్సిన అవసరం లేదు. భారత రాజ్యాంగం ఆర్టికల్ 25 మనస్సాక్షి, మత స్వేచ్ఛలను కాపాడుతోంది. ఇది ముస్లిం దేశాలు టర్కీ, ఈజిప్ట్ మాదిరిగా కాకుండా మతం, వ్యక్తిగత చట్టాలు, సాంఘిక సంబంధాల నుంచి వివాహం, వారసత్వం, దత్తత సంబంధిత చట్టాలను వేరు చేయాల్సి ఉంది. యూనిఫామ్ సివిల్ కోడ్ ఉద్దేశం ఇదే. ఇంతవరకే. మత స్వేచ్ఛకు భంగం కలిగించడం కాదు.

**ఉ. అమలులో ప్రయోజనాలు**

యూనిఫాం సివిల్ కోడ్ (UCC)ని అమలు చేయడం అనేక సంభావ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఆ కోడ్ ప్రతిపాదకులు తరచుగా ఉదహరించే కొన్ని ముఖ్య ప్రయోజనాలు:

**సమానత్వం, వివక్ష రహితం:** మతం లేదా సాంస్కృతిక నేపథ్యాలతో సంబంధం లేకుండా పౌరుల మధ్య సమానత్వం, వివక్ష లేకుండా చూడడం. వ్యక్తిగత చట్టాలతో వచ్చే అసమానతలను, వ్యత్యాసాలను తొలగిస్తూ, వ్యక్తులందరినీ సమానంగా చూసే ఏకీకృత చట్టాల రూపకల్పనకు ప్రోత్సహిస్తుంది.



**లింగ సమానత్వం (Gender Equality) మహిళల హక్కులు:** మతం ఆధారంగా వ్యక్తిగత చట్టాలు తరచుగా వివాహం, విడాకులు, వారసత్వం ఇతర వ్యక్తిగత విషయాలలో మహిళల పట్ల వివక్ష చూపే నిబంధనలను కలిగి ఉంటాయి. లింగ న్యాయం (Gender Justice), సాధికారతను (Empowerment) నిర్ధారించడం ద్వారా అన్ని వర్గాల మహిళలకు సమాన హక్కులు, రక్షణలను అందించడం ద్వారా ఈ అసమానతలను పరిష్కరించ డానికి యూనిఫాం సివిల్ కోడ్ సహాయపడుతుంది.

**లౌకికవాదం** (Secularism), **జాతీయ సమైక్యత** (National Integrity): ఆ రెండు అంశాలలోని సూత్రాలను ఇది ప్రోత్సహిస్తుంది. ఏ రాష్ట్రమైన, దేశమైన నిర్దిష్ట మతానికి అనుకూలం కాదని నిర్ధారిస్తుంది. పౌరులందరికీ వారి మతపర మైన సంబంధాలతో నిమిత్తం లేకుండా వర్తించే సాధారణ చట్టాలను తేవడం ద్వారా జాతీయ సమైక్యతా భావాన్ని పెంపొందించడంలో సహాయ పడుతుంది.

**చట్టపరమైన కచ్చితత్వం** (Certainty), **సరళత** (Clarity): మతం ఆధారంగా బహుళ వ్యక్తిగత చట్టాల సంక్లిష్టతను యూనిఫామ్ సివిల్ కోడ్ తొలగించి, చట్టాలలో ఒక సరళతను తీసుకు వస్తుంది. ఇది దేశ పౌరులకు మరింత చట్టపరమైన కచ్చితత్వం, స్పష్టతను ఇస్తుంది. హక్కులను అర్థం చేసుకోవడం, అమలు, వినియోగించడంలో వారికి మార్గదర్శకంగా ఉంటుంది.

**వ్యక్తిగత హక్కుల పరిరక్షణ:** ఇది వ్యక్తుల ప్రాథమిక హక్కులు (Fundamental rights), స్వేచ్ఛలను రక్షించగలదు. రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధంగా ఉండే వ్యక్తిగత చట్టాల సంకెళ్లలో వారు బందీలు కాకుండా చూసుకోవచ్చు. వ్యక్తిగత విషయాలలో వ్యక్తిగత స్వయంప్రతిపత్తి, ఎంపిక స్వేచ్ఛను సమర్థిస్తుంది.

**సాంఘిక ఆచారాల సమన్వయం:** యూనిఫామ్ సివిల్ కోడ్‌ని అనుసరించి ఉమ్మడి చట్టాలకు రూపకల్పన చేస్తే, వివిధ మత వర్గాల మధ్య సామాజిక పద్ధతులు, ఆచారాలు, సంప్రదాయాలలో సమన్వయాన్ని ప్రోత్సహిస్తుంది. ఇది సాధారణ నిబంధనలు, విలువలను ప్రోత్సహించడం ద్వారా జాతీయ సమగ్రత, సామాజిక ఐక్యతా భావాన్ని పెంపొందించడంలో సహాయపడుతుంది.

ఈ ప్రయోజనాల గురించి తరచుగా చర్చిస్తున్నా అవన్నీ భిన్నభిన్న వివరణలకు లోబడి ఉన్నాయని గమనించాలి. వ్యక్తిగత హక్కులు, సాంస్కృతిక వైవిధ్యం, రాజ్యాంగ సూత్రాల మధ్య సమతుల్యతను పాటిస్తూనే, యూనిఫామ్ సివిల్ కోడ్‌ని అమలు చేయడంలో సమాజంలోని విభిన్న దృక్కోణాలు, సున్నితత్వాలను జాగ్రత్తగా పరిశీలించాలి.

**ఊ. అమలులో సవాళ్లు**

యూనిఫాం సివిల్ కోడ్ అమలు దాని విభిన్న సామాజిక, సాంస్కృతిక, మతపరమైన వాతావరణం కారణంగా అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నది. అవి:

**మత, సాంస్కృతిక సున్నితత్వాలు:** భారతదేశం విభిన్న ఆచారాలు, సంప్రదాయాలు, నమ్మకాలతో కూడిన బహుళ-మత, బహుళ సాంస్కృతిక సమాజం. మత గ్రంథాలు, సంప్రదాయాలపై ఆధారపడిన వ్యక్తిగత చట్టాలు వివిధ వర్గాలకు లోతైన ప్రాముఖ్యం కలిగి ఉన్నాయి. యూనిఫాం సివిల్ కోడ్‌ని అమలు చేయడానికి సున్నితమైన, మతపరమైన మనోభావాలను సరైన మార్గంలో మలచడం వివిధ మత సమూహాల హక్కులు అభ్యాసాలు గౌరవించేలా చూసుకోవడం అవసరం.

**మత సమూహాల నుండి వ్యతిరేకత :** అనేక మతపరమైన వర్గాలు, సమూహాలు యూనిఫామ్ సివిల్ కోడ్ ఆలోచనను వ్యతిరేకిస్తు న్నాయి, ఇది వారి మతపరమైన స్వయం ప్రతిపత్తి, సాంస్కృతిక గుర్తింపునకు ముప్పుగా భావిస్తున్నాయి. వ్యక్తిగత చట్టాలు తమ విశ్వాసంలో ముఖ్యమైన అంశం, వాటిని సంరక్షించాలని వారు వాదించారు.

**ముస్లింల వాదనలు:**

(i) ఇది షరియాకు వ్యతిరేకం.

(ii) ముస్లిం గుర్తింపునకు అడ్డుగా నిలుస్తోంది.

(iii) కామన్ కోడ్ కావాల్సినప్పటికీ, ముస్లింలు దానిని స్వీకరించడానికి ముందుకు వచ్చేవరకు తీసుకురాకూడదు.

(iv) షరియా లేదా ముస్లింల వ్యక్తిగత చట్టం అనేది దేవుడు నియమించిన ఖురాన్ మీద స్థిరపడినది, మార్పులేనిది.

(v) ఉమ్మడి సివిల్ కోడ్ రూపొందించినప్పటికీ, ముస్లింలు దాని నిబంధనలను ఆమోదించడం ఇచ్ఛికం.

**చట్టపరమైన సంక్లిష్టత, రాజ్యాంగ పరిగణనలు:** భారతదేశ న్యాయవ్యవస్థ అనేది సాధారణ పౌర చట్టాలతో సహజీవనం చేసే మతం ఆధారంగా వ్యక్తిగత చట్టాలతో సహా వివిధ చట్టాల సమ్మేళనం. ఈ విభిన్న చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌ను పునరుద్ధ రించడం, సమగ్రమైన, చట్టబద్ధమైన యూనిఫాం సివిల్ కోడ్‌ను రూపొందించడం సంక్లిష్టంగా ఉంటుంది. ప్రాథమిక హక్కుల పరిరక్షణ, లౌకిక వాదం, మతాన్ని ఆచరించే హక్కు వంటి రాజ్యాంగ పరిగణనలు కూడా సమతుల్యం కావాలి.

**ఏకాభిప్రాయం, రాజకీయ సంకల్పం లేకపోవడం:** యూనిఫాం సివిల్ కోడ్ అమలుకు రాజకీయ పార్టీలు, మత ఛాందసవాదులు, మత నాయకుల మధ్య ఏకాభిప్రాయం అవసరం. అయితే, భిన్నమైన సిద్ధాంతాలు, రాజకీయ ప్రయోజనాలు ఎన్నికల చిక్కులపై ఆందోళనల కారణంగా ఏకాభిప్రాయాన్ని సాధించడం సవాలుగా మారింది. ఏకీకృత రాజకీయ సంకల్పం లేకపోవడంతో ఈ దేశం గణనీయమైన పురోగతిని కోల్పోయింది.

**ఆచరణాత్మకంగా అమలుపరచడం** (Practical implementation): భారతదేశం వంటి విస్తార మైన, భిన్నత్వం కలిగిన దేశంలో ఆచరణాత్మక స్థాయిలో యూనిఫాం సివిల్ కోడ్ అమలు చేయడంలో అనేక సవాళ్లను ఎదుర్కోవలసి వస్తుంది. వ్యక్తిగత చట్టాలను స్వీకరించడం, సమ్మతిని నిర్ధారించడం, సంభావ్య ప్రతిఘటన లేదా సమ్మతిని పరిష్కరించడానికి గణనీయమైన పరిపాలనా ప్రయత్నాలు, వనరులు అవసరం కావచ్చు.

**లింగ, సామాజిక సమానత్వ ఆందోళనలు** (Gender and Social Equity Concerns): యూనిఫాం సివిల్ కోడ్ మద్దతుదారులు ఇది లింగ సమానత్వాన్ని ప్రోత్సహిస్తుందని, మతపరమైన వ్యక్తిగత చట్టాలలోని వివక్షాపూరిత పద్ధతులను తొలగిస్తుందని వాదించారు. ఏదేమైనప్పటికీ, యూనిఫాం సివిల్ కోడ్‌ను అమలు చేయడం వలన లింగ అసమానతలను శాశ్వతం చేసే లోతుగా వేళ్లూనుకున్న సామాజిక సాంస్కృతిక నిబంధనలను స్వయంచాలకంగా పరిష్కరించ లేకపోవచ్చు.

**ఋ. మైనారిటీలపై నిరంకుశత్వమా?**

అభివృద్ధి చెందిన ముస్లిం దేశాలలో ఎక్కడా అల్పసంఖ్యాక వర్గ వ్యక్తిగత చట్టాలు పౌరస్మృతి అమలును నిరోధించే విధంగా లేవు. టర్కీ, సౌదీ అరేబియా, ఈజిప్ట్, మలేషియా ఇందుకు ఉదాహరణ. సంఘాన్ని ఏకీకృతం చెయ్యాలను కున్నపుడు, మొత్తం సమాజ ప్రయోజనాన్ని దృష్టిలో

పెట్టుకోవాలి తప్ప, కొంతమంది మతపరమైన ప్రయోజనాలను కాదు. కాబట్టి ఇలాంటి చర్య మైనారిటీలపై మెజారిటీల నిరంకుశత్వంగా ప్రచారం చేయడం సరైనది కాదు. విచిత్రం ఏమిటంటే యూరోప్ వంటి అభివృద్ధి చెందిన దేశాలను పరిశీలిస్తే ఈ మైనారిటీలే ఆ దేశాల సివిల్ కోడ్‌కి లోబడే ఉంటారు. భారతదేశంలో మాత్రమే యూనిఫామ్ సివిల్ కోడ్ ఆచరణ వారికి అడ్డంకిగా కనిపిస్తున్నది. దానికి కారణం మైనారిటీలు ఈ ప్రయత్నంలో నిరంకుశత్వాన్ని చూడడమే.

యూనిఫామ్ సివిల్ కోడ్ ద్వారా వ్యక్తిగత చట్టం నుండి, సామాజిక సంబంధాలు అని పిలుచుకునే వాటి నుండి లేదా వారసత్వానికి సంబంధించి వ్యక్తిగత హక్కుల నుండి మతాన్ని మన రాజ్యాంగ కర్తలు విడదీయదలిచారు, పైన చెప్పిన విషయాలకు మతానికి ఏంటి సంబంధం? యూనిఫామ్ సివిల్ కోడ్ పరిశోధకులు భారత భూభాగమంతా సివిల్ కోడ్ అవసరం లేదని చెప్పడానికి బలమైన కారణాలేవి చూపలేదు. మతానికీ, వ్యక్తిగత జీవితానికీ సంబంధించిన విషయాలను వారి పరిమితమైన ప్రపంచాలకు పరిమితం చేస్తూ మిగిలిన జీవితాన్ని నియంత్రించాలి. ఏకీకృత చట్టాలు లేదా సవరణల ద్వారా వీలైనంత త్వరగా, బలమైన ఏకీకృత దేశంగా భారత్ అభివృద్ధి చెందవచ్చు.


రాజ్యాంగ పరిషత్ చర్చల సమయంలో కేఎం మున్షి మాట్లాడుతూ, మన ప్రధాన సమస్య ఏమిటంటే జాతీయ ఐక్యతను పెంపొందించడం. మనం దేశంలో ఐక్యత ఉందనుకుంటాం కానీ, దాని కోసం అనేక పరిధులను దాటాల్సి వస్తుంది. అందులో ముఖ్యమైనది ఏకీకరణ. ఇది మన జీవితాల్లో చాలా ముఖ్యమైనది. ఇది లౌకిక పరమైన విషయాలకే పరిమితం చెయ్యకుండా ఉంటే తొందర్లోనే మనం కేవలం ఒక దేశంగా మాత్రమే కాదు, ఏకీకృత దేశంగా ఎదిగామని చెప్పే స్థాయికి చేరగలం. అందువలన యూనిఫామ్ సివిల్ కోడ్ మైనారిటీలపై నిరంకుశ వైఖరి కోసం చేస్తున్న ప్రయత్నం కాదని అన్నారు. అలాగే.. తాహిర్ ముహమ్మద్ తన 'ముస్లిం పర్సనల్ లా' పుస్తకంలో భారతదేశ పౌరులందరికీ ఏకరూప సివిల్ కోడ్ అవసరాన్ని గుర్తుచేశారు.

**తుది పలుకులు**

ఉమ్మడి పౌరస్మృతికి పునాది వంటి ఆర్టికల్ 44 ఇంతకాలం అమలుకు సుదూరంగా ఉండియిందని విచారం వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు, దానిని అమలు చేయడానికి త్వరగా చట్టం చేయాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. వివాహ చట్టాన్ని పూర్తిగా సంస్కరించి, మతం, కులంతో సంబంధం లేకుండా అందరికీ ఒకే విధమైన చట్టాన్ని వర్తింపజేయాల్సిన సమయం ఆసన్నమైందని మరో కేసులో కోర్టు పేర్కొంది. ఆశ్చర్యంగా యూనిఫాం సివిల్ కోడ్ క్రోడీకరణకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదు. సిద్ధాంతాల ఆధారంగా వైరుధ్యాన్ని తొలగించడం ద్వారా ఉమ్మడి పౌరస్మృతి జాతీయ సమైక్యతకు సహాయపడుతుందని కోర్టులు పలుమార్లు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశాయి.

చివరిగా యూనిఫామ్ సివిల్ కోడ్ అవసరమా? కాదా? అన్న ప్రశ్నకి ప్రస్తుత కాలమానం ప్రకారం నిర్ణయం తీసుకోవడం మంచిది. ప్రస్తుత కాలంలో అనేక విషయాలను పరిశీలించిన మీదట వ్యక్తిగత చట్టాలు అసమానతకు మొగ్గుచూపుతాయనే వాదనతో ఏకీభవించక తప్పదు. ప్రస్తుతం మనకు మానవ సంబంధాల కోసం ఏకీకృత చట్టాలు ఎన్నో ఉన్నాయి, అలాగే ఏకీకృత నేర నియమావళి (Criminal Procedure Code), ఏకీకృత ఆస్తి బదిలీ (Transfer of Property) చట్టాలూ ఎన్నో ఉన్నపుడు, ఏకీకృత వారసత్వ, వివాహ, దత్తత చట్టాలు ఎందుకు ఉండకూడదని ప్రశ్నించుకోవలసిన అవసరం ఉంది. యూనిఫామ్ సివిల్ కోడ్ అంటే జాతి సమగ్రత, జాతి ఐక్యత. అన్నిటిలోనూ ఐకమత్యం కావాలననపుడు చట్టాలలో ఎందుకు ఉండకూడదని ప్రశ్నించుకోవాలి. బ్రిటిష్ కాలం నుంచి మతం ఆధారంగా ఎన్నో ఏకీకృత చట్టాలను అమలుచేయడం జరిగింది. అలాగని ఏ ఒక్క చట్టం ఏ ఒక్క వర్గాన్ని మినహాయించలేదు. చట్టం ముందు అంతా సమానమని చెప్పింది. అలాంటప్పుడు ఏకీకృత వారసత్వ, వివాహ, దత్తత చట్టాలకు ఎందుకు వ్యతిరేకిస్తున్నారు? మత ఛాందసవాదులు వారు మతాన్ని ప్రచారం చెయ్యడంలో దేశం వేరు, మతం వేరు అని చెబుతూనే, దేశం అన్నిటి కంటే గొప్పదని ప్రచారం చేసిన రోజు మెజారిటీ, మైనారిటీ అన్న అంశాలకు తావుండదు. ★






**మూలం:**

1. DD బసు: 'కామెంటరీ ఆన్ ది కాన్స్టిట్యూషన్ ఆఫ్ ఇండియా' 9వ ప్రచురణ, 7 వ భాగం.

2. తాహిర్ మహమూద్: 'యూనిఫాం సివిల్ కోడ్: ది ఇండియన్ ఎక్స్పీరియన్స్'.

3. డాక్టర్ రమేష్ చంద్ర: 'యూనిఫాం సివిల్ కోడ్ ఇన్ ఇండియా: ఇష్యూస్ అండ్ ఛాలెంజెస్'

4. డాక్టర్ జై సింగ్ యాదవ్, డాక్టర్ T. S. రాజ్‌పుత్:'యూనిఫాం సివిల్ కోడ్: ప్రాస్పెక్ట్స్ అండ్ ఛాలెంజెస్'

5. ఇంద్రజీత్ పర్మార్: 'యూనిఫాం సివిల్ కోడ్: ఆన్ అప్రైసల్ ఆఫ్ ది లీగల్ పొజిషన్'

6. తాహిర్ మహమూద్ (సం): 'ఆధునిక భారతదేశంలో మతం, చట్టం మరియు న్యాయవ్యవస్థ'




'అడవిలో క్రూర జంతువులు తక్కువగా, సాధుజంతువులు ఎక్కువగా ఉంటేనే అది చాలా కాలం ఉంటుంది. అలా కాకుండా క్రూర జంతువులు ఎక్కువై సాధుజంతువులు తక్కువైతే.. ఇక ఆ అడవిలో ఏ జంతువూ బ్రతకలేదు.' ఇది ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఓ వార్త. నిజమే ఉమ్మడి పౌరస్మృతి అమలు కాకపోవడం వల్ల భారతీయతకు పెనుముప్పు వచ్చిపడింది. ఆ ప్రమాదాన్ని పైకి కనిపించకుండా 'గంగా జమున తెహజీబ్' పేరుతో మనల్ని మభ్యపెడుతూ వచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఉమ్మడి పౌరస్మృతి గురించి ఒక అడుగు ముందుకు వేసేసరికి మరోసారి ఈ చర్చ మన ముందుకొచ్చింది. భారతీయ ధర్మానికి మూల స్తంభాలైన ఉపనిషత్తులు ఈశ్వరుడు అన్ని జీవులలో ఉన్నాడని చెప్తే.. అన్ని మతాలు సమానమని హిందూధర్మంలోని మూల గ్రంథాలు చెప్పాయని మనల్ని కన్ఫ్యూజ్ చేస్తూ వచ్చారు. అన్ని మతాలు సమానమే అని మనం ప్రబోధిస్తున్న మాట వాస్తవమే కావచ్చు మరి అన్ని మతాలు సమానంగా ఉన్న భారతదేశంలో అందరికీ సమానమైన పౌరస్మృతి ఎందుకు ఉండదు? అని మనం ప్రశ్నిస్తే మతతత్వవాదులమైపోతాం!

# ఆలస్యమైతే భారతీయ

మైనార్టీ మతాలను తలపై మోస్తూ హిందూ ధర్మాన్ని తిట్టడం సెక్యులరిజం అని ప్రబోధించే ఒక వ్యవస్థకు అలవాటైన కొందరికి ఉమ్మడి పౌరస్మృతి అనేది మతతత్వంగానే కనబడుతుంది. హిందూ దేశంలో హిందువులను పరాయి వాళ్లుగా చిత్రీకరించే దారుణ కృత్యమే సెక్యులరిజం. ఈ సిద్ధాంతం ముసుగులో భారతదేశంలో జరుగుతున్న మైనార్టీ ఓట్ల కక్కుర్తి రాజకీయ వ్యవస్థను కాపాడే రక్షణ కవచంగా మారిపోయింది. దానివల్లే భారతీయతకు పెద్ద ప్రమాదం పొంచి ఉంది. నిజానికి ఏ దేశమైనా స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే ఆ దేశ సంస్కృతీ సంప్రదాయాలకు పెద్దపీట వేస్తుంది. కానీ భారత దేశంలో విచిత్రంగా వలసవాద సిద్ధాంతాలను, బానిస చిహ్నాలను అలాగే నెత్తికెత్తుకొని కాలం గడిపేస్తున్నాం. స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే మనల్ని అవమానపరిచే బానిస చిహ్నాలు తొలగించాల్సింది పోయి దానికి మరింత గుర్తింపునివ్వడం మొదలు పెట్టాం. మనదేశంలోని పలు ప్రాంతాలకు, రోడ్లకు, లేదా వీధులకు మొగల్ రాజవంశాలకు చెందిన రాజుల పేర్లు 700 వరకు కనిపించడం భారతీయతకు గొడ్డలిపెట్టు కాదా? బాబర్ పేరు మీద 61 స్థలాలకు, ఉమాయున్ పేరు మీద 11 స్థలాలకు, అక్బర్ పేరు మీద 251 స్థలాలకు పేర్లు ఉన్నాయి. 63 చోట్ల షాజహాన్ పేర్లు, 177 చోట్ల ఔరంగజేబు పేర్లు కనిపించడం ఆశ్చర్యం వేయదా?

మనకంటూ ప్రాచీన సంస్కృతి ఉన్నప్పటికీ, ఎందరో సంగీత, సాహిత్య, ఇతిహాసకారులు, స్వాతంత్ర సమరయోధులు ఉన్నప్పటికీ దేశప్రజల్ని బానిసలుగా చూసిన, ఈ దేశ సంస్కృతిని ధ్వంసంచేసి మతపరమైన హింసకు కారణమైన వ్యక్తుల పేర్లు ఆయా స్థలాలకు ఉండడం అభారతీయంగానే మనం భావించవచ్చు. అలాగే మన దేశ చరిత్రను వంచించే వ్యక్తులు మాక్స్ ముల్లర్, విలియం జోన్స్, విన్సెంట్ స్మిత్, డబ్ల్యు డబ్ల్యు హంటర్, హెచ్ఎమ్ ఇలియట్.. మన చరిత్రను ఎలా వక్రీకరించారన్న విషయం మర్చిపోయి వాళ్ల మార్గంలో నడిచే వ్యక్తుల చేతుల్లో భారతీయ చరిత్ర సాధనాలన్నీ ఉండడం ఒకింత ఆశ్చర్యం కలిగించే అంశం. రోమిలా థాపర్, రామ్ చరణ్ శర్మ, సతీష్ చంద్ర, రామచంద్ర గుహ వంటి వ్యక్తులు భారతీయ చరిత్రను భారతీయత లేకుండా మనకందించి చారిత్రక విధ్వంసానికి పాల్పడ్డారు. కానీ భారతీయ చరిత్రకు న్యాయం చేయడానికి ప్రయత్నించిన కొద్దిమంది చరిత్ర కారులకు మాత్రం సరైన స్థానం లభించలేదు. ఆర్సి మజిందార్, కోట వెంకటాచలం వంటి వారికి వామపక్ష చరిత్రకారుల పీఠాలలో స్థానం లభించలేదు. నరహంతకుల చరిత్రను అధ్యాయాలకు అధ్యయాలు బోధించడం వల్ల మన మెదళ్లు అభారతీయం అయిపోయాయి. అస్సాం ప్రాంతాన్ని పరిపాలించిన గొప్ప రాజవంశం అహం డైనాస్టీ. దక్షిణా పథాన్ని పాలించిన చోళ,




పాండ్య, విజయనగర, కాకతీయ, శాతవాహన మొదలైన రాజవంశాల విధానాలు, ప్రజలకు రక్షణగా నిలిచిన వారి సుపరిపాలన, వాళ్ల కాలంలో నిర్మించిన దేవాలయాలు, వాళ్లు పోషించిన సంగీత సారస్వతాలు మన తరాలకు తెలియకుండా చేశారు.


భారతీయ మూలాలైన వేదాలను ఆధారం చేసుకుని రచించిన పౌరాణిక గాథల నుండి అనేక కావ్యాలను సృజించి ఆయా పాత్రల స్వభావాలను శిల్పాలుగా మలచి మనకు అందించిన గొప్ప గొప్ప కవుల జీవితాలను స్వాతంత్ర్యం వచ్చాక విస్మరించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. వాటి స్థానంలో మొగల్



డాక్టర్ పి. భాస్కరయోగి

## తకు నష్టం

రాజవంశం ఔదార్యాన్ని మన బుర్రల నిండా నింపేశారు. మన పౌరాణిక గాథల్లోని ప్రతీకలు గమనించకుండా అశ్లీల అర్థాలతో భారతీయతను చంపేశారు. మహమ్మదీయ పౌరులకు వాళ్ల మత గ్రంథం ఖురాన్ షరీఫ్ ఆధారంగా ముస్లిం పర్సనల్ లా వర్తిస్తుంది. 1937 నాటి ముస్లిం పర్సనల్ లా అప్లికేషన్ యాక్ట్, 1939లో బ్రిటిష్ వాళ్లు రూపొందించిన డిసొల్యూషన్ ఆఫ్ ముస్లిం మ్యారేజ్ యాక్ట్ ప్రకారం వాళ్ల సామాజిక జీవనం కొనసాగుతోంది. ఇక్కడ భారత రాజ్యాంగం సార్వభౌమత్వం చెల్లుబాటు కాదు. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ పేరుతో అన్ని మతాల వాళ్లకు ఒకేరకమైన చట్టం వర్తిస్తుంది. కానీ వివాహం, ఆస్తి, వారసత్వం.. వీటిలో మాత్రం మతాల వారీగా మైనార్టీలకు కావలసిన అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. బహుభార్యత్వం, విడాకులు తీసుకోవడం, బాల్య




వివాహాలు వంటి సామాజికమైన విషయాల్లో హిందువులను కట్టు బానిసలను చేసి, రాజ్యాంగం కళ్లు మూసి ముస్లింలకు రాచబాట వేశారు.

ఇటీవల ట్రిపుల్ తలాక్ విషయంలో ఎంత చర్చ జరిగిందో మనం చూశాం. అదే హిందువుల విషయానికొచ్చేసరికి రాజ్యాంగంలోని అక్షరం అక్షరం తుచ తప్పకుండా పాటించాల్సిందే. మతాన్ని బట్టి ధర్మాలు, నీతులు మారినప్పుడు చట్టం ముందు అందరూ సమానమని వల్లించడం హిపోక్రసి తప్ప ఇంకోటి కాదు. మతాచారాలు, సంప్రదాయాల విషయంలో హిందువులను కట్టడి చేసి ఎక్కడికక్కడ ఆంక్షలు పెట్టారు. సెక్యులర్ రాజ్యాంగం పేరుతో అనేక ప్రాచీన సంప్రదాయాలకు తిలోదకాలు ఇచ్చారు. చివరకు భారత రాజ్యాంగం లిఖిత ప్రతిలోని సీతారాములవారు మొదలైన భారతీయ సాంస్కృతిక చిత్రాలను కూడా చెరిపేశారు. తమిళనాడులో అయితే ఏ అధికారిక కార్య క్రమంలోనూ హైందవ మత చిహ్నం కనిపించకుండా చేశారు. కమ్యూనిస్టులు పరిపాలించిన బెంగాల్, త్రిపుర, కేరళలో ఎక్కడో వేరే దేశాల్లో పుట్టిన మార్క్స్, స్టాలిన్ విగ్రహాలను పెట్టారు గాని భారతీయతను ప్రతిబింబించేలా ఏ వ్యక్తి విగ్రహాలను పెట్టలేదు. వందల మంది మేధావుల జ్ఞానంతో సంవత్సరం పైబడి రచించుకున్న రాజ్యాంగం ప్రకారం వర్తించే అన్ని చట్టాలు సివిల్ కోడ్ విషయంలో హిందువులు, క్రైస్తవులు, బౌద్ధులు, జైనులు తప్ప ముస్లింలు ఆచరించాల్సిన అవసరం లేదు. అంటే ఈ దేశ పార్లమెంటు లాంటి అత్యున్నత చట్టసభ చేసిన చట్టం నిర్మించిన రాజ్యాంగాన్ని కొందరు మాత్రమే పాటించాలి. ఒక మతం వాళ్లు మాత్రం స్వేచ్ఛగా తమ ఇష్టం వచ్చిన విధంగా జీవించే హక్కును రాజ్యాంగం పరోక్షంగా ప్రసాదించేటట్లు చేయడం మనల్ని మనం వంచించుకోవడమే. ఈ దుస్థితి వల్ల హిందువుల పిల్లలకు వాళ్లు చదువుకునే పాఠశాలల్లో పవిత్రమైన గ్రంథం శ్రీమద్ భగవద్గీత శ్లోకాలు నేర్చుకునే అవకాశం లేదు. రామాయణం, భారతం లాంటి ప్రాచీన ఇతిహాసాల విలువలను గురించి తెలుసుకునే అవకాశం లేదు. అదే ముస్లిం మతస్తులు తమ మదర్సాల్లో తమ మత గ్రంథాన్ని గురించి, ప్రపంచవ్యాప్తంగా వాళ్ల మతం విస్తృతి గురించి స్వేచ్ఛగా చెప్పుకోవచ్చు. 70 ఏళ్లుగా జరిగిన ఈ విధ్వంసం వల్ల హిందువుల పిల్లలకు తమ మతాచారాలు, సంప్రదాయాలు కనీసం మత సంబంధమైన తాత్విక గ్రంథాల పేర్లు కూడా తెలియడం లేదు. సెక్యులరిజం పేరుతో అన్ని రకాల అణిచివేతలను హిందువులపైన ప్రయోగిస్తున్నారు. శివుడు, అయ్యప్ప, హనుమాన్ మాలలు ధరించిన విద్యార్థులు ఆయా చిహ్నాలను ధరించి పాఠశాలలకు కూడా వెళ్లలేని పరిస్థితి. అదే ముస్లిం విద్యార్థులు స్వేచ్ఛగా హిజాబ్‌ను, బుర్ఖాను ధరించి పాఠశాలలకు, కళాశాలలకు హాజరవుతున్నారు. పైపెచ్చు ఇది మాకు రాజ్యాంగం కల్పించిన హక్కు అంటున్నారు. దీనిని వ్యతిరేకించిన వాళ్లను మతతత్వవాదులుగా ముద్ర వేస్తున్నారు. ముస్లింలు వక్ఫ్ బోర్డు పేరుతో తమ మత సంబంధమైన ఆస్తులను స్వేచ్ఛగా అనుభవిస్తున్నారు. అదే హిందువులకు సంబంధించిన అన్ని



దేవాలయాలపై ప్రభుత్వాల పెత్తనం ఉండడం వల్ల ఆయా దేవాలయాల నిధులు దుర్వినియోగం అవుతున్నాయి. దీనికి కారణం హిందువులకు తమ మతం పట్ల అవగాహన లేకుండా చేసే చట్టాలు సెక్యులర్ ప్రభుత్వాలు అమలు చేయడమే.

ముస్లిం మతానికి సంబంధించిన అన్ని వ్యవహారాలు వక్ఫ్ బోర్డు ఆధారంగా జరుగుతుండడం వల్ల వాళ్ల వ్యవహారాలన్నీ పకడ్బందీగా ఉన్నాయి. హిందువుల మెదళ్లలో సెక్యులర్ విషం నింపడం వల్ల వాళ్ల అస్తిత్వాన్ని తెలియకుండానే కోల్పోతున్నారు. అలాగే ఒకరు ముద్దు, ఇద్దరు వద్దు.. అని మౌఖిక ప్రచారం చేయడం వల్ల హిందువులంతా సంతానం కనడం నేరంగా భావిస్తున్నారు. రోజు రోజుకు హిందూ జనాభా తగ్గిపోతోంది. అదే మైనార్టీల విషయంలో రివర్స్‌గా జరుగుతోంది. మైనార్టీలకు ముఖ్యంగా ముస్లింలకు విద్యాసంస్థలను స్థాపించుకునే హక్కును రాజ్యాంగం కల్పించడం ద్వారా దేశం నిండా వాళ్ల విద్యాసంస్థలు కుప్పలు తెప్పలుగా వెలుస్తున్నాయి. అక్కడ అంతా మత ప్రబోధమే. తద్వారా రాజకీయ వ్యవస్థను శాసించడం, వాళ్ల పనులు చేయించుకోవడం, వాళ్ల మతపరమైన టువంటి హక్కులకు రక్షణ కల్పించుకోవడం వరుసగా జరిగిపోతున్నాయి. మతాన్ని బట్టి చట్టం ఉండడం వల్ల భారతదేశంలో మెజార్టీ మతస్తులు బానిసలుగా మారిపోయారు. మైనార్టీలు దర్జాగా తమ మతాచారాలను కొనసాగిస్తూ బతికేస్తున్నారు. ఈ 70 ఏళ్ల పక్షపాత చట్టాలు, వాటి వెనుక జరుగుతున్న దురాగతాలు తొలగి పోవాలంటే ఉమ్మడి పౌరస్మృతి మాత్రమే ఏకైక మార్గం. ★

**ఉమ్మడి పౌరస్మృతిపై మీ అభిప్రాయాన్ని ఈ లింక్ ద్వారా తెలపండి... https://legalaffairs.gov.in/law_commission/ucc/**

# చట్టం అమలుతోనే



**యూనిఫార్మ్ సివిల్ కోడ్ (UCC)పై తమ అభిప్రాయాలను 30 రోజుల్లో తెలపాలని దేశ ప్రజల్ని, ప్రభుత్వేతర సంస్థలను 22వ లా కమిషన్ ఆఫ్ ఇండియా (LCI) కోరడంతో ఇది ప్రస్తుతం దేశవ్యాప్తంగా మరోసారి చర్చనీయాంశమైంది.**

ఉమ్మడి పౌరస్మృతి.. భారతదేశంలో ప్రతిపాదిత చట్టపరమైన ఒక Frame-work. వివాహం, విడాకులు, దత్తత, వారసత్వం వంటి వ్యక్తిగత విషయాలకు సంబంధించిన ఏకరీతి చట్టాల సమితిని క్రోడీకరించి పౌరుల మతంతో సంబంధం లేకుండా వాటిని వర్తింపచేస్తుంది.

ఉమ్మడి పౌరస్మృతి గురించిన ఆలోచన మన దేశంలో దశాబ్దాలుగా చర్చనీయాంశంగా ఉంది. ఇది కొన్ని రాజకీయ, సామాజిక సంస్థల దీర్ఘకాల డిమాండ్. రాజ్యాంగంలో ఆదేశిక సూత్రంగా (44వ అధికరణం) చేర్చారు కాబట్టి ప్రాథమిక హక్కుల స్థాయిని ఇది పొందజాలదు. కానీ ప్రభుత్వాలు దీన్ని విధిగా అనుసరించదగిన మార్గదర్శక సూత్రంగా పరిగణించాలి.



**జస్టిస్ కె. శివప్రసాద్**
**జిల్లా విశ్రాంత న్యాయమూర్తి**

అంతేకాదు, దీన్ని అమలు చేసేందుకు రాజ్యాంగపరమైన చర్యలను నిజాయితీగా చేపట్టాలి.

ఉమ్మడి పౌరస్మృతి అమలుతో మాత్రమే సామాజిక సమానత్వం అన్ని వర్గాల ప్రజలకు సహజంగా సిద్ధిస్తుందని; జాతీయ సమగ్రత, లింగ వివక్ష లేని స్థితి, స్త్రీలకు ఆత్మగౌరవం వంటి విషయాలకు ప్రాధాన్యం కలుగుతుందని రాజ్యాంగ నిర్మాత డా॥ అంబేద్కర్ ఆశించారు. ఇది సమానత్వం, నిజమైన లౌకిక వాదాన్ని ప్రోత్సహిస్తుందని దీని ప్రతిపాదకులు వాదిస్తే, ఇది మతపరమైన స్వేచ్ఛను, సాంస్కృతిక ఆచార వ్యవహారాలలో జోక్యం చేసుకుంటుందని వ్యతిరేకులు వాదిస్తున్నారు. అందువల్ల దశాబ్దాలుగా దీనిని మతంతో ముడిపడిన క్లిష్టమైన చిక్కు సమస్యగా మాత్రమే చూశారు. ఫలితంగా కొందరు అవకాశవాదులు దీనికి రాజకీయ రంగు పులిమి తాత్కాలిక ఎన్నికల వ్యూహంలో భాగమని ఉద్దేశ్యపూర్వక ప్రచారం చేసి రాజ్యాంగ నిర్మాతల స్ఫూర్తిని నీరుగార్చారు. 1948లో UCCకి సంస్కరణల విషయంలో హిందువుల వైపు నుండి కొంత వ్యతిరేకత వచ్చినా తదుపరి కాలంలో సమాజ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని సంస్కరణలకు సానుకూలత చూపారు. ఫలితంగానే 1956లో హిందూ వ్యక్తిగత చట్టాలు పార్లమెంట్ ద్వారా క్రోడీకరింపబడ్డాయి. ఈ చట్టాలు సిక్కులు, బౌద్ధులు, జైనులకు కూడా వర్తిస్తాయి.

**1. వివాహం, విడాకులు**

**2. స్వాధీనం (Custody) & సంరక్షణ (Guardian)**

**3. దత్తత, జీవన భృతి**

**4. ఉత్తరాధికారం, వారసత్వం (Succession & Inheritance)**

ఈ నాలుగు చట్టాలకు సంబంధించిన సంస్కరణలను UCCలో పొందు పరుచేందుకు లా కమిషన్ ఆఫ్ ఇండియా 2018 ఆగస్ట్ 31న విడుదల చేసిన Consultation Paper On Reform Of Family Lawలో ప్రతిపాదించింది.

మరోవైపు భారతదేశంలోని ముస్లింల వ్యక్తిగత విషయాలను.. అంటే వివాహం, విడాకులు, దత్తత, వారసత్వం వంటి వాటిని షరియత్ చట్టం నియంత్రిస్తుంది. వ్యక్తిగత వివాదాలకు సంబంధించిన విషయాలలో ప్రభుత్వం జోక్యం చేసుకోరాదని ఖురాన్, హదీస్‌లలో ఇచ్చిన వివరణలు మాత్రమే తమ వ్యక్తిగత జీవనానికి, ప్రవర్తనకు పునాది అని, సంస్కరణలకు తాము బద్ధవ్యతిరేకమని ముస్లింలు వాదించారు.

**ఉమ్మడి పౌరస్మృతి అమలు వల్ల కలిగే ప్రయోజనాలు:**

1. వ్యక్తిగత చట్టాలు మహిళల పట్ల వివక్షాపూరితంగా ఉంటాయనే అభియోగం ఉంది. ఈ వివక్ష వివాహం, విడాకులు, వారసత్వం, పిల్లల సంరక్షణలో కన్పిస్తుంది. కాబట్టి ఈ వివక్షతలను తొలగించి ఈ చట్టం లింగ సమానత్వాన్ని ప్రోత్సహిస్తుంది.

2. ప్రతి పౌరునికి సమానంగా వర్తించే ఓకే నియమావళిని ఏర్పరచి వ్యక్తిగత చట్టాలలో సందిగ్ధాలను, అసంబద్ధతలను, అసమానతలను తొలగించి అందరికీ సమన్యాయం అందిస్తుంది.

3. చట్టం పటిష్టంగా అమలుకావడం వల్ల పౌరుల్లో అయోమయంతో కూడిన వ్యతిరేకత తగ్గి సానుకూలత ఏర్పడుతుంది. దీనివల్ల చట్టం అమలుచేసే వ్యవస్థలలో వివక్షాపూరిత వ్యవహారానికి అవకాశం తగ్గుతుంది.

4. సమకాలీన విలువలు, సూత్రాలతో చట్టాలను నవీకరించుటకు, సంస్కరించడానికి అవకాశం కల్పిస్తుంది.

5. యువత సామాజిక వైఖరి, ఆకాంక్షలు, సమానత్వం మొదలగు విలువలు సార్వత్రిక ప్రాపంచిక సూత్రాలచే ప్రభావితమవుతాయి. కాబట్టి ఈ చట్టం అమలు దేశ నిర్మాణంలో యువత సామర్థ్యాలని పెంపొందించడానికి రాజ్యాంగ వ్యవస్థల పట్ల నమ్మకం పెరగడానికి దోహదం చేస్తుంది.

6. ప్రతిఒక్కరూ అనుసరించదగిన సాధారణ నియమావళి ద్వారా వివిధ మత లేదా సమూహాల మధ్య ఉద్రిక్తతలు, సంఘర్షణలు తగ్గుతాయి.

7. కులం, మతం, వర్గం స్త్రీ, పురుష లింగ భేదాలకు అతీతంగా పౌరులందరికీ సమాన హోదా లభిస్తుంది.

8. బహుభార్యాత్వం చట్టవ్యతిరేకమవుతుంది. మహిళలపై మతపరమైన దురాగతాలను నివారిస్తుంది.

9. అన్ని మతాల్లో చిన్న కుటుంబం తప్పనిసరి అవుతుంది. తద్వారా జనాభా

# సామాజిక సమానత్వం



నియంత్రణ జరిగి పౌరులందరికి సహజ వనరుల పంపకం హేతుబద్ధమవుతుంది.

10. ఈ చట్టం అమలు జాతీయ ఐక్యతను ప్రోత్సహిస్తుంది. దేశ లౌకిక తత్వానికి నిజమైన అర్థాన్నిస్తుంది.

11. మతంతో సంబంధం లేకుండా రాజ్యాంగం ప్రాథమిక హక్కులు స్థిరంగా ఉన్నాయని UCC నిర్ధారిస్తుంది.

12. మతపరమైన ఆచారాల అడ్డంకి లేకుండా వివాహం చేసుకోవడానికి ఈ చట్టం అనుమతిస్తుంది.

1985లో షాబానో కేసులో విడాకులు పొందినా చట్టపరంగా భార్యకు భృతి (maintanance) ఇవ్వవలసిన బాధ్యత భర్తదే అని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. షరియత్ చట్టం ఈ బాధ్యత నుండి భర్తను విముక్తి చేయదు అని ఈ తీర్పులోని సారాంశం. దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న UCCని అమలు చేయవలసిన బాధ్యత ప్రభుత్వానిదే అని ఈ సందర్భంగా సుప్రీంకోర్టు గుర్తుచేసింది. అయితే ఒకవైపు సమ సమాజం కావాలని, ధర్మనిరాపేక్ష రాజ్యాంగం అమలు చేయాలని కోరుతూ, మరోవైపు మత సిద్ధాంతాల ఆధారంగా ధర్మ నిరాపేక్షతను నిర్వచిస్తామని కొందరు మొండి వాదనలు చేశారు.

1985 నాటి షాబానో కేసు తీర్పు UCC అమలు చేయడానికి ప్రభుత్వానికి మంచి అవకాశం దొరికింది. అయితే 400 మంది పార్లమెంట్ సభ్యుల సంఖ్యాబలమున్న కాంగ్రెస్ పార్టీ ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ ముస్లింల మత విశ్వాసాలకు మాత్రమే ప్రాధాన్యం ఇచ్చి ఈ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన హేతుబద్ధమైన తీర్పును నిర్వీర్యం చేసి Muslim Women (Protection of Rights on Divorce) Act 1986 ని రూపొందించి మతవిశ్వాసాలకు కొత్త శక్తినిచ్చి ఉమ్మడి పౌర స్ఫూర్తికి తీవ్ర విఘాతం కలిగించింది. అయితే ఈ పరిణామాన్ని సహజంగానే నిర్లిప్తంగా ఉండే హిందూ సమాజం పెద్దగా పట్టించుకోలేదు. రామజన్మభూమి రథయాత్ర ఫలితంగా UCC అమలుకు ఏర్పడిన సువర్ణావకాశం చేజారిపోయింది. అయినా ఈ వివాదాలకు శాశ్వతంగా తెరదించాలన్న ఉద్దేశంతోనే UCCని తప్పక అమలు చేయాలని సుప్రీంకోర్టు మరీ మరీ చెబుతుంది. ఈ సూచన/సలహా విషయంగా సుప్రీంకోర్టు దూరదృష్టిని, పరిణతిని, హెచ్చరికలను తక్కువ అంచనా వేయరాదు. ప్రస్తుతం UCCని పార్లమెంటు ఆమోదించినా, సుప్రీం కోర్టు దీన్ని సమర్థించినా దీనిపై న్యాయస్థానాల తీర్పులను సమర్థించి నిలుపుకోగల సామర్థ్యం సమాజంలో పెరగాలి. లేదంటే షాబానో కేసు తీర్పునకు జరిగిన పరాభవం UCCకి జరగదన్న గ్యారంటీ లేదు. ★

## షరియా అంటే?

ఉమ్మడి పౌరస్మృతి వద్దు, షరియా కావాలని ముస్లిం మతపెద్దలు వాదిస్తుంటారు. అసలు షరియా అంటే ఏంటి మరి? ఇస్లాం మతం పాటించే వారు ఏర్పరచుకున్న సొంత న్యాయవ్యవస్థనే షరియా అంటారు. షరియా అంటే అర్థం చట్టం. అరబ్బీలో దీనికి అర్థం మార్గం. ఖురాన్‌లో చెప్పినవి, మహ్మద్ ప్రవక్త ప్రవచనాలు, మత పెద్దల బోధనల ద్వారా దీన్ని రూపొందించారు. అయితే ఇది రాతపూర్వక నియమావళి మాత్రం కాదు. మతాన్ని ఎలా ఆచరించాలి, ప్రవర్తనా నియమాలు, చట్టపరమైన విషయాలను ఎలా ఆచరించాలి? అనేవి ఇందులో ఉంటాయి.

షరియా ప్రకారం ముస్లింలందరూ రోజుకు అయిదు సార్లు ప్రార్థన చేయాలి. అయితే ప్రార్థన చేయనందుకు ఖురాన్‌లో ఎలాంటి శిక్షలు లేవు. అయినప్పటికీ ముస్లిం దేశాల్లో కఠినంగానే ఆచరిస్తారు. జంతు మాంసం తినాలంటే కచ్చితంగా హలాల్ చేయాలి. ముస్లింలు బ్రహ్మచర్యాన్ని పాటించడం, సన్యసించడం నిషేధం. నిఖా (వివాహం) తప్పనిసరి. ఇది జరగకుంటే ఇస్లాంలో చట్టబద్ధత ఉండదు. ముస్లింలు నిరభ్యంతరంగా విందులూ, వినోదాలకు (పార్టీలు) హాజరు కావచ్చు. కానీ పొగ తాగడం, మద్యపానం, మాదక ద్రవ్యాలు తీసుకోకూడదు. పార్టీలకు వెళ్లినప్పుడు పురుషులు ఇతర కుటుంబాలకు సంబంధించిన మహిళలతో మాట్లాడకూడదు. మహిళలు శరీరమంతా కప్పే వస్త్రాలు, హిజాబ్ లేదా బుర్ఖా ధరించాలి. ముస్లింలు తమకిష్టమైన విద్యనభ్యసించవచ్చు. మహిళలు బయటకు వెళ్లాలంటే మగవారి తోడు తప్పనిసరి.

**నేరం, శిక్ష**

షరియా ప్రకారం నేరాలు (క్రిమినల్ లా) హద్, తాజిర్ అని రెండు రకాలు. దొంగతనం, వ్యభిచారం, మద్యపానం హద్ నేరాల జాబితాలోకి వస్తాయి. హద్‌లో హదూద్, ఖియాస్ అని రెండు రకాలుంటాయి. హదూద్ ప్రకారం అవయవాలు నరకడం, ఉరి తీయడం, రాళ్లతో కొట్టి చంపడం, కొరడాతో కొట్టడం లాంటి శిక్షలుంటాయి. ఖియాస్ అంటే బాధితుడు, వారి వారసుల నిర్ణయానుసారం శిక్షలు అమలు చేయడం. వారు క్షమిస్తే శిక్షలకు బదులు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. తాజిర్ నేరాలకు న్యాయాధిపతి నిర్ణయం మేరకు శిక్షలు విధిస్తారు. మతమార్పిడిని ముస్లింలు నేరంగా పరిగణిస్తారు. షరియా చట్టం ప్రకారం ఈ నేరానికి మరణశిక్షే. కుటుంబం, వివాహం, వారసత్వం వంటివి వ్యక్తిగత చట్టం (పర్సనల్ లా) పరిధిలోకి వస్తాయి.

మధ్యయుగాల్లో ఏర్పరచిన షరియాను చాలా ఇస్లామిక్ దేశాలు తమ దేశ ప్రమాణాలకు అనుగుణంగా అమలు చేస్తున్నాయి. కొన్ని దేశాలు వీటిపై సమీక్షలు చేసి ఆధునిక కాలానికి అనుగుణంగా మార్పులు చేస్తున్నాయి. మత పెద్దలతో చర్చించి వీటి విషయంలో నిర్ణయం తీసుకుంటారు. అయితే ప్రపంచంలోని 9 దేశాలు మాత్రమే పూర్తిగా షరియా ప్రకారం క్రిమినల్, పర్సనల్ న్యాయవ్యవస్థను అమలు చేస్తుండటం గమనార్హం.

– మిత్ర


**ఉమ్మడి పౌరస్మృతిపై మీ అభిప్రాయాన్ని ఈ లింక్ ద్వారా తెలపండి... https://legalaffairs.gov.in/law_commission/ucc/**



# మూలధన ఖర్చులో స్తబ్ధత.. అచేతనంలో రాష్ట్రం

రాష్ట్రంలో అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం ఇతోధికంగా సహకరిస్తున్నప్పటికీ వైసీపీ ప్రభుత్వం వాటిని సద్వినియోగం చేసుకోలేక పోతోంది. ఫలితంగా అన్ని రంగాలు కునారిల్లుతున్నాయి. అది ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అభివృద్ధికి ఊతమిచ్చే మూలధనం వ్యయంలో దేశంలోని చాలా రాష్ట్రాల కంటే వెనుకబడి పోయింది. రాష్ట్ర ప్రగతికి ఉపకరించే పోలవరం ప్రాజెక్టు, రైల్వే, ఓడరేవులను విస్మరించి, వచ్చే ఎన్నికల్లో ఓట్లే ధ్యాసగా ఉచిత, సంక్షేమ పథకాల పేరుతో అప్పులు చేసి మరీ నిధులు గుమ్మరిస్తోంది. మరోవంక ప్రజలు పన్నుల భారంతో సతమతమవుతున్నారు. కొత్త పనులు చేపట్టడం అటుంచి ప్రారంభించిన పథకాలే ముందుకు సాగని పరిస్థితి. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు, టిడ్కో ఇళ్లు వంటివి అందుకు ఉదాహరణలు. అభివృద్ధిలో పొరుగు రాష్ట్రాలు పరుగులు తీస్తుంటే ఆంధ్రప్రదేశ్ పరిస్థితి అర్థంకాక, విపక్షాలు, నిపుణులు విస్తుపోతున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో మూలధన వ్యయం అతి తక్కువగా ఉండడంతో మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందక రాష్ట్రం వెనుకబడిపోతోంది. రహదారులు, రైల్వేలు, రాజధాని అమరావతి, పారిశ్రామిక కారిడార్లు, సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో అన్నిరంగాలు వెనుకబడిపోయాయి. పరిశ్రమలు రాక ఉద్యోగ, ఉపాధి కరవై నిరుద్యోగులు నిరాశ నిస్పృహలతో ఉన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు నిధులు ఇవ్వక పోవడంతో రైతులు నిరుత్సాహంతో ఉన్నారు. పోలవరం పూర్తికావడం అటుంచి కనీసం ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. దీనిపైనే ఆశలు పెట్టుకున్న రాయలసీమ రైతులు తీవ్రంగా నీరసపడ్డారు. రైల్వే లైన్లు, ఓడరేవులు నిర్మించక పోవడంతో లాజిస్టిక్స్ రంగంలో ఉపాధి కరవైంది. అభివృద్ధికి ఊతమిచ్చే అన్ని రంగాలు వెనుకబడి పోయి రాష్ట్రం అచేతన మైపోయింది. ఫలితంగా సంపద సృష్టికి మార్గం లేకుండా పోయింది. మరోపక్క సంక్షేమం పేరుతో రాష్ట్ర ఆదాయాన్ని ప్రజలకు పంచేస్తున్నారు. ఇవి చాలక పన్నుల భారాలు మోపి, అప్పులు కూడా చేసి ప్రజల నెత్తిన ఆర్థికభారాలు మోపుతున్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలతో పేదల జీవితాలు మరింత దారిద్ర్యంలోకి జారిపోయాయి. ఈ ప్రభుత్వం పాలన ఒక తరాన్ని నాశనం చేసిందని నిపుణులు పేర్కొంటున్నారు.




**వల్లూరు జయప్రకాష్ నారాయణ**


చైర్మన్,సెంట్రల్ లేబర్ వెల్ఫేర్ బోర్డు, కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ


**మూలధన వ్యయంపై నిరాశక్తత**

వైసీపీ సర్కారుకు రాష్ట్ర అభివృద్ధిపై ఆసక్తి లేదు. వార్షిక బడ్జెట్‌లో కేవలం పది శాతం కూడా ఖర్చు చేయడం లేదు. ప్రాజెక్టుల నిర్మాణం, రహదారులు, భవనాలు, ఆరోగ్య సౌకర్యాలు, విద్య తదితరాలపై ఖర్చుచేసే మొత్తాన్ని మూలధన వ్యయంగా పరిగణిస్తారు. వీటి వల్ల సంపద సృష్టి జరుగుతుంది. భవిష్యత్తులో ఆదాయం సమకూరి రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. అందువల్ల.. సంపద సృష్టికి మూలధన వ్యయమే ఆధారం. ఇప్పుడు పెట్టే ఖర్చుతో ప్రజల ఆదాయం పెరుగుతుంది. జీవనోపాధి అవకాశాలు మెరుగుపడతాయి. ఉదాహరణకు ఒక ప్రాజెక్టు కడితే దాని ద్వారా.. లక్షల ఎకరాలకు నీటి వసతి కల్పించవచ్చు. తద్వారా పంటలు పండి, రైతులకు ఆదాయం లభిస్తుంది. వ్యవసాయంపైనే ఆధారపడిన ఇతర రంగాల్లోనూ వృద్ధి నమోదవుతుంది. అంతిమంగా రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి దోహద పడుతుంది. అందుకే మూలధన వ్యయాన్ని అధికంగా అమలు చేసే రాష్ట్రాలు అభివృద్ధి చెందుతూ వస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ 2022–23 ఏడాదికిగాను వార్షిక బడ్జెట్‌ను మొత్తం రూ.2,56,257 కోట్లతో ప్రవేశపెట్టారు. మూలధన వ్యయం అంచనా రూ.47,996 కోట్లు ఖర్చుచేస్తామని చెప్పారు. కాని రూ. 6,917 కోట్లు మాత్రమే ఖర్చు చేసినట్లు బ్యాంక్ ఆఫ్ బరోడా పేర్కొంది. రమారమి 48 వేల కోట్ల అంచనాలో రూ.7 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేయడం అంటే ఈ ప్రభుత్వానికి అభివృద్ధిపై ఎంత చిత్తశుద్ధి ఉందో గుర్తించవచ్చు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ మూలధన వ్యయంలో వెనుకబడే ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో ఈ పద్దు కింద కర్ణాటక రూ.56,907 కోట్లు ఖర్చుచేసింది. తమిళనాడు రూ.38,732 కోట్లు, తెలంగాణ రూ.17,336 కోట్లు, కేరళ రూ.13,407 వ్యయం చేశాయి. ఒడిశాలోనూ మూలధన వ్యయం రూ.33,462 కోట్లుగా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో రూ.6,917 కోట్లు మాత్రమే ఖర్చయ్యాయి.

**పోలవరం పనులు ఎక్కడివక్కడే**

పోలవరం ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి వంటిది. రాష్ట్రానికి ఎగువ నుండి వచ్చే నదీ జలాల లభ్యత తగ్గిపోతున్న పరిస్థితిలో పోలవరం ఒక వరంలా మారింది. సముద్రంలో కలుస్తున్న గోదావరి జలాల్లో కొంత పోలవరం డ్యామ్ ద్వారా మళ్లించి, 194.60 టీఎంసీల నీటిని నిల్వ చేస్తే 23 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ, దాదాపు 7 లక్షల 20 వేల ఎకరాల కొత్త ఆయకట్టు, సుమారు 10 లక్షల



ఎకరాలకు పరోక్షంగా (కృష్ణా డెల్టాకు రావలసిన నికర జలాలను శ్రీశైలంలోనే నిల్వ చేసి రాయల సీమకు అందించడం) సాగునీరు అందించడం, 960 మెగావాట్ల జలవిద్యుత్, 80 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా నదికి మళ్లించడం, విశాఖపట్నం నగరానికి పారిశ్రామిక, తాగునీటి అవసరాల కోసం 24 టీఎంసీల నీటి సరఫరా, 540 గ్రామాలలోని 29 లక్షల జనాభాకు తాగునీటి సౌకర్యం కల్పించే బహుళార్థసాధక ప్రాజెక్ట్ పోలవరంగా నిపుణులు పేర్కొంటున్నారు. పోలవరం ద్వారా నదుల అనుసంధానం పూర్తి అయితే ప్రత్యేకించి రాయల సీమ, ఉత్తరాంధ్ర రైతులందరూ బాగుపడతారు. నగరాలకు తాగునీటి సమస్య, విద్యుత్ సమస్య తీరుతుంది. 72 శాతం పనులు పూర్తైనట్లు చెబుతున్న పోలవరాన్ని పూర్తిచేస్తే రాష్ట్రానికి ఎంతో మంచి జరిగేది. కాని ఈప్రభుత్వం పోలవరం నిర్మాణంపై ఏ మాత్రం శ్రద్ధ చూపకపోవడంతో ప్రాజెక్టుకు ముందడుగు పడలేదు. నిర్మాణంలో జాప్యం వలన భారీ నష్టం వాటిల్లింది. వైసీపీ ప్రభుత్వ చర్యల వలన ఈ ప్రాజెక్టు పరిస్థితి ప్రశ్నార్థకం అయ్యింది. స్వార్థ రాజకీయాలతో అన్నపూర్ణ వంటి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని నాశనం చేస్తున్నారని రాజకీయ పార్టీలు ఆరోపిస్తున్నాయి. పోలవరమే కాదు రాష్ట్రంలో ఏ సాగునీటి ప్రాజెక్టును ఈ ప్రభుత్వం పూర్తిచేయలేదు.

**రైల్వే ప్రాజెక్టులకు గ్రహణం**





రైల్వే ప్రాజెక్టులను రాష్ట్ర ప్రభుత్వం పట్టించు కోవడం లేదు. కేంద్రం మంజూరు చేస్తున్న నూతన రైల్వే ప్రాజెక్టులను రాష్ట్ర ప్రభుత్వం అందిపుచ్చు కోవడం లేదు. 11 నూతన రైల్వే లైన్లు కేటాయిస్తే వాటికి అవసరమైన భూసేకరణ, నిర్మాణానికి అవసరమైన నిధులు సమ కూర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. నడికుడి-శ్రీకాళ హస్తి, కోటిపల్లి-నర్సాపూర్, కడప-బెంగళూరు మధ్య కొత్త లైన్ల నిర్మాణం, గుంటూరు-గుంతకల్, గుంటూరు-నంద్యాల డబ్లింగ్ పనులు, కాజీపేట-విజయవాడ మధ్య ట్రిప్లింగ్ పనులు, గుత్తి, రేణిగుంట వద్ద బైపాస్ నిర్మాణం వంటి పనులను రాష్ట్ర, కేంద్ర వాటా నిధులతో పూర్తి చేయాలి. ఈ మొత్తం పనులకు 4,494 హెక్టార్ల భూమిని సేకరించాలి. ఇందులో ప్రయివేటు భూమి 2,814 హెక్టార్లు, ప్రభుత్వ భూమి 1,438 హెక్టార్లు, అటవీ భూమి 242 హెక్టార్లు కావాల్సి ఉంటుందని గుర్తించారు. ఇప్పటివరకు 2,023 హెక్టార్లు మాత్రమే సేకరించగా, ఇంకా 2,472 హెక్టార్లు సేకరించాలి. ఇక ఏడు పథకాలకు అవసరమైన రాష్ట్ర వాటా నిధులు ఇంకా విడుదల కాలేదని చెబుతున్నారు. నడికుడి-కాళహస్తి లైన్‌కు, విజయవాడ - నిడదవోలు డబ్లింగ్ పనులకు, కోటిపల్లి-నర్సాపూర్ పనులకు, భద్రాచలం రోడ్-కొవ్వూరు లేన్‌కు, తుముకూరు-రాయదుర్గం పనులకు మొత్తం కలిపి సుమారు 3,500 కోట్లకు పైగా నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలంటున్నారు. విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్, కాకినాడ పెట్రోకెమికల్ సమూహం, శ్రీకాళహస్తి ఎలక్ట్రానిక్స్ పారిశ్రామిక క్లస్టర్, బెంగళూరు-చెన్నై పారిశ్రామిక క్లస్టర్, శ్రీసిటి పారిశ్రామిక సమూహం, ప్రకాశం, చిత్తూరు జిల్లాల్లో రెండు సమీకృత పారిశ్రామిక టౌన్‌షిప్ (నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ మ్యానుఫాక్చరింగ్ జోన్)ల ఏర్పాటుకు కేంద్రం అనుమతి ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం ఉత్సాహం చూపించలేదు. ఈ ప్రాజెక్టులకు భూసేకరణ చేయక పోవడంతో పరిశ్రమలు ఏర్పడ లేదు. ఫలితంగా యువతకు కొలువులు లేకుండా పోయాయి. వీటిలో సగం ఏర్పాటైనా 10 లక్షల మందికి పైగా ఉద్యోగాలొచ్చేవి. ముఖ్యమంత్రి తమ సొంత జిల్లాలో ఏర్పాటు చేస్తానన్న ఉక్కు కర్మాగారా నికి ఇప్పటికి మూడుసార్లు శంకుస్థాన జరిగింది. కానీ నిర్మాణం పనులు ప్రారంభం కాలేదు. ఇవికాక కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఓడరేవులను నిర్మించడంలో ఈ ప్రభుత్వం విఫలమైంది. కేంద్ర ప్రభుత్వం నిర్మించిన టిట్కో ఇళ్లను పూర్తిచేసి లబ్ధిదారులకు పంపిణీ చేయలేదు. కొత్త బోధనాసు పత్రులను శంకుస్థాపనలకే పరిమితం చేశారు.

**పంచడానికే ప్రాధాన్యం**


అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మరుసటి ఎన్నికల్లో గెలుపు కోసం ఓటర్లను ఎలా ఆకర్షించాలనే ఆలోచన తప్ప రాష్ట్రాన్ని ముందుకు నడిపించాలనే యోచన లేదు. ఆరు నెలల్లో మంచి ముఖ్యమంత్రిని అనిపించుకుంటానని అధికారం చేపట్టిన తొలిరోజు జగన్‌మోహనరెడ్డి ప్రకటించారు. ఆరు నెలలు కాదుకదా 46 నెలలైనా ఆయన ఆ మాటను నిలబెట్టు కోలేదు. ఈ ప్రభుత్వం చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు లాంటివి గతంలో ఎప్పుడూ చూడలేదు. ప్రజలంతా ఎప్పుడు ఈ ప్రభుత్వం పోతుందా? అని ఎదురుచూస్తున్నారు.

ఇక రాష్ట్ర ఆదాయాన్ని నవరత్నాల పథకాల అమలుకు ఖర్చుచేస్తూ నిర్మాణ పనులకు తిలోదకా లిచ్చారు. కేంద్ర ప్రభుత్వం గతంలో వేసిన గ్రామీణ రహదార్లు, నిరంతరం వేస్తున్న జాతీయ రహదారులు తప్పించి మరే కొత్త రహదారులు రాష్ట్రంలో కనిపించడం లేదు. అన్ని ప్రాంతాల్లో అంతర్గత రహదార్లు ధ్వంసమైపోయాయి. పాత బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు చేయడానికి ముందుకు రావడం లేదు. మున్సిపాలిటీలు, కార్పొ రేషన్లలో అభివృద్ధి పనులు జరగక ప్రజా ప్రతినిధులు తలలు పట్టుకుంటున్నారు. పంచాయ తీల్లో అయితే నిధులు మళ్లించడంతో సర్పంచులు ప్రజల ముఖాలు చూడలేక గగ్గోలు పడుతున్నారు. ★



అధికారం వచ్చినప్పటి నుంచి మరుసటి ఎన్నికల్లో గెలుపు కోసం ఓటర్లను ఎలా ఆకర్షించాలనే ఆలోచన తప్ప రాష్ట్రాన్ని ముందుకు నడిపించాలనే యోచన లేదు. ఆరు నెలల్లో మంచి ముఖ్యమంత్రిని అనిపించుకుంటానని అధికారం చేపట్టిన తొలిరోజు జగన్‌మోహనరెడ్డి ప్రకటించారు. ఆరు నెలలు కాదుకదా 46 నెలలైనా ఆయన ఆ మాటను నిలబెట్టు కోలేదు.

ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమెరికా వెళ్లడం ఇదే తొలిసారి కాదు. ఇంతకు ముందు కూడా అనేక సందర్భాల్లో వెళ్లారు. కానీ ఈ దఫా ఆయన అమెరికా పర్యటనను ప్రపంచ దేశాలన్నీ ఆసక్తిగా గమనించాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంవల్ల ప్రపంచ వ్యాప్తంగా ఏర్పడిన అనిశ్చితి వల్ల కావచ్చు, కరోనా అనంతరం ఏర్పడిన పరిణామాల ప్రభావం కావచ్చు. అమెరికా-చైనా సంబంధాల్లో వచ్చిన మార్పుల వల్ల కావచ్చు. వీటన్నింటి మధ్య భారత్ అనుసరిస్తున్న వైఖరి వల్ల కావచ్చు. మోదీని కేవలం ఒక దేశప్రతినిధిగా కాక దార్శనికునిగా, భవిష్యత్ ద్రష్టగా అన్ని దేశాలు చూస్తున్నాయి. దానికి తోడు జి-20 అధ్యక్ష స్థానంలో ఉన్న భారత్ ఈ ఏడాది సెప్టెంబరులో కీలక సమావేశానికి సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో మోదీ అమెరికా పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ పర్యటనను ఒక మైలురాయిగా అందరూ ప్రశంసిస్తున్నారు.




# భారత్-అమెరికా సంబం

ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమెరికా పర్యటన తర్వాత రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు సమూలంగా మారిపోయాయి. కొత్త అధ్యాయం మొదలయ్యింది. తమ కలయిక చారిత్రాత్మకమని అమెరికా అధ్యక్షుడు బైడెన్ ప్రకటించడాన్ని ఇక్కడ ప్రత్యేకంగా చెప్పుకోవాలి. రక్షణ, స్వచ్ఛ ఇంధనం, అంతరిక్షం సహా పలురంగాల్లో భాగస్వామ్యంపైన రెండు దేశాల మధ్య చర్చలు సాగాయి. రక్షణ, సెమికండక్టర్ల రంగంలో ఒప్పందాలు ప్రత్యేకమైనవిగా పరిశ్రమల వర్గాలు చెబుతున్నాయి. చైనా ఆధిపత్యాన్ని అవి సవాలు చేసేవని చెబుతు న్నారు. అమెరికా గడ్డ మీద అడుగుపెట్టిన మోదీకి అడుగడుగునా రెడ్ కార్పెట్ స్వాగతం లభించింది. శ్వేతసౌధంలో ఆ దేశాధ్యక్షుడు జో బైడెన్, ఆయన భార్య జిల్ బైడెన్ మోదీ గౌరవార్థం విందు ఇచ్చారు. మన దేశం నుంచి ముకేష్ అంబాని, ఆనంద్ మహీంద్ర, నిఖిల్ కామత్ వంటి ప్రముఖులు ఆ విందుకు హాజరయ్యారు. మోదీ రాకకు యూఎస్ కాంగ్రెస్ ఫిదా అయిపోయింది. గంటసేపు ఆయన చేసిన ప్రసంగానికి, 79 సార్లు చప్పట్లు కొట్టటమే కాదు. 15 సార్లు స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు. ఆయనకున్న క్రేజ్ ఎలాంటిదో ఈ సమావేశం నిరూపించింది. అమెరికన్ చట్టసభ సభ్యులు మోదీ ఆటో గ్రాఫ్‌లు, సెల్ఫీల కోసం ఎగబడ్డారు. దాదాపు గంటసేపు మోదీ ప్రసంగించారు. గ్యాలరీలో కాంగ్రెస్ సభ్యులు 12 మంది స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు. ప్రతినిధుల సభ స్పీకర్ మెక్ కార్తీ సంయుక్త సెషన్ చిరునామా బుక్‌లెట్‌పై ప్రధాని మోదీ ఆటోగ్రాఫ్ తీసుకున్నారు. మోదీ సంతకం చేసిన ప్రసంగ కాపీల కోసం సభికులు ఎగబడ్డారు. ఉక్రెయిన్ యుద్ధం, తీవ్రవాదం, టెక్నాలజీ, ఇండో పసిఫిక్ రీజియన్‌లో ఉద్రిక్తత, చైనా విస్తరణవాదం... ఇలా పలు అంశాలపై ప్రధాని ప్రసంగించారు. ఉగ్రవాదాన్ని ఉపేక్షించే ప్రశ్నే లేదని, టెర్రరిజాన్ని పెంచి పోషిస్తూ ఇతర దేశాల పైకి వదిలేవారని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలేది లేదని, పాకిస్తాన్ అకృత్యాలను పరోక్షంగా ప్రస్తావించారు. అమెరికా ట్విన్ టవర్స్ కూల్చివేత (9/11), ముంబయ్ దాడులు (26/11) ఘటనలను ప్రస్తావిస్తూ రాడికలిజం, టెర్రరిజం ప్రపంచానికి పెనుముప్పుగా మారాయని వ్యాఖ్యానించారు. భారతీయ అమెరికన్లను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. భారతీయ మూలాలున్న అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌ను భారతీయ ప్రతినిధిగా పేర్కొని అందరి దృష్టిని ఆకర్షించారు. 'సమోసా కాకస్' ఉంటే సభకు మరింత రుచి అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. 'సమోసా కాకస్' అంటే ప్రతినిధుల సభ లేదా సెనేట్‌లో భాగమైన భారతీయ అమెరికన్ చట్ట సభ సభ్యుల అనధికార సమూహం. కాంగ్రెస్‌లో రెండుసార్లు ప్రసంగించిన తొలి ప్రధానిగా మోదీ రికార్డు నమోదు చేసుకున్నారు. ఆయన కాలు పెట్టిన ప్రతి చోట 'మోదీ.. మోదీ' నినాదాలు మిన్నుముట్టాయి.

ప్రధాని మోదీకిది తొలి 'అఫీషియల్ స్టేట్ విజిట్'. విదేశాల్లో 'అఫీషియల్ స్టేట్ విజిట్' అంటే దేశాధినేత ద్వారా మాత్రమే జరుగుతుంది. ఇది ఒక వ్యక్తి లేదా నాయకుడి పర్యటన కంటే దాన్ని 'దేశ పర్యటన'గా వర్ణిస్తారు. జో బైడెన్ ఇప్పటి వరకు ఫ్రాన్స్, దక్షిణ కొరియా అధ్యక్షులను మాత్రమే అధికారికంగా ఆహ్వానించారు. ఇప్పుడు భారత ప్రధాని నరేంద్ర మోదీకి అలాంటి ఆహ్వానం అందింది. భారత్‌తో సంబంధాలకు అమెరికా ఎందుకంత ప్రాధాన్యమిచ్చిందనే అంశంపైన ప్రపంచం వ్యాప్తంగా చర్చ జరిగింది. సాధారణంగా సందర్శించే దేశాధినేతను ఆతిథ్య దేశం అధికారికంగా స్వాగతిస్తుంది. అతిథిని అధికారికంగా భోజనానికి ఆహ్వానిస్తారు. అఫీషియల్ స్టేట్ విజిట్, అఫీషియల్ విజిట్, అఫీషియల్ వర్కింగ్ విజిట్ , వర్కింగ్ విజిట్, గెస్ట్ ఆఫ్ గవర్నమెంట్ విజిట్, ప్రయివేటు విజిట్ ఇలా రకరకాలుగా ఉంటుంది. ఒక్కోదానికి ఒక్కో రకమైన ప్రొటోకాల్ ఉంటుంది. 2009లో అప్పటి భారత ప్రధాని మన్మోహన్ సింగ్ కూడా అమెరికాకు 'అఫీషియల్ స్టేట్ విజిట్' కోసం వెళ్లారు. ప్రధాని మోదీ ఈ పర్యటనలో వాషింగ్టన్‌లోని బ్లెయిర్ హౌస్‌లో బస చేశారు. అది అమెరికా అధ్యక్షుని అతిథి గృహం.

జూన్ 20న అమెరికా బయలుదేరిన మోదీ 21వ తేదీన న్యూయార్క్ లో జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొన్నారు. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇందులో ఎక్కువ మంది భాగస్వాములు కావటంతో అది గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లోకి చేరింది. ఆ తర్వాత వైట్‌హౌస్‌లో చారిత్రక శిఖరాగ్ర సమావేశంలో పాల్గొన్నారు. ఆ తర్వాత కాంగ్రెస్‌ను ఉద్దేశించి ప్రసంగించారు. తర్వాత ఆయన గౌరవార్థం అమెరికన్ ఫస్ట్ లేడీ జిల్ బైడెన్ విందు ఏర్పాటు చేశారు. ఇందులో బైడెన్ తో కలిసి



డాక్టర్ పార్థసారథి చిరువోలు
సీనియర్ జర్నలిస్ట్

# ధాల్లో కొత్త అధ్యాయం




పాల్గొన్నారు. 400 మంది అతిథులు ఈ కార్యక్రమంలో పాల్గొనటం విశేషం. బైడెన్,మోదీ చాలా జోవియల్‌గా కనిపించారు. ఒకరిపైన మరొకరు చెణుకులు విసురుకున్నారు. ఆల్కహాల్ తీసుకోకుండానే మీరు భోజనం ముగించారని బైడెన్ అన్నప్పుడు మోదీ గట్టిగా నవ్వారు. తామిద్దరికీ ఈ అలవాటు లేదని చెప్పారు.

అమెరికా శ్వేతసౌధంలో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తో కలసి విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. అమెరికా పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో భారత్, అమెరికాల మధ్య సంబంధాలు ఏఐ లాంటిదని మోదీ వ్యాఖ్యానించటం బైడెన్‌ను ఆకట్టుకుంది. మోదీకి ప్రత్యేక టీ షర్ట్‌ను బహుమతిగా ఇచ్చారు. ఈ టీ–షర్టుపైన 'భవిష్యత్తు ఏఐ.. అమెరికా–ఇండియా' అని రాసి ఉండటం విశేషం. భారత్–అమెరికా భాగస్వామ్యం 21వ శతాబ్దంలో ప్రపంచ భవిష్యత్తును సమూలంగా మార్చగలదని నరేంద్ర మోదీ ప్రవాస భారతీయులను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో పేర్కొన్నారు.

**విదేశీగడ్డపై నినదించిన మోదీ**

–జీవనవిధానం : భారతదేశం ప్రపంచంలోని అన్ని విశ్వాసాలకు నిలయం. అన్ని విశ్వాసాలను మేం పాటిస్తాం. భారతదేశంలో, వైవిధ్యం సహజమైన జీవన విధానం, నేడు ప్రపంచం భారతదేశం గురించి మరింత ఎక్కువగా తెలుసుకోవాలనుకుంటోంది.

**భిన్నత్వంలో ఏకత్వం:** మాకు 2,500 రాజకీయ పార్టీలు ఉన్నాయి. దాదాపు 20 వేర్వేరు పార్టీలు భారతదేశంలోని వివిధ రాష్ట్రాలను పరిపాలించాయి. మాకు 22 అధికారిక భాషలు, వేలాది మాండలికాలు ఉన్నాయి. అయినప్పటికీ మేము ఒకే స్వరంలో మాట్లాడతాం.

**ప్రపంచం అంతా ఒకే కుటుంబం :** మేం 'వసుధైవ కుటుంబం' నినాదంతో జీవిస్తున్నాం. ప్రపంచం అంతా ఒకే కుటుంబం అని మేం విశ్వసిస్తాం. అదే స్ఫూర్తితో జీ–20 సమ్మిట్‌లో ఒక భూమి, ఒక కుటుంబం, ఒక భవిష్యత్తు అన్న నినాదాన్ని సిద్ధం చేశాం. శాంతి పరిరక్షకుల గౌరవార్థం స్మారక గోడను నిర్మించాలని గత వారం యూఎన్‌లో మేం చేసిన ప్రతిపాదనలో అన్ని దేశాలు చేరాయి .

**ఆధునిక మహిళ :** ఆధునిక భారతదేశంలో మహిళలు మనల్ని మంచి భవిష్యత్తు వైపు నడిపిస్తున్నారు. భారతదేశ దార్శనికత కేవలం మహిళలకు ఉపయోగపడే అభివృద్ధి మాత్రమే కాదు. ఇది మహిళల నేతృత్వంలోని అభివృద్ధి, ఇక్కడ మహిళలు ప్రగతి పథంలో నడిపిస్తారు. ఒక మహిళ నిరాడంబరమైన గిరిజన నేపథ్యం నుండి మా దేశాధినేతగా ఎదిగారు.

**అభివృద్ధి చెందుతున్న భారత్ :** ప్రధాని హోదాలో మొదటిసారిగా అమెరికాను సందర్శించినప్పుడు, భారతదేశం ప్రపంచంలో 10వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంది. నేడు, అది 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. త్వరలో 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుంది. మేం పెద్దగా పెరగడమే కాకుండా వేగంగా కూడా ఎదుగుతున్నాం. భారతదేశం ఎదుగుతుంటే ప్రపంచం మొత్తం అభివృద్ధి చెందుతుంది

**వాతావరణ పరిరక్షణలో భారత్ :** పారిస్ నిబద్ధతను నెరవేర్చిన ఏకైక జీ–20 దేశంగా మేము అవతరించాం. 2030 లక్ష్యం కంటే 9 సంవత్సరాల ముందు ఇంధన వనరుల్లో 40%కి పైగా పునరుత్పాదక వనరులు కలిగి ఉన్నాం. మేం అక్కడితో ఆగిపోలేదు. గ్లాస్గో సమ్మిట్లో మిషన్ లైఫ్‌ని ప్రతిపాదించాను.

**భారత, అమెరికాల మధ్య సాగిన ఒప్పందాలు**

జనరల్ ఎలక్ట్రికల్స్ సంస్థ ఇండియాకు చెందిన హిందూస్థాన్ ఎయిరో నాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)తో కలిసి ఇంజన్ల తయారీకి ఒప్పందం కుదుర్చు కుంది. ఇది ఎయిర్ ఫోర్స్‌లోని ఫైటర్ జెట్స్‌కు ఉపకరిస్తుంది. దీనిని చారిత్రక ఒప్పందంగా చెప్పుకోవాలి. అమెరికాకు తన జెట్ ఇంజన్ టెక్నాలజీని భారత్ తో పంచుకోటానికి సిద్ధం కావటం సాధారణ అంశం కాదు. దాదాపు 80 శాతం టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ జరుగుతుందని చెబుతున్నారు. మూడేళ్లలో తొలి జెట్ మార్కెట్లోకి వస్తుంది. ఇది అమెరికన్ నేవీ ఫైటర్ జెట్స్‌కు వర్క్‌హార్స్‌గా ఉండే ఎఫ్414 టెక్నాలజీ. భవిష్యత్తులో అది తేజాస్ 2 టెక్నాలజీగా మనం చెప్పుకోవచ్చు.



భవిష్యత్తులో అమెరికాలో సెమికండక్టర్ పవర్ హౌస్‌గా భారత్ మారనుంది. ఇప్పటి వరకూ అమెరికా ఈ రంగంలో చైనాపై ఆధారపడుతోంది. యూఎస్ చిప్ మేకర్ మైక్రాన్ టెక్నాలజీ 800 మిలియన్ డాలర్ల పెట్టుబడితో 2.75 బిలియన్ డాలర్ల సెమీ కండక్టర్ల అసెంబ్లీ, టెస్టింగ్ ప్లాంట్ ఏర్పాటు చేస్తుంది. అప్లైడ్ మెటీరియల్స్ సంస్థ తన సెమికండక్టర్ సప్లయ్ చైన్ నిమిత్తం సెమీ కండక్టర్ ప్లాంటు ఏర్పాటు చేస్తానని ప్రకటించింది.

మోదీ పర్యటన సందర్భంగా అమెరికా, హెచ్1బీ

వీసాదారులకు వరాన్ని ప్రకటించింది. వీసా రెన్యూవల్‌కు వాళ్లు తిరిగి భారతదేశం వెళ్లనవసరం లేదు. ఎక్కడి వాళ్లు అక్కడే దరఖాస్తు చేసుకోవచ్చు. హెచ్1బీ, ఎల్ స్కిల్డ్ వీసాదారులు.. 2024 సంవత్సరంలో ఈ ప్రయోజనం పొందవచ్చని చెప్పారు. అమెరికా కొత్త కాన్సులేట్‌లు బెంగళూరు, అహ్మదాబాద్‌లలో త్వరలో తెరుస్తారని పీఎం వెల్లడించారు.

యూఎస్ కేంద్రంగా ఉన్న ఆర్టెమిస్ ఎకార్డ్స్‌లో భారత్ చేరింది. భారత అంతరిక్ష సంస్థ ఇస్రో, 2024లో ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ ఏర్పాటు చేయటానికి నాసాతో ఒప్పందం కుదుర్చుకుంది.

ఇండో పసిఫిక్‌లో చైనాను దీటుగా ఎదుర్కోవటానికి భారత్ తగినదని అమెరికా భావిస్తోంది. ప్రపంచంలో భారత్ స్థానాన్ని పదిలపరచటానికి ఈ పర్యటన దోహద పడుతుందని భావిస్తున్నారు.

అమెరికా-ఇండియ ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతం అవడానికి ఈ ఒప్పందాలు దోహదం చేశాయని రెండు దేశాల నేతలు ప్రకటించారు.



**పారిశ్రామిక దిగ్గజాలతో భేటీ**

వివిధ కంపెనీల అధినేతలు... ఎలెన్ మాస్క్, అమెజాన్ సీఈవో, గుగూల్ సీఈవో సుందర్ పిచాయ్, మైక్రోసాఫ్ట్ సత్య నాదెళ్ళ వారు ప్రధానిని కలిశారు. ఈ భేటీల అనంతరం భారత్‌లోకి పెట్టుబడులు వరదలా వచ్చి పడ్డాయి.

ఈ కామర్స్ దిగ్గజం అమెజాన్ రానున్న ఏడేళ్లలో భారత్‌లో 15 మిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టనుంది. దాంతో భారత్‌లో దాని పెట్టుబడులు 26 మిలియన్ డాలర్లకు చేరతాయి. ఇక గుజరాత్ కేంద్రంగా గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ టెక్ కంపెనీ (గిఫ్ట్ సిటీ)లో గూగుల్ ఫైనాన్షియల్ టెక్నాలజీ ఆపరేషన్ సెంటర్‌ను ప్రారంభించేందుకు సత్య నాదెళ్లతో చర్చలు సాగాయి. దీనితో పాటు ఇండియా డిజిటలైజేషన్ ఫండ్ పేరుతో 10 బిలియన్ డాలర్లను అది ఇన్వెస్ట్ చేయనుంది. ఫిన్ టెక్ ఆపరేషన్ సెంటర్లో దేశీయంగా ఇతర సంస్థలకు కావలసిన ఆర్థిక సేవల్ని గూగుల్ అందించనుంది. అమెజాన్‌లో 10 మిలియన్ల చిన్న వ్యాపారాలను డిజిటలైజ్ చేస్తామని, 2025 నాటికి భారత్‌లో 20 మిలియన్ల ఎగుమతులను చేపట్టేందుకు 2 మిలియన్ ఉద్యోగాలను సృష్టిస్తామని ఆ సంస్థ ప్రకటించింది.

**మేధావులతో చర్చలు**

మేధావులు, విద్యావేత్తలు, బిజినెస్ లీడర్లు, ఇన్వెస్టర్లు, వివిధ రంగాల ప్రముఖులతో వేర్వేరుగా మోదీ భేటీ అయ్యారు. ముందుగా ఆర్థికవేత్త, నోబెల్ విజేత ప్రొఫెసర్ పాల్ రోమర్‌తో సమావేశమయ్యారు. ఆధార్, డీజీ లాకర్ వంటి అంశాల్లో భారత్ సాధించిన ప్రగతిపై చర్చించారు. పట్టణాభివృద్ధిలో తీసుకుంటున్న చర్యలపైనా రోమర్‌తో చర్చించానని మోదీ చెప్పారు. భారత్‌లో పెట్టుబడులు పెట్టవలసిందిగా బ్రిడ్జి వాటర్ అసోసియేట్స్ సహవ్యవస్థాపకుడు, ఇన్వెస్టర్ రేడాలియాను కోరారు. అంతరిక్ష పరిశోధనల్లో భారత్ ప్రగతిపైన ఆస్ట్రో ఫిజిస్ట్ నీల్ గ్రేస్ టైసన్‌తో, బుద్ధిజం పరిరక్షణకు సంబంధించి అమెరికన్ బుద్ధిస్ట్ స్కాలర్ ప్రొఫెసర్ రాబర్ట్ తుర్మన్‌తోనూ చర్చించారు. ప్రపంచ సవాళ్లకు బుద్ధిజం విలువలు ఆశాదీపాలుగా నిలుస్తాయని ఈ సందర్భంగా మోదీ అభిప్రాయపడ్డారు. గ్రామీ అవార్డు విజేత, ఇండియన్ అమెరికన్ సింగర్ ఫల్గుణి షా కలిసినప్పుడు ఆమె 'అబెండెన్స్ ఇన్ మిలెట్స్' పాటను మోదీ మెచ్చుకున్నారు. అమెరికన్ మ్యాథమెటీషియన్ నసీమ్ నికోలస్ తలోబ్ తో భేటీలో భారత్ స్టార్టప్ ఇకో సిస్టమ్‌పై ఆయన చర్చించారు.

ఈ కామర్స్ దిగ్గజం అమెజాన్ రానున్న ఏడేళ్లలో భారత్‌లో 15 మిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టనుంది. దాంతో భారత్‌లో దాని పెట్టుబడులు 26 మిలియన్ డాలర్లకు చేరతాయి. ఇక గుజరాత్ కేంద్రంగా గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ టెక్ కంపెనీ (గిఫ్ట్ సిటీ)లో గూగుల్ ఫైనాన్షియల్ టెక్నాలజీ ఆపరేషన్ సెంటర్‌ను ప్రారంభించేందుకు సత్య నాదెళ్లతో చర్చలు సాగాయి. దీనితో పాటు ఇండియా డిజిటలైజేషన్ ఫండ్ పేరుతో 10 బిలియన్ డాలర్లను అది ఇన్వెస్ట్ చేయనుంది.




**అమెరికా నుంచి ఈజిప్టుకి..**

అమెరికా పర్యటన ముగించిన అనంతరం మోదీ కైరో వెళ్లారు. ఈజిప్టు ప్రధాని మోస్తఫా మడ్ బౌలీ ఆయనకు ఘన స్వాగతం పలికారు. వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధన సమస్య, ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యంపైన చర్చించారు. అరబ్ దేశం అత్యున్నత గౌరవం 'ఆర్డర్ ఆఫ్ ది నైల్' అవార్డును మోదీ అందుకున్నారు. ఇది ఆయన అందుకున్న 13వ అత్యున్నత రాష్ట్ర గౌరవం ఇది. ఆరు రోజుల అమెరికా, ఈజిప్టు పర్యటనలను ముగించుకుని మోదీ జూన్ 26వ తేదీ తెల్లవారు జామున భారత గడ్డపై కాలుమోపారు. ★




# క్రీడాస్ఫూర్తికి వయసుతో పనేమిటి..!

**వయసును జయించిన క్రీడాకారుల సంఖ్య రానురాను పెరిగిపోతోంది. టెన్నిస్, ఫుట్ బాల్ లాంటి క్రీడల్లోనే ఇది ఎక్కువగా కనిపిస్తోంది. భారతటెన్నిస్ డబుల్స్ స్పెషలిస్ట్ రోహన్ బొపన్న 43 సంవత్సరాల వయసులోనూ, భారత ఫుట్‌బాల్ కెప్టెన్ సునీల్ ఛెత్రీ 38 సంవత్సరాల వయసులోనూ రాణిస్తూ ప్రతిభకు వయసుతో ఏ మాత్రం సంబంధం లేదని నిరూపిస్తున్నారు.**

మంచి వయసులో ఉన్న వారే క్రీడాకారులుగా రాణించగలరనుకోవడం కంటే పొరపాటు మరొకటి లేదు. రెండుదశాబ్దాలుగా భారత టెన్నిస్ సింగిల్స్, డబుల్స్ విభాగాలలో అపురూప విజయాలు అందించిన రోహన్ బొపన్న 43 సంవత్సరాల లేటు వయసులోనూ అంతర్జాతీయ టైటిల్స్ సాధిస్తూ వారేవ్వా! అనిపించుకొంటున్నాడు. డేవిస్ కప్, ఆసియా క్రీడలు, ఒలింపిక్స్‌తో పాటు గ్రాండ్ స్లామ్ (ఆస్ట్రేలియన్, ఫ్రెంచ్, వింబుల్డన్, యూఎస్ ఓపెన్‌తో) టెన్నిస్ టోర్నీలలోనూ 23 సంవత్సరాలుగా రాణిస్తూ దేశానికే గర్వకారణంగా నిలిచాడు.

2002 నుంచి భారత్ డేవిస్ కప్ జట్టులో కీలక సభ్యుడిగా సింగిల్స్, డబుల్స్‌లో పలు మ్యాచ్‌ల్లో ప్రాతినిధ్యం వహించాడు. లియాండర్ పేస్, మహేశ్ భూపతి, సానియా మీర్జాల తరువాత అత్యధిక 'ప్రో' టైటిల్స్ సాధించినది రోహన్ మాత్రమే. భారత డేవిస్ కప్ జట్టులో సభ్యుడిగా తొలిమ్యాచ్ ఆడిన రోహన్ గత సీజన్ వరకూ మొత్తం 32మ్యాచ్ లు ఆడాడు. ఆఖరి డేవిస్ కప్ మ్యాచ్‌కు సిద్ధమవుతున్నాడు.

భారత ఫుట్ బాల్ కెప్టెన్ సునీల్ ఛెత్రీ 38 ఏళ్ల వయసులోనూ కుర్రాడిలా మ్యాచ్‌లు ఆడేస్తూ అబ్బుర పరుస్తున్నాడు. గత 18 సంవత్సరాలుగా తన ఆట తీరుతోనే భారత ఫుట్ బాల్ అస్థిత్వాన్ని కాపాడుతూ వస్తున్నాడు. గోవా, మహారాష్ట్ర, బెంగాల్, ఈశాన్య భారత రాష్ట్రాలకు మాత్రమే పరిమితమైన ఫుట్ బాల్ బుడిబుడి అడుగుల దశలోనే ఉంది. అయితే భారత్ ఫుట్‌బాల్ చరిత్రను తిరగేస్తే... వంద అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన వారు ఇద్దరంటే ఇద్దరే కనిపిస్తారు.

బైచుంగ్ భూటియా (సిక్కిం) జాతీయ ఫుట్ బాల్‌కు దశాబ్దం పాటు అసమాన సేవలు అందించి రిటైర్మెంట్ ప్రకటించగా, కెప్టెన్ సునీల్ చెత్రీ ఆ స్థానాన్ని భర్తీ చేస్తూ వస్తున్నాడు. కేరళ స్ట్రయికర్ విజయన్, ఆ తర్వాత బైచుంగ్ భూటియా...ఈ ఇద్దరి వారసుడుగా సునీల్ చెత్రీ మాత్రమే అంతర్జాతీయ స్థాయి ఫుట్‌బాలర్లుగా గుర్తింపు పొందారు. మనదేశం తరపున వందకు పైగా అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడి 91 గోల్స్ సాధించిన ఏకైక ఆటగాడు సునీల్ మాత్రమే.నేపాల్ తో ముగిసిన గ్రూప్ లీగ్ మ్యాచ్ వరకూ 23 గోల్స్ సాధించడం ద్వారా మాల్దీవుల కెప్టెన్ అలీ అష్ఫాక్ రికార్డును.. సునీల్ అధిగమించడం ఖాయంగా కనిపిస్తోంది.

గ్రాండ్ స్లామ్ టెన్నిస్ చరిత్రలో సెర్బియా ఆటగాడు సెర్బియన్ థండర్ నొవాక్ జోకోవిచ్ (36) ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ నెగ్గడం ద్వారా తనకుతానే సాటిగా నిలిచాడు. 23 గ్రాండ్ స్లామ్ సింగిల్స్ టైటిల్స్ నెగ్గిన తొలిఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. ఆధునిక టెన్నిస్ దిగ్గజాలు రోజర్ ఫెదరర్, రాఫెల్ నదాల్ సాధించలేని గ్రాండ్ రికార్డును జోకోవిచ్ సాధించాడు. 2023 సీజన్ ఫ్రెంచ్ ఓపెన్ సింగిల్స్ టైటిల్ మూడోసారి కైవసం చేసుకోడం ద్వారా 23 గ్రాండ్ స్లామ్ టైటిల్స్ నెగ్గిన తొలి ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. గ్లోబల్ గేమ్ టెన్నిస్‌లో జోకోవిచ్ సాధించినన్ని అరుదైన ఘనతలు, అసాధారణ విజయాలు మరే ఆటగాడు సాధించలేదు.

రోజర్ ఫెదరర్, రాఫెల్ నదాల్ లాంటి దిగ్గజ ప్రత్యర్థుల నుంచి ఓ వైపు గట్టిపోటీ ఎదుర్కొంటూ, వ్యక్తిగత సమస్యలతో మరోవైపు సతమతమైనా, పడుతూలేస్తూ తన కెరియర్‌ను కొనసాగిస్తూ వచ్చిన జోకోవిచ్ అనుకొన్న లక్ష్యాన్ని సాధించడం ద్వారా గ్రాండ్ స్లామ్ టెన్నిస్ శిఖరంగా నిలిచాడు.

టెన్నిస్ పురుషుల చరిత్రలో 'కెరీర్ గ్రాండ్‌స్లామ్' (నాలుగు వేర్వేరు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గిన) ఘనతను రెండుసార్లు చొప్పున సాధించిన ఆటగాళ్లలో ఆస్ట్రేలియా దిగ్గజాలు రాయ్ ఎమర్సన్ (1967), రాడ్ లేవర్ (1969) మాత్రమే ఉన్నారు. అయితే... పారిస్‌లో ముగిసిన 2023 ఫ్రెంచ్ ఓపెన్ పైనల్లో విజేతగా నిలవడం ద్వారా 3వ సీడ్ జోకోవిచ్ తన గ్రాండ్ స్లామ్ టైటిల్స్ సంఖ్యను 23కు పెంచుకొన్నాడు. ఇప్పటి వరకూ నదాల్ 22, రోజర్ ఫెదరర్ 21 గ్రాండ్ స్లామ్ టైటిల్స్ మాత్రమే సాధించగా.. ఈ ఇద్దరిని అధిగమించడం ద్వారా జోకోవిచ్ 23 టైటిల్స్ నెగ్గిన తొలి ప్లేయర్‌గా తనకుతానే సాటిగా నిలిచాడు.

జోకోవిచ్ తన రెండుదశాబ్దాల కెరియర్‌లో 10సార్లు ఆస్ట్రేలియన్, 3 సార్లు యూఎస్ ఓపెన్, 7 సార్లు వింబుల్డన్, 3 ఫ్రెంచ్ ఓపెన్‌లతో కలుపుకొని మొత్తం 23 గ్రాండ్ స్లామ్ టైటిల్స్ తో అగ్రస్థానంలో నిలిచాడు. 23 గ్రాండ్ స్లామ్ టైటిల్స్ సహా మొత్తం 90 టోర్నీలు నెగ్గడం ద్వారా 1000 కోట్ల రూపాయలకు పైగా ప్రైజ్ మనీ ఆర్జించాడు. 2023 గ్రాండ్ స్లామ్ సీజం లో ఇప్పటికే రెండు టోర్నీలలో విజేతగా నిలిచిన జోకోవిచ్ మిగిలిన రెండు (వింబుల్డన్, యూఎస్ ఓపెన్) టైటిల్స్ నెగ్గినా ఆశ్చర్యపోనక్కరలేదు. ★




**క్రీడా కృష్ణ, 84668 64969**

సీనియర్ జర్నలిస్ట్




ఒడిశాలో ఇటీవల జరిగిన ఘోర రైలు ప్రమాదం దేశవ్యాప్తంగా తీరని దుఃఖాన్ని మిగిల్చింది. ఈ ప్రమాదంలో వందల మంది మృతిచెందగా, వేల సంఖ్యలో ప్రయాణికులు గాయపడ్డారు. అయితే ఈ ప్రమాదం సందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు మరోసారి తమ దేశభక్తిని, మానవత్వాన్ని చాటుకున్నారు. ప్రమాద స్థలంలో గాయపడిన వారిని రక్షించి ఆసుపత్రులకు తరలించడంతో పాటు రక్తదానం చేసి, గాయపడ్డ ప్రయాణికుల ప్రాణాల్ని నిలబెట్టారు.

# ఆపద్బాంధవుల్లా వచ్చారు..



బాలేశ్వర్ జిల్లా బాహనాగ రైల్వేస్టేషన్ దగ్గర జూన్ 2న ఈ రైలు ప్రమాదం జరిగింది. దీనికి సమీపంలోనే ఆర్.ఎస్.ఎస్. (సంఘ) శాఖ ఉన్నది. రైలు ప్రమాదం వార్త తెలియగానే సాయంత్రం 7.15 ని.లకు స్వయంసేవకులు ప్రమాద స్థలానికి వేగంగా చేరుకున్నారు. వీరితోపాటు స్థానికులు కూడా వచ్చారు. అప్పటికి ఇంకా NDRF, SDRF బృందాలు చేరుకోలేదు. స్వయంసేవకులు ఆలస్యం చేయకుండా సెల్‌ఫోన్ వెలుతురు సహాయంతోనే ప్రయాణికులను రక్షించే కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. మరికొంత సేపటికే కొందరు స్వయంసేవకులు ఎమర్జెన్సీ లైట్లు తీసుకొని వచ్చారు. రైళ్లలో చిక్కుకుపోయిన వారిని రక్షించేందుకు స్వయంసేవకుల దగ్గర సాధనాలు ఏమీ లేకపోవడంతో కొంత ఇబ్బంది జరిగింది. కాసేపటికి మరికొందరు స్వయంసేవకులు గొడ్డళ్లు, రాడ్‌లు, చేతి పనిముట్లు తీసుకు రావటంతో వాటి సహాయంతో చిక్కుకున్న ప్రయాణికుల్ని బయటకు తీశారు. గాయపడ్డవారిని ఆసుపత్రులకు ఎలా తరలించాలో అర్థం కాలేదు. అప్పటికి ఇంకా అంబులెన్సులు రాలేదు. దీంతో స్వయంసేవకులు బైకులు, ఆటోలు, ట్రాక్టర్లను తీసుకొచ్చి సమీపంలోని ఆసుపత్రులకు తరలించడం ప్రారంభించారు. ఇంతలో ఖంతాపడా హాస్పిటల్ నుండి 2 అంబులెన్స్‌లు వచ్చాయి. తర్వాత ప్రభుత్వ యంత్రాంగం అంబులెన్స్‌లను రప్పించే పనిలో నిమగ్నమయింది.

ఈ వార్త క్రమంగా చుట్టుపక్కల జిల్లాలకు చేరింది. బాలేశ్వర్‌తో పాటు భద్రక్ జిల్లా స్వయంసేవకులు కూడా వచ్చి సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ప్రమాదం జరిగిన కాసేపటికి 14-15 మంది ఉన్న స్వయంసేవకుల సంఖ్య రాత్రి అయ్యే సరికి 250 మందికి పెరిగింది. ప్రభుత్వ యంత్రాంగం కూడా సహాయక బృందాల సంఖ్యను పెంచడంతో ఇద్దరు కలిసి సహాయక చర్యల్ని వేగవంతం చేశారు. సంఘ సహ విభాగ్ ప్రచారక్ విష్ణునాయక్ ఘటన స్థలంలోనే ఉండి స్వయంసేవకులకు అండగా నిలిచారు.

**స్వయంసేవకుల ధైర్య, సాహసాలు**

రైలు ప్రమాదంలో 3 భోగీలు ఒకదానిపై ఒకటి పడి ఉన్నాయి. ఆ స్థితిలో చిక్కుకున్న ప్రయాణికుల్ని రక్షించడం చాలా కష్టం. సహాయక బృందాలు కూడా భోగీలపైకి ఎక్కడానికి భయపడుతున్నాయి. కానీ బాలేశ్వర్ జిల్లాకు చెందిన స్వయంసేవక్ రమేష్‌తో పాటు కొందరు ప్రాణాలు లెక్కించకుండా భోగీలపైకి ఎక్కి లోపల ఉన్న ప్రయాణికులను బయటకు తీశారు. ఆ తర్వాతనే NDRF బృందాలు భోగీల పైకి ఎక్కడం ప్రారంభించాయి. రమేష్ ధైర్య, సాహసాన్ని చూసి ఎన్డీఆర్ఎఫ్ బృందాలు కూడా ఆశ్చర్యపోయాయి.

**ఆసుపత్రుల్లో కూడా అండగా నిలిచారు!**

ఒక్కసారిగా హాస్పిటల్స్‌కు ఇంతమంది చేరడంతో ఆసుపత్రుల్లో సౌకర్యాలు సరిపోలేదు. దీంతో కొంతమంది స్వయంసేవకులు ఆసుపత్రులకు చేరుకొని అక్కడ ఆసుపత్రి సిబ్బందిగా అండగా నిలిచారు. గాయపడిన ప్రయాణికులను హాస్పిటల్స్‌కు చేర్పించిన తర్వాత వారి అవసరాలు తీర్చడం, అవసరమైన మందులు అందుబాటులో ఉంచడం, అవసరమైనంత మేరకు రక్తం సేకరించడం, ప్రయాణికుల బంధువులకు తక్షణమే సమాచారం ఇవ్వడం మొదలగు పనులన్నింటినీ స్వయంసేవకులు దగ్గర ఉండి పూర్తిచేశారు. బాలేశ్వర్ విభాగ్ ప్రచారక్ చంద్రశేఖర్ మహాపాత్ర బాలేశ్వర్ జిల్లా కేంద్ర హాస్పిటల్‌లోనే ఉండి



అన్ని సేవా కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఇలాగే భద్రక్ జిల్లా కేంద్ర హాస్పిటల్‌లో, మరికొన్ని ఆసుపత్రుల్లోనూ స్వయంసేవకులు దగ్గర ఉండి సేవా కార్యక్రమాలు చేశారు. కటక్‌లోని S.C.B మెడికల్ కళాశాల హాస్పిటల్‌లో కూడా స్వయంసేవకులు ఒక సేవా విభాగాన్ని ఏర్పాటుచేసి అక్కడ చేర్పించిన ప్రయాణికులకు సపర్యలు చేశారు. ఈ పనుల్ని క్షేత్ర సేవా ప్రముఖ్ జగదీశ్, ప్రాంత సేవా ప్రముఖ్ శంతన్ పర్యవేక్షిం చారు. కటక్ నగరంలో హిందూ జాగరణ మంచ్ కూడా సహాయ కార్యక్రమాలు చేపట్టింది. బజరంగదళ్ ద్వారా కటక్‌లో విశేషంగా రక్తదాన కార్యక్రమం జరిగింది.

**రక్తదానం కోసం వేల మంది..**

గాయపడిన ప్రయాణికుల కోసం స్వయంసేవకులు రక్తాన్ని ఇస్తూనే మరోవైపు ఇతరుల ద్వారా కూడా రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వాట్సప్ గ్రూప్‌ల ద్వారా సందేశాలు పంపడంతో వేల సంఖ్యలో స్వయంసేవకులు వచ్చి రక్తదానం చేశారు. ఈ విధంగా రాత్రికి రాత్రే రక్తదానం చేసేందుకు వచ్చిన ఉత్సాహవంతులైన యువకులను చూసి వైద్యులు ఆశ్చర్యపోయారు. ప్రమాదం జరిగిన మరుసటి రోజు మరణాల సంఖ్య పెరిగింది. గాయపడినవారి ఏడుపులు, మృతిచెందిన వారి కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు విన్న స్వయంసేవకులు చలించిపోయారు. చనిపోయిన వారి మృతదేహాల్ని స్వయంసేవకులే పాలీథిన్ సంచుల్లో చుట్టి అంబులెన్స్‌ల్లో ఎక్కించే బాధ్యతను నిర్వహించారని ప్రాంత ప్రచార ప్రముఖ్ రవినారాయణ పండా అన్నారు.

**హెల్ప్‌లైన్ సేవను ప్రారంభించిన సంఘం**

దుర్ఘటన జరిగిన తర్వాత రైలు ప్రయాణికుల బంధువుల సమాచారం కోసం ఆర్.ఎస్.ఎస్. ఆధ్వర్యంలో ఉచిత 24 గంటల హెల్ప్‌లైన్ నెంబర్‌ను వెంటనే ప్రారంభించారు. దీని ద్వారా వందలాది మందికి సహాయం అందించారు. ప్రమాదం జరిగిన రోజు తాగునీటితో పాటు వెయ్యిమందికి పండ్లు, పాలు, బ్రెడ్ అందించారు. ఆ మరుసటి రోజు గాయపడిన వారికి, వారి బంధువులకు 2500 భోజన ప్యాకెట్లు అందించారు. ఈ దుర్ఘటన జరిగిందని తెలిసిన వెంటన్ జూన్ 4న బాలేశ్వర్‌లో జరగాల్సిన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర అభ్యాస వర్గ వాయిదా వేస్తున్నట్లు ప్రాంత సంఘటన మంత్రి సూచించారు. ఏబీవీపీకి చెందిన 300 మందికి పైగా కార్యకర్తలు ప్రమాదంలో గాయపడిన వారికి సేవలందించడంతో పాల్గొన్నారు. గాయపడిన వారికి, వారి బంధువులకు భోజన సదుపాయం కల్పించడం, అలాగే ప్రయాణికులను వెతుక్కో వడంలో ఇబ్బందిపడుతున్న బంధువులకు అన్ని రకాల సహాయాన్ని అందించడంలో నిమగ్నమయ్యారు. 389 మంది కార్యకర్తలు రక్తదానం చేశారు.

**శిశుమందిర్ ఆచార్యులు కూడా...**

ఈ ప్రమాదం జరిగిన వెంటనే సరస్వతీ శిశుమందిర్ ఆచార్యులు, విద్యార్థులు గాయపడిన వారి కోసం బాలేశ్వర్, భద్రక్, కటక్ జిల్లాలలో మొత్తం 20 స్థలాలలో సహాయక కార్యక్రమాల్ని ప్రారంభిం చారు. హాస్పిటల్‌లో చేరినవారికి భోజనం అందివ్వడంతో పాటు 167 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ★





# ఒకటి రుధిరం.. మరొకటి తిమిరం!!



భరతజాతి యావత్తు తరతరాలుగా సగర్వంగా గుర్తుచేసుకుని ఉప్పొంగిపోయే స్వాతంత్ర్య సంగ్రామంలోని మరపురాని ఘట్టాలతో ఒకటి, స్వతంత్ర భారతావని ఎంతగా మరచిపోవాలనుకున్నా పీడకలలా వెంటాడి వేధించి గుర్తుకొచ్చి గగుర్పొడిచేలా చరిత్రను కమ్మేసిన చిమ్మచీకటి రోజుల దురదృష్ట ఎమర్జెన్సీ కాలాన్ని అక్షరీకరించిన ప్రయత్నం మరొకటి. రెండు పుస్తకాలు! ఒకటి 'కాలరేఖలు', రెండోది 'ఆంక్షాపర్వం'. సీనియర్ పాత్రికేయుడు, సృజనాత్మక రచయిత డా. గోపరాజు నారాయణరావు రాసిన ఈ పుస్తకాల విడుదలకు హైదరాబాద్ ప్రెస్ క్లబ్ వేదిక అయింది. ఎమర్జెన్సీ ప్రకటన 48 సంవత్సరాలు పూర్తి చేసుకున్న రోజు, సమున్నతశ్రేణి సంపాదకులు, స్వాతంత్ర్య సమరయోధులు, రచయిత ముట్నూరి కృష్ణారావు వర్ధంతి అయిన రోజు (జూన్ 25) ఒకటే కావడం, అదే రోజున ఈ పుస్తకాలు విడుదల కావడం విశేషం.

వయోధిక పాత్రికేయ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సీనియర్ జర్నలిస్ట్ దాసు కేశవరావు సభాధ్యక్షులు. పట్నా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి ముఖ్యఅతిథి. కాలరేఖలు పుస్తకాన్ని ఆవిష్కరించి, ఆంక్షాపర్వం పుస్తకాన్ని విశ్లేషించారు ప్రఖ్యాత పత్రికా సంపాదకులు కె. రామచంద్రమూర్తి. 'దేశ కాలగమనాన్ని ఒక మలుపు తిప్పిన ఎమర్జెన్సీ గురించి ఇంత వివరంగా, లోతుగా అధ్యయనం చేసిన పుస్తకం ఇంతవరకు రాలేదని; విశ్వవిద్యాలయాలు, పరిశోధనా పీఠాలు తలకెత్తుకోవాల్సిన పనిని డాక్టర్ నారాయణరావు ఒక్కరూ కేవలం తన అభిరుచితో చేశారు' అన్నారు రామచంద్రమూర్తి. ఆ కాలంలో వాస్తవాలను ప్రజలకు చేర్చడానికి పత్రికలు ఎన్ని అవస్థలు పడ్డాయో, ఎన్ని అణచివేతలను తట్టుకుని నిలబడ్డాయో, ఎన్ని త్యాగాలకు తెగబడ్డాయో గుర్తుచేశారు.

జస్టిస్ నరసింహారెడ్డి.. ప్రజాస్వామ్య హక్కులను హరించిన ఎమర్జెన్సీ నాటి పరిస్థితుల్ని గుర్తుచేసుకుని, చట్టపరమైన అంశాలను ప్రస్తావించారు. ఆర్ఎస్ఎస్ అఖిలభారత కార్యకారిణి సదస్యులు భాగయ్య ఎమర్జెన్సీ కాలంలో ప్రజాస్వామ్యం కోసం ప్రజలే అసలైన పోరాటం చేశారని చెబుతూ, జైల్లో గడిపిన నాటి రోజులను గుర్తు చేసుకున్నారు. ఆర్ఎస్ఎస్ ప్రచారక్, ఏకలవ్య ఫౌండేషన్ ఫౌండర్ ఛైర్మన్ వేణుగోపాలరెడ్డి – సైద్ధాంతిక విభేదాలను పక్కనపెట్టి దేశంకోసం, ప్రజాస్వామ్యాన్ని కాపాడడం కోసం పనిచేసిన పరిస్థితుల్ని వివరించారు. ఆ కాలంలో తెలుగు ప్రాంతాల్లో ప్రాణాలను పణంగాపెట్టి రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడిన జర్నలిస్టులు ఎన్ని కష్టాలు ఎదుర్కొన్నారో, ఎలాంటి దుర్భర పరిస్థితుల్లో పనిచేశారో చెప్పారు. డా. నారాయణరావు స్పందిస్తూ – ఎమర్జెన్సీ పరిస్థితుల్ని, పర్యవసానాల్నీ జర్నలిస్టులపై జరిగిన వికృత దాడుల్ని, పాశవిక పరిణామాల్నీ వివరించారు. ఎమర్జెన్సీ నుంచి పుట్టిన బిడ్డే జనసంఘ్ (నేటి బీజేపీ) అని గుర్తుంచుకోవాలని అన్నారు. పత్రికల ధోరణుల్నీ, పత్రికల పోరాటాల్నీ చెప్పారు. ఈ కార్యక్రమంలో వయోధిక పాత్రికేయ సంఘ సభ్యులు, వివిధ పత్రికల పాత్రికేయులు పాల్గొన్నారు. ★

# బాలజాగృతి



## తెలుసుకుందాం

## వేంకటేశ్వరస్వామి ఆలయం - కురుమూర్తి



తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ జిల్లా, చిన్నచింతకుంట మండలం కురుమూర్తి గ్రామంలో శ్రీలక్ష్మీ సమేతంగా వేంకటేశ్వరస్వామి కొలువై ఉన్న ఆలయమిది. పేదల తిరుపతిగా ప్రసిద్ధి. తిరుమల వేంకటేశ్వర దేవాలయానికి, కురుమూర్తి దేవాలయానికి పోలికలున్నాయి. వైకుంఠ ఏకాదశి రోజున భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ఈ ఆలయాన్ని 1268 ప్రాంతములో ముక్కెర వంశ మూలపురుషుడు గోపాలరాయుడు నిర్మించాడు.

## కథ — అజాత శత్రువు



ధర్మపురి రాజు ప్రసేనుడికి ఒక పర్యాయం ఒక సందేహం కలిగింది.

శత్రువును జయించినవాడు గొప్పవాడా? లేక అసలు శత్రువులే లేనివాడు గొప్పవాడా? అన్నదే ఆ సందేహం.

తన సందేహ నివృత్తి కోసం ఎందరెందరో కవి పండితులను, విజ్ఞులను సంప్రదించాడు ప్రసేనుడు. అయినా సంతృప్తికరమైన సమాధానం లభించలేదు.

ఒకనాడు సర్వజ్ఞుడైన ఒక మహాయోగి హిమాలయాల నుండి విచ్చేసి, తన రాజ్యం మీదుగా వెళుతున్నాడని తెలిసి ప్రసేనుడు తన పరివారాన్ని పంపి ఆయనను గౌరవంగా తోడ్కొని రమ్మనాడు.

రాజమందిరానికి విచ్చేసిన యోగి పుంగవునికి ఉచిత రీతిన సత్కారాలు చేసి, తన సందేహం వ్యక్తం చేశాడు ప్రసేనుడు.

అందుకు ఆ యోగి పుంగవుడు ఇలా సమాధానం చెప్పాడు.

'మహారాజా! శత్రువులను

## పద్యం

**ఉరుకరుణాయుతుండు సమయోచిత మాత్మ దలంచి యుగ్రవా**
**క్కరుషతజూపినన్నలముకల్గుట తథ్యముగాదె యంబురం**
**బురిమిన యంతనే కురియకుండునె వర్షము లోకరక్షణ**
**స్థిరతర పౌరుషంబున నశేషజనంబు లెఱుంగ భాస్కరా!**

**భావం :** భాస్కరా! మేఘుడు ప్రాణంబున భయము గలుగునట్లు ఉరిమి వెంటనే జనులను రక్షించు పట్టుదలతో నానందము కలుగునట్లు వర్షించును. ఆ విధంగా మిక్కిలి దయగలవాడు సమయానుకూలంగా కఠిన వాక్యములు పల్కిననూ తదుపరి తప్పక మేలునే చేయును, కీడు మాత్రం చేయడు.

## శ్లోకం

**'సాధూనా మేకరూపతా'**

**'యథా చిత్తం తథా వాక్త, యథా వాచ స్తథా క్రియాః**
**చిత్తే వాచి క్రియాయాం చ, సాధూనా మేకరూపతా'**

**భావం :** మనసును బట్టే మాట, మాటను బట్టి క్రియ. మనసు, మాట, పనిలో ఏకరూపత గలవారే సాధు పురుషులు.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| డబ్బు | విధం |
| నిశ్శబ్దం | సమానం |
| సాటి | నీరు |
| సలిలం | ధనం |
| వైనం | మౌనం |

సమాధానాలు : డబ్బు-ధనం; నిశ్శబ్దం-మౌనం; సాటి-సమానం; సలిలం-నీరు; వైనం-విధం.

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### కనకలతా బారువా

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు. డిసెంబర్ 22, 1924న అస్సాంలోని దరాంగ్ జిల్లా బోరంగబరి గ్రామంలో జన్మించారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో జరిగిన ఊరేగింపులో భారత జాతీయ పతాకాన్ని పట్టుకున్నందుకు బ్రిటిష్ పోలీసులు సెప్టెంబరు 20న ఆమెను కాల్చి చంపారు. కేవలం 18 ఏళ్లకే స్వాతంత్ర్యం కోసం ప్రాణం త్యాగంచేసిన ధీరవనిత బారువా.



## జనరల్ నాలెడ్జ్

1. తెలంగాణ రాష్ట్ర పుష్పం ఏది?
2. ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖమంత్రిగా ప్రస్తుతం ఎవరు పని చేస్తున్నారు?
3. ఇటీవల విడుదలైన కేరళ స్టోరీ చిత్రానికి ఎవరు దర్శకత్వం వహించారు?

సమాధానాలు : 1. తంగేడు పువ్వు; 2. బొత్స సత్యనారాయణ; 3. సుదీప్తో సేన్.



జయించినవాడిని వీరుడు అంటారు. అసలు శత్రువులే లేని వాడిని అజాత శత్రువు అంటారు. వీరుడు గొప్పవాడే, కానీ అజాత శత్రువు అంతకంటే గొప్పవాడు. ఏ విధంగా అంటే ఇద్దరు వ్యక్తుల మధ్య శత్రుత్వం ఉండాలంటే అందుకు బలమైన కారణం ఉండాలి. శత్రువుతో యుద్ధం తలపెట్టిన నాటి నుండి మనశ్శాంతి కరువవుతుంది. సర్వశక్తులు యుద్ధం మీదే కేంద్రీకరించాలి. దీనివల్ల ప్రజలకు సాయపడే అవకాశం తగ్గుతుంది. యుద్ధం వల్ల ఎంతో ధన నష్టం, ప్రాణనష్టం కలుగుతుంది. ఇంత చేసినా జయాపజయాలు దైవాధీనాలు. అజాతశత్రువుకు ఇటువంటి చిక్కులు లేవు. అందువల్ల వీరుడి కంటే అజాత శత్రువే గొప్పవాడు' అని వివరించాడు.

ప్రసేనుడు సంతృప్తి చెందాడు. ★

## మెదడుకు మేత

బండకు కొడితే
వెండి ఊడుతుంది..
ఏమిటది?

జవాబు : కొబ్బరికాయ

## మంచిమాట

శరీర సౌందర్యం ఎంత ఉన్నా.. హృదయ సౌందర్యం లేకపోతే అంతా వ్యర్థమే!



# వారఫలాలు

03-09 జూలై 2023




సింహంభట్ల సుబ్బారావు

6300674054


**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

ఏ కార్యక్రమం చేపట్టినా విజయవంతంగా ముగిస్తారు. ఆత్మీయుల నుంచి ఆహ్వానాలు అందుకుంటారు. విద్యార్థులు కోరుకున్న అవకాశాలు పొందుతారు. ఆరోగ్యపరంగా కొంత చికాకులు తప్పకపోవచ్చు. ఉద్యోగులకు విధి నిర్వహణలో అవరోధాలు తొలగుతాయి. పారిశ్రామిక వేత్తలు, రచయితలకు యోగవంతమైన కాలమనే చెప్పాలి. 3,4 తేదీల్లో మానసిక ఆందోళన, ఆస్తి వివాదాలు, ధననష్టం. విష్ణుసహస్రనామ పారాయణ చేయండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

కార్యక్రమాలు చకచకా పూర్తి చేస్తారు. ఆర్థిక లావాదేవీలు సంతృప్తికరంగా ఉంటాయి. ఇంటాబయటా బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు. ఉద్యోగులకు ఉత్సాహవంతంగా ఉంటుంది. పారిశ్రామికవేత్తలు, వైద్యులకు అనూహ్యమైన అవకాశాలు. కళాకారులకు తగిన గుర్తింపు, ప్రోత్సాహం అందుతాయి. 4.5 తేదీల్లో దూరప్రయాణాలు. అనారోగ్యం. సోదరులతో వైరం. ఆదిత్య హృదయం పఠించండి.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

ఊహించని విధంగా కార్యక్రమాలు పూర్తి కాగలఅవకాశం. బంధువులు సైతం సమస్యల పరిష్కారంలో చేయూతనిస్తారు. ఆస్తి వ్యవహారాలు కొలిక్కి వచ్చి ఊరట చెందుతారు భవిష్యత్తుపై నిరుద్యోగు లకు కొత్త ఆశలు. వ్యాపారులకు విశేషంగా లాభి స్తుంది. రాజకీయవేత్తలు, కళాకారులకు మరిన్ని అవ కాశాలు దగ్గరకు వస్తాయి. 6,7 తేదీలలో చికాకులు. అనారోగ్యం. బంధువిరోధాలు. దుర్గాస్తోత్రాలు పఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

శుభకార్యాలపై ఆలోచనలు సాగిస్తారు. ఆత్మీయులు మరింతగా దగ్గరవుతారు. సేవాభావం పెరుగుతుంది. ఎటువంటి కార్యక్రమమైనా తేలిగ్గా పూర్తి చేస్తారు. ఇంటి నిర్మాణయత్నాలు సానుకూలం. విద్యార్థులు, నిరుద్యోగులకు కొత్త ఆశలు. వ్యాపారాలు విస్తరిస్తారు. ఉద్యోగులకు ఉన్నత హోదాలు తథ్యం. వ్యవసాయ దారులకు ఊహించని పెట్టుబడులు. 8.9 తేదీల్లో ధననష్టం. కుటుంబసమస్యలు. వివాదాలు. శివస్తోత్రాలు పఠించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. బంధువులతో వివాదాలు తీరతాయి. నిరుద్యోగులకు ఒక ప్రకటన ఆకట్టుకుంటుంది. వ్యతిరేక వర్గీయులు అనుకూలంగా మారతారు. ఉద్యోగులకు అనుకూల పరిస్థితులు ఉంటాయి. పారిశ్రామిక, రాజకీయ వేత్తలకు క్లిష్టమైన వివాదాలు తీరతాయి. 3,4 తేదీల్లో దూరప్రయాణాలు. అనారోగ్యం, ఔషధసేవనం. చోర భయం. గణపతికి అర్చన చేయించుకుంటే మంచిది.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

అనూహ్యమైన రీతిలో కార్యక్రమాలు పూర్తి చేస్తారు. కాంట్రాక్టులు పొందుతారు. ఇంటిలో వివాహాది శుభకార్యాలపై సంప్రదింపులు. పుణ్య క్షేత్రాల సందర్శనం. వ్యాపారులు కొన్ని ఆటుపోట్లు అధిగమిస్తారు. ఉద్యోగులకు విధులు ప్రశాంతంగా జరుగుతాయి. రాజకీయవేత్తలు, రచయితలకు శుభవార్తలు అందుతాయి. 5,6 తేదీలలో దూర ప్రయాణాలు. అంగారస్తోత్రం పఠించండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

పరిస్థితులు అనుకూలించి నూతనోత్సాహంతో ముందడుగు వేస్తారు. మీ ఆలోచనలు, ప్రతిపాదనలు కుటుంబసభ్యులను ఆకట్టుకుంటాయి. భూములు, వాహనాలు కొనుగోలు చేస్తారు. ఎట్టకేలకు కొత్త కాంట్రాక్టులు దక్కుతాయి. ఉద్యోగస్తులకు సమస్యల నుంచి విముక్తి. కళాకారులు, రచయితలకు శుభవార్తలు. 6,7 తేదీల్లో వృథా ఖర్చులు. శారీరక రుగ్మతలు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

అనుకున్న కార్యక్రమాలు మందకొడిగా సాగుతాయి. ఎంత కష్టపడ్డా ఫలితం కనిపించని పరిస్థితి. ఆలోచనలు స్థిరంగాఉండవు. ఆరోగ్యపరంగా చికాకులు. వ్యాపారులకు అంతగా లాభించదు. ఉద్యోగులకు మార్పులు. పారిశ్రామిక, రాజకీయవేత్తలకు నిరుత్సాహమే. వ్యవసాయదారులకు కొంత ఊరట లభిస్తుంది. 5,6 తేదీల్లో ఆకస్మిక ధనలాభం, ఆంజనేయునికి అర్చన చేయించుకుంటే మంచిది.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

కొత్త కార్యక్రమాలు పూర్తి చేసేవరకూ విశ్రమించరు. ఆలోచనలు మరింత కలసివస్తాయి. వివాహ, ఉద్యోగయత్నాలు ఫలించి ముందుకు సాగుతారు. ఉద్యోగస్తులకు విధుల్లో ప్రతిబంధకాలు తొలగుతాయి. క్రీడాకారులకు ఒక సమాచారం ఊరట నిస్తుంది. 8.9 తేదీల్లో దూరప్రయాణాలు. బంధువులతో తగాదాలు. శ్రీరామ రక్షాస్తోత్రం పఠించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

నూతనోత్సాహంతో ముందుకు సాగి అనుకున్న లక్ష్యాలు సాధిస్తారు. ఆదాయం మరింత సంతృప్తికరంగా ఉంటుంది. విద్యార్థులు, నిరుద్యోగు లకు కొంత ఊరట లభిస్తుంది. ఇంటి నిర్మాణ యత్నాలు ఎట్టకేలకు ఫలిస్తాయి. వ్యాపారస్తులకు పెట్టుబడులు సమ కూరతాయి. ఉద్యోగస్తులకు కొత్త హోదాలు రాగలవు. 3,4 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. శారీరక రుగ్మతలు. కనకధారా స్తోత్రాలు పఠించండి.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

శ్రమకు ఫలితం దక్కించుకుంటారు. ఆపదలో ఉన్న వారికి ఆపన్నహస్తం అందిస్తారు. అదనపు రాబడితో ఉత్సాహంగా గడుపుతారు. బంధువుల నుంచి అతిముఖ్య సమాచారం అందుతుంది. స్థిరాస్తి వివాదాలు పరిష్కారదశకు చేరతాయి. క్రీడాకారులకు మరిన్ని విజయాలు చేకూరతాయి. 7,8 తేదీల్లో లేనిపోని ఖర్చులు. ప్రయాణాలు. శివాలయంలో 11 ప్రదక్షిణలు చేయండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

వారమంతా శుభదాయకమైన కాలమనే చెప్పాలి. ఆర్థికంగా క్రమేపీ బలపడతారు. ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. ఇంటిలో శుభకార్యాలపై చర్చలు సఫలమవుతాయి. దీర్ఘకాలిక సమస్యలు కొన్ని పరిష్కరించుకుంటారు. నిరుద్యోగులకు ప్రయత్నాలు అనుకూ లిస్తాయి. వ్యాపారస్తులకు భాగస్వాముల నుంచి మరింత చేయూత అందుతుంది. 6,7 తేదీల్లో ఆకస్మికప్రయాణాలు. శారీరక రుగ్మతలు. ఆంజనేయ దండకం పఠించండి. ★

# పదరసం-422

## ఆధారాలు

**అడ్డం**

1. బంగారు లేడిగా వచ్చిన అసురుడు (4)
6. సత్యభామ స్వర్గం నుంచి తెచ్చిన వృక్షం (4)
8. రాసుకునే సాధనం..బలపంతో పాటే... (3)
9. ఎరుకలసాని చెప్పేది (2)
10. ఉడుత తడబడింది (3)
12. ఈ బాయి కృష్ణ భక్తురాలు (2)
13. జంటనగరాలలో ఆషాఢంలో పెద్ద జాతర (3)
14. లడ్డుకు ఈ ఊరు పేరు ప్రసిద్ధి (3)
16. కష్టాలు...ఇబ్బందులు (3)
17. మనసు, బుద్ధి (2)
21. ఓ అప్సరస (2)
23. కర్ణుడి పెంపుడు తండ్రి (3)
25. ఊగేది...నవజాత శిశువుల పడక (3)
26. ఓ దుంప కూర (2)
27. కాల ప్రమాణం...యుగం లాంటిది (2)
28. దీనిని పోసినవాడు నీరు పోయడా? (2)
29. నర్మదతో పాటే మరో నది (3)

**నిలువు**

1. ఉన్నవ లక్ష్మీనారాయణ ప్రముఖ నవల (4)
2. రెండు వైపుల పదును కలది....(4)
3. అల్లెతాడు...స్త్రీ (2)
4. పట్టుదల, శపథం (2)
5. ద్రుపద పుత్రిక (5)
6. రావూరి భరద్వాజ జ్ఞానపీఠ్ నవల (5)
7. కూతురి భర్తే (3)
9. మెట్ల వరుస...ప్రగతికి ఆధారం (4)
11. ఒక ఆయుధం (2)
13. బోధించేవాడు (4)
14. పసిడి, కనకం..(3)
15. వాలి తమ్ముడి భార్య (2)
18. అరుగు, గట్టు (2)
19. ఈర్ష్య లాంటిదే (3)
20. హరిశ్చంద్రుడి సతి (4)
22. ఎలుగుబంటి (3)
24. త్రాసు..ఒక రాశి (2)
25 పైకి పొంగు, గ్రామం (2)
26. మత్స్యం (2)

**మా చిరునామా : పదరసం, జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-27**

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | ✠ | 3 | ✠ | 4 | ✠ | 5 |
| | ✠ | | ✠ | 6 | | 7 | | ✠ | |
| 8 | | | ✠ | | ✠ | | ✠ | 9 | |
| | ✠ | | ✠ | 10 | | | ✠ | | ✠ |
| ✠ | 11 | ✠ | 12 | | ✠ | ✠ | 13 | | |
| 14 | | 15 | ✠ | | ✠ | 16 | | | ✠ |
| | ✠ | 17 | 18 | ✠ | 19 | ✠ | | ✠ | 20 |
| 21 | 22 | ✠ | | ✠ | 23 | 24 | | ✠ | |
| ✠ | | ✠ | ✠ | 25 | | | ✠ | 26 | |
| 27 | | ✠ | 28 | | ✠ | ✠ | 29 | | |

**పదరసం – 422**

పేరు : ......................................................................................

చిరునామా:......................................................................................

......................................................................................

పిన్‌కోడ్ : .................. మొబైల్ : ..................................................

**సమాధానాలను** పైగడులలో పూరించి, కత్తిరించి కవర్‌పై పదరసం నెం. వేసి 2023 జూలై 17 లోగా జాగృతికి పంపండి. సరైన సమాధానాలు రాసిన వారిని విజేతలుగా ప్రకటిస్తాం. ఒకరిని లాటరీ ద్వారా ఎంపికచేసి నగదు బహుమతి అందచేస్తాం. తుది నిర్ణయం జాగృతి యాజమాన్యందే.

## పదరసం - 418 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 అ | ల్ల | 2 సా | ని | ✠ | 3 పం | చ | 4 మ | వే | 5 దం |
| డి | ✠ | 7 త్యా | ✠ | పూ | జ | ✠ | గ | ✠ | డ |
| వి | 8 వే | కి | ✠ | ✠ | 9 రం | 10 గ | డు | ✠ | న |
| ✠ | గు | ✠ | 11 నే | ✠ | ✠ | ద్ది | ✠ | 12 నా | ✠ |
| 13 కో | ✠ | 14 తా | తా | జీ | ✠ | ✠ | 15 భా | ర | తి |
| 16 వె | ల | ✠ | జీ | ✠ | 17 మే | నా | ✠ | దు | ✠ |
| 16 ల | ✠ | 18 వి | ✠ | 19 ని | ఘా | ✠ | 20 వే | డు | 21 క |
| ✠ | 22 అ | శ్వ | ము | ✠ | ల | ✠ | దాం | ✠ | ళి |
| 23 సా | ✠ | దా | ✠ | 24 ద | య | ✠ | తి | ✠ | సీ |
| 25 ము | త్తా | త | ✠ | ధి | ✠ | 26 శ్రీ | ✠ | 27 వా | న |

**విజేతలు:** బాచరాజు విజయలక్ష్మి, తమ్మవరపు వెంకట సాయి సుచిత్ర, జి.మాధురి, కొండపర్తి కాంతామణి, గొట్టూరు సురేశ్‌బాబు, నాగుల రాజేందర్‌గౌడ్, ఎస్.లక్ష్మీదేవి, నాయని రాములు, శ్రీధర్ కులకర్ణి, ఎ.ప్రదీప్‌కుమార్, శ్రీమతి కాశీభట్ల సూర్యప్రభ, డా.అద్దంకి శ్రీనివాసరావు, ఎస్.వికాస్ చౌదరి, ముదిగొండ రాజశేఖర్, ఏ.రామజోగి అప్పారావు, యం.విజయలక్ష్మి, సురేష్ కుమార్‌రెడ్డి, టి.మరియ, ఆర్.అరుణ, కె.వి.ఎస్.ఎన్.గణేశ్‌కుమార్, ముద్దు రాజయ్య, తంగెళ్ళపల్లి మమన్‌బాబు, వి.పద్మారంగ నాథ్, వనమాల రామలింగాచారి, పులికంటిరాజేశ్వరరావు,

**ఈ వారం విజేత : ఆర్.అంజనీదేవి, విజయవాడ**




అరుణ

# అంతుచిక్కని ప్రేక్షకుల నాడి!

**కాలగమనం వేగంగా సాగిపోతోంది. కొత్త సంవత్సరంలో చూస్తుండగానే ఆరు నెలలు గడిచి పోయాయి. కానీ ప్రేక్షకుల నాడి దర్శక నిర్మాతల చేతికి ఇంతవరకూ చిక్కలేదు. ఏ తరహా చిత్రాలను జనాలు ఆదరిస్తారో అర్థంకాక తలలు పట్టుకుని కూర్చునే పరిస్థితి నెలకొంది.**

ఈ యేడాది ప్రథమార్ధంలో 155 సినిమాలు విడుదల అయ్యాయి. అందులో దాదాపు 120 స్ట్రయిట్ సినిమాలు. మిగిలినవి డబ్బింగ్ చిత్రాలు. జనవరి నుండి వరుసగా విజయవంతమైన చిత్రాలను చూస్తే ఏ తరహా చిత్రాలకు ప్రేక్షకులు పట్టం కడతారనే దానికి కొలమానం లేకుండా పోయింది. ఈ యేడాది తొలి మాసంలో 15 సినిమాలు విడుదలైతే, సెంటిమెంట్ ప్రధానమైన ఫక్తు కమర్షియల్ సినిమాలు 'వీరసింహారెడ్డి', 'వాల్తేరు వీరయ్య', 'వారసుడు' చిత్రాలను జనం మెచ్చారు. సంక్రాంతి సీజన్‌లో వచ్చిన ఈ మూడు సినిమాలు స్టార్స్ చేసినవి కావడం విశేషం. 'వారసుడు' తమిళ చిత్రమే అయినా, దాని నిర్మాత దర్శకులు, ప్రధాన పాత్రధారులు తెలుగువాళ్లే.

ఫిబ్రవరిలో తమిళ స్టార్ హీరో ధనుష్‌తో తెలుగువారే తీసిన 'సార్' చిత్రం ప్రేక్షకులను మెప్పించింది. అలానే చిన్న సినిమా 'రైటర్ పద్మ భూషణ్'కూ ప్రేక్షకులు పట్టం కట్టారు. వీటితో పాటు మరో మీడియం బడ్జెట్ మూవీ 'వినరో భాగ్యము విష్ణు కథ' ఫర్వాలేదనిపించింది. 'సార్' చిత్రంలో నేటి విద్యావిధానం లోని లోటుపాట్లను చూపిస్తే... 'రైటర్ పద్మభూషణ్'లో వినోదంతో పాటు మధ్యతరగతి మగువల ఆలోచనలకు ప్రాధాన్య మిచ్చారు. 'వినరో భాగ్యము విష్ణుకథ' వినోద ప్రధానమైన థ్రిల్లర్ మూవీ. ఈ మూడు కూడా భిన్నమైన చిత్రాలే. ఈ నెలలో 22 సినిమాలు వస్తే ఈ మూడే చెప్పుకోదగ్గ ఫలితాన్ని పొందాయి.

మార్చిలో ఏకంగా 34 సినిమాలు వచ్చాయి. అయితే తెలంగాణ నేపథ్య చిత్రాలకు చక్కని ఆదరణ లభించింది. అందులో చెప్పుకోదగ్గది 'బలగం'. కమెడియన్ వేణు తొలిసారి రూపొందించిన ఈ సినిమాలో మానవీయ విలువలు, దానికంటే కుటుంబ సభ్యుల మధ్య ఉండాల్సిన అనుబంధాలు, ఆత్మీయతల గురించి చూపించారు. నిజానికి ఇది కూడా మేకింగ్ పరంగా గొప్ప సినిమా ఏమీ కాదు. కానీ సినిమా మీద ఎలాంటి అంచనాలు లేకపోవడం, ఈ మధ్య కాలంలో ఈ తరహా బంధాలు, అనుబంధాలను చూపించే చిత్రం మరేది రాక పోవడం, దానికి తెలంగాణ గ్రామీణ నేపథ్యం జతకావడంతో ప్రజలు దీనిని అక్కున చేర్చుకున్నారు. పలు అంతర్జాతీయ సంస్థలు ఈ చిత్రానికి అవార్డులను అందచేశాయి. ఆ రకంగా మంచి చిత్రాలలో 'బలగం' ఒకటిగా నిలిచింది. ఇదే నెలలో వచ్చిన 'దసరా' కూడా తెలంగాణ నేపథ్య చిత్రమే. అయితే ఈ పాన్ ఇండియా సినిమాకు విషయం తక్కువ ప్రచారం ఎక్కువ అన్నట్టయ్యింది. తెలుగు రాష్ట్రాలలో తప్పితే... దీనిని ఎక్కడా ఎవరూ పట్టించుకోలేదు. నటీనటుల నటనతో సినిమా ఓ స్థాయిలో గుర్తింపు దక్కించుకుంది తప్పితే మరొకటి కాదు. కృష్ణవంశీ తెరకెక్కించిన మరాఠీ రీమేక్ 'రంగమార్తండ' కథలో కొత్తదనం లేకపోయినా... ఆర్టిస్టుల పెర్ఫార్మెన్స్‌తో ఫర్వాలేదనిపించుకుంది. ఈ సినిమా ప్రివ్యూ థియేటర్లలో టాక్‌కు పబ్లిక్ టాక్‌కు సంబంధం లేకపోయింది. ఓ రకంగా చెప్పుకోవాలంటే... ఇది ప్రివ్యూలో హిట్, థియేటర్‌లో ఫ్లాప్!




ఏప్రిల్‌లో 19 సినిమాలు వచ్చినా, ఈనెల అందరికీ చేదు అనుభవాన్ని మిగిల్చింది. ఒక్క సాయిధరమ్‌తేజ్ 'విరూపాక్ష' తప్ప మరేదీ విజయాన్ని అందు కోలేదు. దీనిని కూడా పాన్ ఇండియా సినిమాగా మొదట చెప్పినా, ముందు తెలుగులో, ఆ పైన ఇతర భాషల్లో విడుదల చేశారు. ఇది అవుట్ అండ్ అవుట్ హారర్ మూవీ. కొన్ని సన్నివేశాలు మోతాదుకు మించి ఉన్నాయి. దాంతో ఏ స్థాయిలో ప్రేక్షకాదరణ పొందుతుందో అనే సందేహం కూడా రాకపోలేదు. మొత్తం మీద హారర్ చిత్రాలకు ఇప్పుడు కాస్తంత మార్కెట్ ఉండటంతో ఇది మంచి విజయాన్ని సాధించింది. ఇదే నెలలో వచ్చిన "రావణాసుర, మీటర్, శాకుంతలం, ఏజెంట్' చిత్రాలు పరాజయం పాలయ్యాయి. మణిరత్నం రూపొందించిన 'పొన్నియన్ సెల్వన్-2' కూడా తెలుగుతో పాటు ఉత్తరాది వారినీ మెప్పించలేక పోయింది.

మే నెలలో డబ్బింగ్‌తో కలిపి 30 సినిమాలు జనం ముందుకు వచ్చినా వాటిలో పెద్ద చిత్రాలేవీ లేవు. మీడియం బడ్జెట్‌లో తెరకెక్కిన 'రామబాణం, ఉగ్రం, కస్టడీ' వంటివి ప్రేక్షకాదరణ పొందడంలో విఫలమయ్యాయి. 'బిచ్చగాడు-2' కాస్తంత ఫర్వాలేదనిపించింది. కానీ 'బిచ్చగాడు'కు లభించిన ఆదరణతో చూస్తే ఈ విజయం అసలు లెక్కలోకి రాదు. ఇందులో సిస్టర్ సెంటిమెంట్‌తో పాటు అవినీతికి వ్యతిరేకంగా, సామాన్య ప్రజల ప్రక్షాన కథానాయకుడు నిలబడటం అనేది ప్రేక్షకుల ఆమోదానికి కారణమైంది.


ఈ ఐదు నెలల్లో వచ్చిన చిత్రాలు అన్నీ ఒక ఎత్తుకాగా జూన్ లో విడుదలైన 'ఆదిపురుష్' మరో ఎత్తు. భారతీయులు ఎంతో గొప్పగా భావించే రామాయణ గ్రంథం ఆధారంగా రూపుదిద్దుకున్న ఈ సినిమా ప్రేక్షకుల మనసుల్ని చూరగొనడంలో విఫలమైంది. ఈ తరానికి నచ్చేలా 'ఆదిపురుష్' తీశానని దర్శకుడు ఓంరౌత్ చెప్పినా, వారు సైతం దానిని తిప్పికొట్టింది. తాము రామాయణాన్ని ఈ తరహాలో చూడాలని అనుకోవడం లేదని నిర్ద్వందంగా తేల్చి చెప్పింది. కొద్దోగొప్పో ప్రభాస్ మీద ఉన్న అభిమానంతో తెలుగు రాష్ట్రాలలో ఈ సినిమాను ఆదరించారు తప్పితే... మిగిలిన చోట్ల ఈమాత్రం కలెక్షన్లు కూడా లేవు. ఈ యేడాది ప్రథమార్ధంలో ముఖ్యంగా తెలుగువారిని తీవ్ర నిరాశకు గురిచేసిన సినిమా ఏదైనా ఉందంటే అది 'ఆదిపురుష్'. ఆ గాయం మానడానికి కొంత సమయం పడుతుంది. జూన్ మాసంలో అత్యధికంగా 35 చిత్రాలు విడుదలయ్యాయి. ఈ నెలాఖరులో రాబోతున్న నిఖిల్ 'స్పై' మూవీ కూడా పాన్ ఇండియా స్థాయిలోనే తెరకెక్కింది. నేతాజీ సుభాష్ చంద్రబోస్ మరణానికి సంబంధించిన అంశాలతోనే ఈ సినిమా రూపుదిద్దుకుంది. 'కార్తికేయ-2'తో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న నిఖిల్ 'స్పై'తో తిరిగి తెలుగు సినిమా గౌరవాన్ని నిలబెడతాడేమో చూడాలి.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్


# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు




వెల : ₹.220/-




వెల : ₹.200/-




వెల : ₹.390/-




వెల : ₹.250/-




వెల : ₹.250/-




వెల : ₹.100/-



వెల : ₹.100/-



వెల : ₹.200/-




వెల : ₹.100/-




వెల : ₹.150/-




వెల : ₹.799/-




వెల : ₹.499/-



వెల :₹.495/-



వెల : ₹.799/-



వెల : ₹.549/-

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : 3-4-852, కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27.

040-27563236, 9290127329

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, గవర్నరు పేట, విజయవాడ - 2, దూరవాణి : 8333812687

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2021-2023; RNI Regd. No. 3270/57.
Volume : 75 Issue : 37

ASWINI®

# వైద్యులు సైతం విశ్వసించేది
# అశ్విని హెయిర్ ఆయిల్‌నే

## అశ్విని హెయిర్ ఆయిల్ జుట్టురాలడం, చుండ్రుని అరికట్టడంలో ప్రతిభావంతంగా ఉంటుందని వైద్యులు సైతం నమ్ముతున్నారు.





**డా॥ ధర్మేంద్ర దూబే,**
ముంబయ్, మహారాష్ట్ర.

"అశ్విని హెయిర్ ఆయిల్‌లో వాడే ప్రత్యేకమైన పదార్థాలు, జుట్టు మూలాలని పటిష్టం చేసి, చుండ్రు నుంచి సంరక్షిస్తాయి. సహజమైన జుట్టు రంగుని కొనసాగించ డంలో సహకరిస్తుంది. అందుకే నేను నా పేషెంట్స్‌కి అశ్విని హెయిర్ ఆయిల్‌నే వాడమని సలహా ఇస్తాను. అలా వాడిన వారిలో తొంభై శాతం మందికి అనుకూల ఫలితాలొచ్చాయి."



**డా॥ ప్రషీద,**
కోయంబత్తూర్, తమిళనాడు.

"అశ్విని హెయిర్ ఆయిల్‌ని నేను నమ్ముతాను. ఎందుకంటే ఇది ఒక సహజ ఉత్పత్తి. అశ్విని హెయిర్ ఆయిల్‌లో వాడే పదార్థాల వల్ల జుట్టు మూలాలకు రక్త ప్రసరణ పెరిగి జుట్టు పెరగడటమే కాక చుండ్రునీ అరికడుతుంది. జుట్టు పెరగడానికి కూడా అశ్విని హెయిర్ ఆయిల్ సశాస్త్రీయమైన పరిష్కారం అని నిరూపితమైంది. అలాగే మీరు అశ్విని హెయిర్ ఆయిల్‌ని క్రమబద్ధంగా వాడడం వల్ల జుట్టు రాలిపోదు."



**డా॥ సుమనా నైల్,**
చెన్నై, తమిళనాడు.

"ప్రతివారూ తాము ఉపయోగించే హెయిర్ ఆయిల్ ఎంపికలో చాలా జాగ్రత్తలు వహించాలి. అశ్విని హెయిర్ ఆయిల్‌లో వాడే కల్తీలేని శుద్ధ కొబ్బరి నూనె వల్ల ఇది సురక్షితమైనదిగా నేను భావిస్తాను. ఇందులో లిక్విడ్ పారాఫిన్ (LLP)లు ఉండవు. అలాగే జుట్టు రాలడానికి కారణమైన నిల్వ ఉండే రసాయనాలూ అశ్విని హెయిర్ ఆయిల్‌లో ఉండవు."

శుద్ధమైన కొబ్బరినూనె మూలమే
మినరల్ ఆయిల్ వాడనిది
నిల్వవెట్టిన పదార్థాలు కలవనిది




* Personal Opinion.

**జుట్టురాలడాన్ని అరికడుతుంది చుండ్రు నుంచి రక్షిస్తుంది**

**అశ్విని® హోమియో ఆర్నికా హెయిర్ ఆయిల్ + అశ్విని® అధునా™ అమ్లా షాంపూ**

అశ్విని హెయిర్ ఆయిల్ ప్రతిరోజు ఆమ్లా షాంపూ వారానికి మూడుసారు వాడడం వల్ల జుట్టు రాలడం తగ్గుతుంది.

**Customer Care Toll Free Number : 18008435599**
e-mail : customercare@aswini.com | www.aswini.com